# దారి దీపం

మాసపత్రిక

DAARI DEEPAM - RNI Title Code : APTEL 16175

సంపుటి 3 - సంచిక 3 | డిసెంబరు 2024 | వెల : రూ.15


రాజ్యాంగానికి రక్ష పౌర సమాజమే

రాజ్యాంగ రక్షణే నేటి తక్షణ కర్తవ్యం

అదానీ-జగన్‌రెడ్డి ముడుపుల చెలగాటం : ఇరకాటంలో నరేంద్రమోడీ-చంద్రబాబు !

కులరహిత వ్యవస్థకు తొలి అడుగు కులగణన

సమగ్ర కులగణనతోనే సమాజ గమనం

కుల గణన : పది పాక్షిక సత్యాలు

కుల నిర్మూలన సాధించే మార్గం

దేశ సరిహద్దులు దాటిన కులం

హిందూయిజం అంటే ఏమిటి?

పెట్టుబడిదారులకు ద్రవ్య బదలాయింపులు

జిల్లాల ఆర్థిక అసమానతలు, వెనుకబాటుతనం

భారతీయ వితంతు వ్యవస్థ మీద చర్చకు దోహదం చేసే పుస్తకం

ప్రజా కవి, మార్క్సిస్టు పరిశోధక భావుకుడు ఆరుద్ర

మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి!

నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం

2025 జనవరి 26 ప్రజా రిపబ్లిక్ దినోత్సవంగా నిర్వహించుకుందాం

డిసెంబరు - 2024

పేజీలు : 44

# దారి దీపం

## మాసపత్రిక

సంపుటి : 3 - సంచిక : 3

డీవీవీఎస్ వర్మ
- సంపాదకులు

సంపాదక వర్గం
కొప్పర్తి వెంకటరమణమూర్తి
మందలపర్తి కిషోర్
డి.సోమసుందర్
డా॥ బి.రమేష్ చంద్రబాబు

వెల : 15 రూపాయలు

ఈ సంచికలో..

1) రాజ్యాంగానికి రక్ష పౌర సమాజమే - సంపాదకీయం 3
2) రాజ్యాంగ రక్షణే నేటి తక్షణ కర్తవ్యం - జి.కిషోర్‌కుమార్ 4
3) అదానీ-జగన్‌రెడ్డి ముడుపుల చెలగాటం : ఇరకాటంలో నరేంద్రమోడీ-చంద్రబాబు ! - ఎం కోటేశ్వరరావు 5
4) కులరహిత వ్యవస్థకు తొలి అడుగు కులగణన - జస్టిస్ ఈశ్వరయ్య 7
5) సమగ్ర కులగణనతోనే సమాజ గమనం - మల్లెపల్లి లక్ష్మయ్య 9
6) కుల గణన : పది పాక్షిక సత్యాలు - యోగేంద్ర యాదవ్ 11
7) కుల నిర్మూలన సాధించే మార్గం - ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్ 13
8) దేశ సరిహద్దులు దాటిన కులం - అశోక్ ధనావత్ 18
9) హిందూయిజం అంటే ఏమిటి? - బి.జయమోహన్ 21
10) పెట్టుబడిదారులకు ద్రవ్య బదలాయింపులు - ప్రభాత్ పట్నాయక్ 27
11) జిల్లాల ఆర్థిక అసమానతలు, వెనుకబాటుతనం - డా బి.గంగారావు, 30
12) భారతీయ వితంతు వ్యవస్థ మీద చర్చకు దోహదం చేసే పుస్తకం - వంగాల సంపత్‌రెడ్డి 32
14) ప్రజా కవి, మార్క్సిస్టు పరిశోధక భావుకుడు ఆరుద్ర -తెలకపల్లి రవి 35
15) మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి! - లెనిన్ 38
16) రండి ప్రతిజ్ఞ చేద్దాం 40
17) నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం 41
18) 2025 జనవరి 26 ప్రజా రిపబ్లిక్ దినోత్సవంగా నిర్వహించుకుందాం 42
19) కార్టూన్స్ 43
20) కొత్త పుస్తకాల స్వీకారం.. 44




కార్టూన్ : సతీష్ ఆచార్య ఫేస్‌బుక్ సౌజన్యంతో..

వివరాలకు సంప్రదించండి : డా॥ బి.రమేష్ చంద్రబాబు, 34-15-1, దొడ్డిపట్ల వారి తోట వీధి, తణుకు - 534211, ప.గో.జిల్లా, ఏపీ ఫోన్ : 93971 14495

దారి దీపం గత సంచికల కోసం : **DVVSVARMA.COM**

## దారి దీపం

మాసపత్రిక

**మీ విరాళాలను ఈ క్రింది అకౌంట్‌కు పంపండి**

**Daari Deepam**
Union Bank of India
Branch : TANUKU
**A/C No : 0554 1101 0000 054**
**IFSC code : UBIN0805548**

మీ పేరు విరాళం వివరాలను..
డాక్టర్ బి.రమేష్ చంద్రబాబు
నంబరుకు విధిగా
వాట్సాప్ మెస్సేజ్ పెట్టండి.
ఫోన్ నెంబరు 93971 14495



# రాజ్యాంగానికి రక్ష పౌర సమాజమే

రాజ్యాంగమే దిక్సూచిగా మన దేశాన్ని నడిపిస్తున్నది. ప్రజలందరికీ స్వేచ్ఛనీ, సమానత్వాన్నీ, ప్రాథమిక హక్కులనీ ప్రసాదించింది. ప్రజల ప్రజాస్వామిక హక్కులను రక్షణ కవచంగా వుంది. ఇంతటి గొప్ప రాజ్యాంగం కూడా తనని తాను రక్షించుకోలేదు. అందుకే తన రక్షకుల్ని ఏర్పాటు చేసుకుంది. చట్ట సభలకు ఎన్నికైన వారు, పదవీ బాధ్యతలు చేపట్టి పరిపాలకులుగా వున్న వారు రాజ్యాంగానికి బద్ధులమై వుంటామనే ప్రమాణాన్ని తప్పనిసరి చేసింది. గత పార్లమెంటు ఎన్నికలలో 400 పైగా సీట్లు వస్తే వెయ్యేళ్లపాటు చిరస్థాయిగా వుండే మార్పులు తెస్తానని మోదీ ప్రకటించారు. దీనిలోగుట్టును ఆయన దాచిపెట్టారు. కాని, బీజేపీ పార్లమెంటు సభ్యులు అనంత కుమార్ హెగ్డే, ధర్మపురి అరవింద్‌తో సహా చాలా మంది ఆ గుట్టు విప్పారు. తగిన మెజారిటీ వస్తే రాజ్యాంగాన్ని సవరించడమే కాదు. "రాజ్యాంగాన్ని మారుస్తామని, లౌకిక పదాన్ని తొలగిస్తామని" కుండబద్దలు కొట్టారు. ఇవన్నీ వారి వ్యక్తిగత అభిప్రాయాలుగా కొట్టి పారేసినా వారిపై ఎలాంటి చర్యలు తీసుకోకపోవడంలోని ఆంతర్యం అందరికి తెలిసిందే.

బీజేపీ మాతృసంస్థ ఆర్‌ఎస్‌ఎస్ నేతలు ప్రతి రోజూ "హిందూ రాష్ట్ర నినాదాన్ని" పారాయణం చేస్తున్నారు. హిందూ రాజ్యం అన్న నినాదం రాజ్యాంగానికి విరుద్ధం. ఈ నినాదాన్ని మోదీతో సహా బీజేపీ నేతలు ఎవరూ తప్పు పట్టలేదు. పైగా రాజ్యాంగం మీద శ్రీరంగనీతులు వల్లిస్తున్నారు. నిజంగా మోదీకి రాజ్యాంగంపట్ల విధేయత వుంటే 'హిందూ రాష్ట్ర' నినాదాన్ని రాజ్యాంగ వ్యతిరేకమైందిగా ప్రకటించాలి. మోదీ ఆ పని చెయ్యరు. ఎందుకంటే 'హిందూ రాష్ట్ర' సాధనకే ఆయన పావులు కదుపుతున్నారు. మత రాజ్యాలలో దేశ ప్రజలందరూ సమానులు కారు. రాజ్యాంగ స్థానాన్ని మత గ్రంధాలు ఆక్రమిస్తాయి. ప్రజాస్వామ్యం, పౌరహక్కులు మృగ్యం అవుతాయి. పాలకులే భక్షకులైతే రాజ్యాంగానికి రక్షణ ఎక్కడ వుంటుంది ?

రాజ్యాంగ రక్షణ ప్రధాన లక్ష్యంగా ఏర్పడిన మరో వ్యవస్థ న్యాయస్థానాలు. న్యాయమూర్తులు విధిగా రాజ్యాంగ పరిరక్షకులై వుండాలి. వారు ఇచ్చే తీర్పులు రాజ్యాంగ బద్ధమైనవిగా వుండి తీరాలి. ఢిల్లీ హైకోర్టు న్యాయమూర్తులు ప్రతిభాసింగ్ ఒక సభలో మాట్లాడుతూ 'మను ధర్మశాస్త్రం, స్త్రీ ఔన్నత్యాన్ని చాటి చెప్పిందని ప్రకటించారు. "నస్త్రీ స్వాతంత్ర్య మర్హతి" అనీ, స్త్రీలు చిన్నప్పటి నుంచి మరణించే వరకు ఎవరో ఒకరి అధీనంలో ఉండాలన్నది స్త్రీల స్వేచ్ఛ, సమానత్వాలకు విరుద్ధమైనదే కాదు అది రాజ్యాంగ వ్యతిరేకమైనదన్న స్పృహ లేకుండా మాట్లాడారు. ఇటీవల విశ్వహిందూ పరిషత్ సభలో అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి శేఖర్‌కుమార్ మాట్లాడుతూ మెజారిటీ వాదం ప్రకారమే దేశం నడుస్తుందని ప్రకటించారు. ఇంకా మత ద్వేషమైన వ్యాఖ్యలు చేశారు. 1991 దేవాలయాల చట్టానికి వ్యతిరేకంగా వివిధ కోర్టులలో వ్యాజ్యాలు స్వీకరించడం, తీర్పులు చెప్పడం రాజ్యాంగ విరుద్ధమైన పోకడలే. కంచే చేను మేస్తున్నట్లున్నాయి. న్యాయమూర్తులు రాజ్యాంగం పట్ల అనుసరిస్తున్న వైఖరి రాజ్యాంగానికి ప్రమాద సూచికలుగా కనిపిస్తున్నాయి.

ఈ పరిస్థితుల్లో రాజ్యాంగ రక్షణ బాధ్యతను రాజకీయానికి, న్యాయవ్యవస్థకు వదిలేస్తే విపరిణామాలు చోటు చేసుకుంటాయి. రాజ్యాంగ పరిరక్షణకు పౌరసమాజం రంగంలోకి దిగాల్సిన తరుణం ఆసన్నమైంది. రాజ్యాంగంతో పరిచయం వున్న మధ్య తరగతికి చెందిన పౌరసమాజ సంస్థలు ఈ రాజ్యాంగ వ్యతిరేక ధోరణులపై గళం విప్పాలి. రాజ్యాంగానికి బద్ధులై పాలన సాగించాలని, న్యాయమూర్తులు రాజ్యాంగ రక్షకులుగా వ్యవహరించాలని, ఎలుగెత్తిచాటాలి. భావితరాలకు చెందిన యువతకు, విద్యార్థులకు రాజ్యాంగ విలువలను పరిచయం చేయాలి. రాజ్యాంగానికి ధోకా లేని భవిష్యత్తుకు పునాదులు వేయాలి. రాజ్యాంగమంటే ఓట్ల చుట్టూ తిరుగుతుంది. పేదలు, సామాన్యులు చైతన్యవంతులైతే రాజకీయం దారి మార్చుకుంటుంది. పేదలను, శ్రమజీవులను లబ్ధిదారులు కాదని రాజ్యాంగంలో హక్కుదారులన్న ఆకాంక్షను వారికి కల్పించాలి. పౌరసమాజ సంస్థలు ఈ త్రిముఖ కర్తవ్యాలను నెరవేర్చడం ద్వారా రాజ్యాంగానికి రక్షకులు కావాలి. ❑

**- డీవీవీఎస్ వర్మ, సంపాదకులు, 85006 78977**

# రాజ్యాంగ రక్షణే నేటి తక్షణ కర్తవ్యం



- జి.కిషోర్‌కుమార్

స్వతంత్ర భారత రాజ్యాంగాన్ని రూపొందించడంలో ప్రధాన పాత్రను నిర్వహించడమే కాక, మనదేశంలో అస్పృశ్యతా నివారణకు, కుల నిర్మూలన, ఛాందస భావాలకు, మూఢ విశ్వాసాలకు వ్యతిరేకంగా తన జీవితాంతం కృషిచేసిన మహావ్యక్తి డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ 133వ జయంతిని దేశం జరుపుకుంటోంది. కఠోరమైన పరిశ్రమ, నిరంతరమైన పఠనా వ్యాసంగం, అచంచలమైన దీక్ష ఆయనను ప్రపంచంలో ప్రథమ శ్రేణిలో నిలబెట్టాయి. అంబేద్కర్ పుస్తకాలకే ఎక్కువ ఖర్చు పెట్టేవారు. ఆయన లండన్‌లో ఒక్క నిమిషం కూడా వృథా కాకుండా చదివేవారు. బ్రిటీష్ మ్యూజియంలోని గ్రంథాలే కాక ఇండియా ఆఫీసు గ్రంథాలయం, నగర గ్రంథాలయంలో ఎక్కువ సేపు గడిపేవారు. న్యాయశాస్త్రం ఒక్కటే కాకుండా అర్థశాస్త్రంలో యమ్.యస్.సి. డాక్టరేట్ పట్టా కోసం విశేష కృషిని సల్పి రెండేళ్ళ వ్యవధిలో మూడు పట్టాలు సాధించారు. 1921లో లండన్ విశ్వవిద్యాలయానికి 'ప్రావిన్షియల్ డీసెంట్రలైజేషన్ ఆఫ్ ఇంపీరియల్ ఫైనాన్స్ ఇన్ బ్రిటీష్ ఇండియా' అనే పరిశోధన పత్రాన్ని సమర్పించి యమ్.యస్.సి. పట్టా పొందారు. 'ప్రోబ్లమ్ ఆఫ్ ది రూపీ' అనే వ్యాసం సమర్పించి బి.యస్.సి. పట్టా పొందారు. అంబేద్కర్ బారిస్టర్ వృత్తిలో ఉన్నప్పుడు ఒక సందర్భంలో బొంబాయి గాంచ్ కోర్టులో ఒక కేసు విషయమై ఏడుగంటలు ఏకధాటిగా ఇంగ్లాండ్, భారతదేశ న్యాయస్థానాల తీర్పులను ఉదహరిస్తూ వాదించారు. 'నేషనల్ డివిడెండ్ ఆఫ్ ఇండియా – ఎ హిస్టారికల్ అండ్ అనలిటికల్ స్టడీ' అనే దానిపై ఆయన రాసిన పరిశోధన వ్యాసానికి కొలంబియా విశ్వ విద్యాలయం డాక్టరేట్ ఇచ్చింది.

డాక్టర్ అంబేద్కర్ తన చిన్నతనంలోనూ, స్కూల్‌లో చదువుకునే రోజుల్లోనూ అనేక అవమానాలను అనుభవించారు. ఆ అనుభవాలు ఆయనలో వ్యవస్థ పట్ల ద్వేషాన్ని పెంచాయి. విద్యాభ్యాసం చేసి అమెరికా నుండి తిరిగి వచ్చినప్పటి నుండి ఆయన అణగారిన వర్గ ప్రజలలో చైతన్యాన్ని పెంపొందించి, వారిలో బానిస ప్రవృత్తిని నిర్మూలించేందుకు, మానవ హక్కులు, సమానత్వం కోసం వారు పాటు పడేటట్లు నిర్విరామంగా కృషి చేశారు. బహిరంగ చెరువుల్లో నీరు తాగే హక్కు కోసం మహద్‌లో 1927లోనూ, 1930లో నాసిక్ దేవాలయ ప్రవేశం కోసం పోరాడేందుకు అస్పృశ్యులనబడే వారిని సమీకరించి పోరాటాలు నిర్వహించారు.

ప్రభుత్వం ఎలా ఉండాలి అనే అంశంపై 1930 నవంబర్‌లో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతూ **'నేడున్న ఆర్థిక, సాంఘీక అసమానతలను తొలగించేందుకు భయపడని ప్రభుత్వం మనకుండాలి. ఆ పాత్రను బ్రిటీష్ ప్రభుత్వం ఏ మాత్రం పోషించజాలదు. ప్రజలచే, ప్రజల కోసం ఎన్నుకోబడే ప్రజా ప్రభుత్వమే దాన్ని నిర్వహించడం సాధ్యమవుతుంది'** అని స్పష్టం చేశారు. మొత్తం రాజకీయ పరిష్కారంలో భాగంగా దళిత వర్గాల సమస్య పరిష్కరించబడాలని, వారికి స్థానం ఉండేలా రాజకీయ యంత్రాంగం మారాలని ఆయన చెప్పారు.

1937 సెప్టెంబర్‌లో మసూర్‌లో జరిగిన దళిత మహాసభలో అధ్యక్షోపన్యాసమిస్తూ 'సాంఘీక, ఆర్థిక సమానత్వం' అనే లక్ష్యాల ద్వారా మాత్రమే సామాన్య మానవునికి తన అభిమతానుసారం స్వేచ్ఛగా పురోగమించడానికి అవకాశాలు ఏర్పడగలవని, ఉత్పత్తి సాధనాలు కొద్దిమంది చేతుల్లోనే ఉండి దోపిడీ చేయడానికి వీలున్నంత వరకు సామాన్య మానవుడు అభివృద్ధి చెందడానికి ఏమాత్రం అవకాశం ఉండదు' అని అంబేద్కర్ అన్నారు. 1938లో కొంకణ్‌లో భూస్వామ్య వ్యవస్థ రద్దు కోసం జరిగిన రైతాంగ ప్రదర్శనలో పాల్గొన్నారు.

ప్రపంచ చరిత్ర అంతా వర్గ సమాజ చరిత్రే. ఇందుకు ఇండియా మినహాయింపు కాదు. వర్గంలోనే కులం ఇమిడి ఉందని ఆయన మన దేశంలోని వర్గ వ్యవస్థ గురించి వివరించారు. 'రాష్ట్రాలు – మైనారిటీలు' అన్న అంశం మీద రాజ్యాంగం నిర్మాణ సభకు షెడ్యూల్డ్ కులాల ఫెడరేషన్ తరుపున సమర్పించిన డాక్యుమెంట్‌లో అంబేద్కర్ ప్రణాళికాబద్ధ ఆర్థిక విధానాన్ని కోరుకున్నారు.

మౌలికమైన కీలక పరిశ్రమలు, ఇన్సూరెన్స్ ప్రభుత్వ ఆధీనంలో ఉండాలని, సాగుకు అనుకూలమైన భూములకు పరిహారం చెల్లించి, ప్రభుత్వం స్వాధీనం చేసుకుని, పేద రైతులకు, భూమి లేని పేద వ్యవసాయ కార్మికులకు పంచాలన్నారు. సమిష్టి వ్యవసాయ క్షేత్రాలను నెలకొల్పాలని, మైనారిటీలకు తగు రక్షణ కల్పించాలని కోరారు.

గొప్ప మేధావి, న్యాయశాస్త్రంలో నిష్ణాతుడైన అంబేద్కర్‌ను స్వాతంత్ర్య భారతదేశంలో కాంగ్రెస్ పార్టీ ఏర్పాటు చేసిన కేంద్ర ప్రభుత్వంలో మంత్రిగా తీసుకున్నారు. హిందూ కోడ్ బిల్లు ద్వారా స్త్రీలకు ఆస్తి హక్కు కల్పించేందుకు ఆయన చేసిన కృషికి నెహ్రూ ప్రభుత్వం **(మిగతా 6వ పేజీలో)**

# అదానీ-జగన్‌రెడ్డి ముడుపుల చెలగాటం : ఇరకాటంలో నరేంద్రమోడీ-చంద్రబాబు !



- ఎం కోటేశ్వరరావు

**వివాదాస్పద పారిశ్రామిక, వాణిజ్యవేత్త గౌతమ్ అదానీ పరివారపు లంచాల బాగోతం బట్టబయలైంది. హరిత ఇంధన కొనుగోళ్ల వ్యవహారంలో రాష్ట్రాలలో అధికారంలో ఉన్న వారికి 26.5 కోట్ల డాలర్ల మేరకు ముడుపులు చెల్లించిందని రెండు కేసులు దాఖలయ్యాయి. అమెరికాలోని న్యూయార్క్ కోర్టులో నవంబరు 20న ఒక కేసును న్యాయశాఖ, మరో కేసును సెక్యూరిటీలు మరియు ఎక్సేంజీల నియంత్రణ సంస్థ వేసింది. ముడుపుల మొత్తంలో సింహభాగం ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో వైఎస్ జగన్మోహనరెడ్డికి ముట్టిందని చెబుతున్నారు. అసలు తమ నేత అదానీ కంపెనీలతో ఎలాంటి ఒప్పందమూ కుదుర్చుకోలేదని కేంద్ర ప్రభుత్వ సంస్థ సోలార్ ఎనర్జీ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా(సెకి)తో డిస్కమ్‌ల ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని, ఒక ప్రభుత్వ రంగ సంస్థ ఎక్కడైనా లంచాలు ఇస్తుందా అని వైసీపీ ఒక ప్రకటనలో అమాయకత్వాన్ని ప్రదర్శించింది. అమెరికా కోర్టులో దాఖలు చేసిన కేసుల పత్రాలలో పేర్కొన్నదాని మేరకు సంక్షిప్తంగా..**

తాను స్వంతంగా లేదా ప్రైవేటు సంస్థలు ఉత్పత్తి చేసిన హరిత విద్యుత్‌ను సెకి కొని అవసరమైన వారికి విక్రయిస్తుంది. ఆ మేరకు 2019 డిసెంబరు, 2020 జూలై మధ్య కాలంలో కేంద్ర పునరుత్పాదక ఇంధన మంత్రిత్వశాఖ కంపెనీ సెకి ద్వారా అదానీ కంపెనీ, మరో అమెరికా కంపెనీ అజూర్ పవర్ నుంచి పన్నెండు గిగావాట్ల విద్యుత్ కొనుగోలుకు అంగీకరించింది. దానిలో అదానీ ఎనిమిది, అమెరికా కంపెనీ నాలుగు గిగావాట్లు సరఫరా చేయాలి. విద్యుత్‌ను నిలువ చేయటానికి వీలుండదు గనుక తమ దగ్గర నుంచి కొనుగోలు చేసే వారి కోసం సెకి ప్రయత్నించింది. ఒప్పందాలు చేసుకుంటేనే సదరు కంపెనీలు విద్యుత్‌ను ఉత్పత్తి చేయాల్సి ఉంటుంది.

అసలు కథ ఇక్కడి నుంచి ప్రారంభమైంది. అమెరికా న్యాయ శాఖ ఆరోపించిన మేరకు గౌతమ్ అదానీ, అతగాడి మేనల్లుడు



సాగర్ అదానీ, వినీత్ జైన్ మరో ఐదుగురు రాష్ట్రాలలో ఉన్న పాలకులు, అధికారులకు ముడుపుల బాగోతానికి తెరతీశారు. అమెరికా, ఇతర దేశాల నుంచి అదానీ కంపెనీలో పెట్టుబడులు పెట్టే వారికి తెలియకుండా ఈ అక్రమాన్ని దాచి అమెరికా చట్టాల ప్రకారం మోసం చేశారు. సెకి నుంచి ఎవరైనా విద్యుత్‌ను కొనుగోలు చేస్తేనే అదానీ, అమెరికా కంపెనీలు ముందుకు పోవాల్సి ఉంటుంది. అయితే సెకి ధర ఎక్కువగా ఉండటంతో భారీ మొత్తంలో విద్యుత్‌ను కొనుగోలు చేసేందుకు రాష్ట్రాలేవీ ముందుకు రాలేదు. అదానీ, అమెరికా కంపెనీల పెద్దలు కూర్చుని రాష్ట్రాలు విద్యుత్ కొనుగోలు ఒప్పందాలు చేసుకోవాలంటే ఆయా రాష్ట్రాల నేతలు, అధికారులకు తామే ముడుపులు చెల్లించి సెకితో ఒప్పందాలు చేయించాలని పథకం వేశారు. దాని ప్రకారమే అంతా జరిగింది. అమెరికా కేసులో దాఖలు చేసిన వివరాల ప్రకారం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిని, గౌతమ్ అదానీ అందుకోసమే కలిశారన్నది ఆరోపణ. ఆ తరువాతే 2021 డిసెంబరులో ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు సెకితో ఒప్పందాలు చేసుకున్నాయని చెబుతున్నారు. అంటే ముడుపుల బేరసారాలకే వారి కలయిక అన్నది స్పష్టం.

ఇక ఈ ఒప్పందం గురించి ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు తాజాగా అధికారంలోకి వచ్చిన తరువాత విడుదల చేసిన శ్వేతపత్రాల సందర్భంగా చెప్పిందేమిటి ? సెకి నుంచి యూనిట్‌కు రూ.2.49 చొప్పున ఏడు వేల మెగావాట్లు ఆంధ్రప్రదేశ్ కొనుగోలు చేసింది. మూడు వేల మెగావాట్లు 2024 సెప్టెంబరు నుంచి, మరో మూడు వేల మెగావాట్లు 2025 సెప్టెంబరు, మిగిలిన వెయ్యి 2026 సెప్టెంబరు నుంచి సరఫరా చేయాలి. అయితే ఒప్పంద సమయంలో మార్కెట్లో యూనిట్ ధర రూ.1.99 మాత్రమే ఉందని, సెకితో ఒప్పందం

వలన ఏటా వినియోగదారులపై రూ.850 కోట్ల మేర అదనపు భారం పడుతుందని, సోలార్ విద్యుత్ ప్లాంట్లకు విద్యుత్ నెట్‌వర్క్‌తో అనుసంధానం చేసేందుకు చెల్లించాల్సిన సరఫరా ఛార్జీల భారాన్ని ఏటా మూడు నుంచి మూడున్నర వేల కోట్ల రూపాయలను రాష్ట్ర ప్రభుత్వం భరించాల్సి ఉంటుందని, ఇవన్నీ కలుపుకుంటే ఒప్పంద గడువు పాతిక సంవత్సరాలలో 62 వేల కోట్ల రూపాయల భారం పడుతుందని చంద్రబాబు నాయుడు చెప్పారు. దీని మీద మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి (పార్టీ ద్వారా విడుదల చేసిన ప్రకటన) ఏమంటున్నారు ?

గతంలో చంద్రబాబునాయుడి ప్రభుత్వం చేసుకున్న ఒప్పందాల ప్రకారం యూనిట్ ధర రూ.5.10కి చేరింది. ఈ భారాన్ని తగ్గించేందుకు పది వేల మెగావాట్ల సౌర విద్యుత్ తయారీకి జగన్ సర్కార్ నిర్ణయించింది. దానిలో భాగంగా 2020 నవంబరులో 6,400 మెగావాట్ల కోసం ఏపీ గ్రీన్ ఎనర్జీ కార్పొరేషన్ ద్వారా టెండర్లు పిలిచింది. యూనిట్ రూ.2.49, 2.58 చొప్పున సరఫరా చేసేందుకు 24 టెండర్లు వచ్చాయి. అయితే న్యాయపరమైన సమస్యలతో వాటిని రద్దు చేసింది. ఆ తరువాత యూనిట్ ధర రూ.2.49కి సరఫరా చేసేందుకు సెకి ముందుకు వచ్చింది. అది 2019 జూన్‌లో ఒప్పందాలను కుదుర్చుకున్న సంస్థల నుంచి సరఫరా చేస్తుంది. విద్యుత్ సరఫరా చార్జీలను మినహాయించేందుకు సెకి అంగీకరించింది. దీని వలన ఏటా రాష్ట్రానికి రూ.3,700 కోట్ల మేర ఆదా అవుతుంది. చంద్రబాబు నాయుడు విద్యుత్ సరఫరా ఛార్జీల భారం రాష్ట్రం మీద పడుతుందని అంటే జగన్మోహనరెడ్డి లేదని చెబుతున్నారు. ఏది వాస్తవమో రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా ప్రకటించాలి. ఒప్పంద పత్రాలను జనాల పరిశీలనకు అందు బాటులో ఉంచాలి. అప్పుడే నిజం తెలుస్తుంది.

అమెరికాలో దాఖలైన కేసు జగన్‌మోహనరెడ్డి లేదా ఇతర రాష్ట్రాలలో ఒప్పందం చేసుకున్న వారి మీద కాదు. అమెరికా, అంతర్జాతీయ మదుపుదార్లను ముడుపుల గురించి మభ్యపెట్టి అదానీ కంపెనీ మోసం చేసిన దాని గురించి మాత్రమే. సూది కోసం సోదికి పోతే పాత గుట్టంతా రట్టయినట్లుగా ఈ క్రమంలో ముడుపుల బాగోతం బయటపడింది. అదానీ అండ్ కో మొత్తం 26.5 కోట్ల డాలర్లు (మన కరెన్సీలో రూ.2,209 కోట్లు) ముడుపులుగా ఇచ్చారని, ఈ మొత్తంలో రూ.1,750 కోట్లు ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలను ఒప్పించటానికి ఇచ్చినట్లు అమెరికా ప్రభుత్వం ఫిర్యాదు చేసింది. ఆ మేరకు ముడుపులకు ఒప్పించిన తరువాత ఒడిషా, జమ్ము అండ్ కాశ్మీరు, తమిళనాడు, చత్తీస్‌ఘర్, ఆంధ్రప్రదేశ్ విద్యుత్ పంపిణీ సంస్థలు ఒప్పందాలు చేసుకున్నాయి. సెకి ఒప్పందాల ప్రకారం ఆంధ్రప్రదేశ్‌కు అదానీ సంస్థ ఏడు వేల మెగావాట్లు, అమెరికా సంస్థ 650 మెగావాట్లను మిగిలిన నాలుగు రాష్ట్రాలకు సరఫరా చేయాలి. ముడుపుల గురించి దర్యాప్తు చేసేందుకు పూనుకున్న ప్రభుత్వానికి ఆటంకాలు కల్పించినట్లు అమెరికన్ ఎఫ్‌బీఐ (మన సీబీఐ వంటిది) అధికారి ఫిర్యాదు చేశాడు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంతో సెకి ఒప్పందం కుదుర్చుకోక ముందు 2021 ఆగస్టులో సీఎం జగన్‌మోహనరెడ్డితో గౌతమ్ అదానీ వ్యక్తిగతంగా కలిసినట్లు కేసులో పేర్కొన్నారు. ఈ సమావేశంలో ముడుపులు చెల్లించటం లేదా ఇచ్చేందుకు అదానీ వాగ్దానం చేసినట్లు, ఆ కారణంగానే ఒప్పందం చేసుకున్నట్లు అమెరికా సెక్యూరిటీస్ సంస్థ దాఖలు చేసిన కేసు 80, 81 పేరాలలో పేర్కొన్నది. అదానీ గ్రీన్ మరియు అజూర్ పవర్ అంతర్గత వర్తమానాలలో సెకీ నుంచి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం విద్యుత్ కొనుగోలుకు అంగీకరించింది అనే సమాచారం ఉన్నట్లు మరో మాటలో చెప్పాలంటే ముడుపులు చెల్లించటం లేదా వాగ్దానం పనిచేసినట్లు కూడా పేర్కొన్నది. ఒక మెగావాట్‌కు రూ.25 లక్షలు చెల్లించేట్లు ఆ మొత్తం రూ.1,750 కోట్లని, అదానీ కంపెనీ అంతర్గత రికార్డుల్లో వున్న అంశం దీనికి దగ్గరగా ఉందని చెప్పింది. ఇవన్నీ తమ మీద చేసిన నిరాధార ఆరోపణ లు మాత్రమేనని, నేరం రుజువయ్యే వరకు నిందితులుగానే పరిగణించాలని అదానీ కంపెనీ వివరణ ఇచ్చింది.

అమెరికా కోర్టులో దాఖలైన కేసుల్లో ఏమి తేలుతుందో తెలియదు. అదానీ కంపెనీల మీద 2023లో హిండెన్‌బర్గ్ సంస్థ వెల్లడించిన నివేదిక, కొన్ని దేశాల్లో అదానీ కంపెనీల బాగోతాలు చూసిన తరువాత విదేశాల్లో మన గురించి ఒక చెడు అభిప్రాయం ఏర్పడిందన్నది వాస్తవం. ఈ ఉదంతాల గురించి అంతర్జాతీయ మీడియాలో పెద్ద ఎత్తున వార్తలు వచ్చినందున ప్రతి వారి నోళ్లలో మన దేశం నానుతున్నది. ప్రభుత్వరంగ సంస్థ సెకి విద్యుత్‌ను అమ్మే స్థితిలో లేదన్న సందేశం, అందుకోసమే ప్రైవేటు సంస్థలు రాష్ట్ర ప్రభుత్వ నేతలకు ముడుపులు ఇచ్చినట్లు తాజా ఉదంతంతో వెల్లడైంది. విదేశాలు తిరిగి ప్రతిష్టను పెంచానని చెప్పుకున్న నరేంద్రమోడీ అదానీ కంపెనీల మీద వచ్చిన ఆరోపణల గురించి పార్లమెంటరీ కమిటీ దర్యాప్తు జరిపేందుకు నిరాకరించిన సంగతి తెలిసిందే. శ్రీలంక ప్రభుత్వాన్ని ప్రభావితం చేసి అక్కడ విద్యుత్ ప్రాజెక్టును అదానీకి ఇప్పించారని వచ్చిన వార్తల గురించి చెప్పనవసరం లేదు. గతంలో హిండెన్‌బర్గ్ సంస్థ ముందుకు తెచ్చిన ఆరోపణల నిగ్గు తేల్చేందుకు పార్లమెంటరీ కమిటీ వేయాలన్న డిమాండ్‌ను కేంద్ర ప్రభుత్వం తిరస్కరించింది. ఎందుకంటే అది తన లబ్ధి కోసం పనిచేసే ప్రైవేటు సంస్థ అంటూ కొట్టివేశారు. సెబి పేరుతో విచారణను నీరుగార్చారు. ఇప్పుడు అమెరికా అధికారిక సంస్థలే కేసులు దాఖలు చేసినందున మోడీ సర్కార్ గతంలో మాదిరి తప్పించుకుంటుందా ? ఈ ఉదంతం గురించి పూర్తి వివరాలు తెలియవని, విచారణ **(మిగతా 10వ పేజీలో)**

# కులరహిత వ్యవస్థకు తొలి అడుగు కులగణన



- జస్టిస్ ఈశ్వరయ్య

**కులగణనపై అనేక మంది అనేక వ్యాఖ్యలు చేస్తూ తమ అసలు రూపం ప్రకటిస్తున్నారు. కులగణన చాలామందికి గొంతు దిగని పచ్చి వెలక్కాయలా మారిందనిపిస్తుంది. తెలంగాణలో కులగణన, సమగ్ర కుటుంబ సర్వే ప్రశ్నా పత్రంపై కొందరు అభ్యంతరాలు చెబుతున్నారు. కనీస సదుపాయాల లభ్యతపరంగా వివిధ సముదాయాలు ఎలాంటి పరిస్థితుల్లో ఉన్నాయో తెలియాలంటే సమగ్ర కుటుంబ సర్వే అవసరం. అసెంబ్లీ, పార్లమెంట్‌లు కాదు. కనీసం స్థానిక సంస్థల ఎన్నికల్లోనూ ఎన్నడూ ప్రాతినిధ్యం లభించని కొన్ని సముదాయాలు వున్నాయి. రాజకీయ ప్రాతినిధ్యం ఏ వర్గానికి, ఏ సముదాయానికి ఎంత ఉందో తెలుసుకోకుండా రిజర్వేషన్లు ఇవ్వడం సాధ్యం కాదు. కాబట్టి రాజకీయ అనే పదం గురించిన అభ్యంతరాలు అర్థం లేనివి.**

కుటుంబ సర్వేలో ఆస్తుల వివరాలు ఎందుకు ఇవ్వాలని కొందరు అడుగుతున్నారు. ఇదేదో వ్యక్తిగత హక్కులకు భంగమైనట్లు వాదిస్తున్నారు. సంపాదన వివరాలు తెలియజేసి ఆదాయ పన్ను చెల్లించడం పౌరుల బాధ్యత కాదా? వివిధ సముదాయాల ఆర్థిక స్థితిగతులు తెలుసుకోవడం సర్వే ముఖ్యమైన లక్ష్యం. కాబట్టి పక్కా ఇంట్లో ఉంటున్నారా ? పూరి గుడిసెలో ఉంటున్నారా? అనే ప్రశ్నలు అడగవలసినవే. ఆస్తులు ఏమున్నాయి? అసలు వున్నాయా? ఇల్లు ఉందా ? లేదా? ఎక్కడ తలదాచుకుంటున్నారు? ఈ ప్రశ్నలన్ని అవసరమైనవే. ఈ ప్రశ్నలకు జవాబుల్లోనే ఏ సముదాయం ప్రజలకు ఆదాయ వనరులు అందుబాటులో లేవు, ఎవరికి విద్యావసతి అందుబాటులో లేదు వంటి వివరాలు తెలుస్తాయి. రాజ్యాంగం ప్రకారం పౌరులందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం లభించాలి. అవసరమైన గణాంకాలు లేకుండా సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని ఎలా సాధించగలం ?

## ఉండవలసిన ప్రశ్నలు

ఇది ప్రాచీన దేశం. వృత్తుల ఆధారంగా అనేక కులాలు ఉనికిలోకి వచ్చాయి. విభిన్న సముదాయాల స్థితిగతుల్లో చాలా తేడా కనిపిస్తుంది. అర్ధసంచార జాతులు, సంచార జాతులు, డినోటిఫైడ్ ట్రైబ్స్ అనేకం ఉన్నాయి. వారికి సంబంధించిన గణాంకాలు లేకపోతే, ప్రభుత్వం ప్రణాళికా రచన ఎలా చేయగలదు ? అందువల్లనే రాహుల్‌గాంధీ తన న్యాయ్ యాత్రలో ఈ విషయాన్ని కచ్చితంగా చెప్పారు. డాటా లేకపోతే వెనుకబాటును నిర్ధారించి రిజర్వేషన్లు కల్పించడం ఎలా సాధ్యం ? వెనుకబడిన వర్గాలన్నీ పేద వర్గాలు కాకపోవచ్చు. వారందరికీ రిజర్వేషన్లు అవసరం లేకపోవచ్చు. ఎవరు ఏ స్థితిలో ఉన్నారో గుర్తించాలంటే డాటా కావాలి. క్లాస్ 1, క్లాస్ 2, క్లాస్ 3, క్లాస్ 4 ఉద్యోగాల్లో ఏ సముదాయం ఎంత శాతం కలిగి ఉంది ? రాజ్యాంగంలోని అధికరణ 16 ప్రకారం ప్రభుత్వ ఉద్యోగాల్లో తగిన ప్రాతినిధ్యం అందరికీ ఉండాలి. రాజకీయ రిజర్వేషన్లు ఇవ్వడం కాని, సామాజిక, ఆర్థిక సంక్షేమ చర్యలు చేపట్టడం కాని ఏది చేయాలన్నా డాటా అవసరం. రాజ్యాంగంలోని అధికరణ 17 ప్రకారం అంటరానితనం నేరం. సమాజంలో ఏదో ఒక రూపంలో అంటరానితనం ఉంది. కాబట్టి ఈ సర్వేలో దానికి సంబంధించి ఒక ప్రశ్న ఉండవలసింది. విద్యా హక్కు అందరికీ ఉంది. కానీ ఎంత మందికి విద్య అందుబాటులో లేదు? అధికరణ 23 హ్యూమన్ ట్రాఫికింగ్‌ను నిషేధిస్తుంది. వెట్టిచాకిరిని నిషేధిస్తుంది. సర్వే జరగకపోతే ఎంత మంది వెట్టిచాకిరిలో ఉన్నారు ? అనే వివరాలు ఎలా తెలుస్తాయి. దురదృష్టవశాత్తు ఈ ప్రశ్న కూడా ప్రస్తుత సర్వేలో లేదు. మహానగరాల రెడ్‌లైట్ ఏరియాల్లో, ముంబయి, ఢిల్లీ, హైదరాబాద్ వంటి నగరాల్లో ఎంత మంది మగ్గిపోతున్నారు? వెట్టిచాకిరి, హ్యూమన్ ట్రాఫికింగ్, బాలకార్మికులు వంటి సమస్యలు పరిష్కరించాలంటే డాటా కావాలి.

సంపద కొందరి చేతుల్లోనే పోగుపడరాదు. ఆర్థిక వ్యవస్థ పుంజుకోవాలంటే, సంపదకు సంబంధించిన డాటా ఉండాలి. ఎవరు ఎంత భూమి కలిగి ఉన్నారు? ఎలాంటి వ్యాపారాలు చేస్తున్నారు ? ఏ కులం పరిస్థితి ఎలా ఉంది? ఎవరి బ్యాంకు ఎక్కౌంట్లు ఎలా ఉన్నాయి? వంటి ప్రశ్నలకు సమాధానాలు వస్తేనే ఎవరు సంపన్నులు, ఎవరు బాగా బతుకుతున్నారు? ఎవరు ఇతరుల వాటాను కబళిస్తున్నారు? వంటి ప్రశ్నలకు జవాబులు దొరుకుతాయి. అందుకే దోపిడీ శక్తులు కులగణనను వ్యతిరేకిస్తున్నాయి. వ్యతిరేకిస్తున్న వారంతా అగ్రవర్ణాలకు చెందిన వారే అన్నది గమనించాలి. దురదృష్టవశాత్తు కొందరు అభివృద్ధి చెందిన వెనుకబడిన కులాల వారు, అభివృద్ధి సాధించిన షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల వారు వ్యతిరేకిస్తున్నారు. ఇది దురదృష్టకరం. ఇది రాజ్యాంగ వ్యతిరేకం, చట్ట

విరుద్ధం, సుప్రీంకోర్టు తీర్పులకు విరుద్ధం కూడాను.

**ఎందుకు అవసరం?**

ఇందిరా సాహ్ని కేసుతో సహా అనేక కేసుల్లో సుప్రీంకోర్టు ఈ విషయమై స్పష్టమైన నిర్దేశాలు ఇచ్చింది. 1966లో అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో రిజర్వేషన్లు ఇవ్వాలని ప్రతిపాదించినప్పుడు కోర్టులు ఈ ప్రతిపాదనను డాటా లేనందు వల్ల కొట్టేశాయి. సర్వేలు ఏవీ జరగలేదు. మురళీధర్ కమిషన్ విషయంలోనూ ఇదే జరిగింది. మురళీధర్ కమిషన్ ఈ సర్వే నిర్వహించలేదు. డాటా లేదన్న కారణంతో కోర్టులు కమిషన్ సిఫారసులను కొట్టేశాయి. భారతదేశంలో ఇప్పుడు లభిస్తున్న రిజర్వేషన్లకు కారణం బ్రిటిషు వారి కాలంలో, 1931లో చేసిన కులగణన. దీని ఆధారంగానే మండల్ కమిషన్ రిపోర్టు ఇవ్వడం జరిగింది. మండల్ కమిషన్ రిపోర్టులో బీసీ జనాభా 52 శాతంగా నిర్ధారించింది. తర్వాత రాష్ట్ర ప్రభుత్వాలు కానీ, కేంద్ర ప్రభుత్వాలు కానీ కులగణన చేయించలేదు. కులగణన అనేది రాజ్యాంగబద్ధమైన అవసరం. అధికరణ 38 ప్రకారం ప్రభుత్వం సోషల్ ఆర్డర్‌ను కాపాడటం ద్వారా ప్రజా సంక్షేమం కోసం పనిచేయాలి. సామాజిక న్యాయం, ఆర్థిక, రాజకీయ న్యాయాలు సాధించాలి. ఇందులో రాజకీయ న్యాయాన్ని మరిచిపోరాదు. పురుషులు, మహిళలకు సమానంగా తగిన జీవనోపాధి హక్కు, భౌతిక వనరుల యాజమాన్యం, ఆర్థిక వ్యవస్థ నిర్వహణ ఉత్పత్తి సాధనాల కేంద్రీకరణకు దారి తీయకుండా చూడటం, సమాన పనికి సమాన వేతనం గురించి ప్రభుత్వాలకు నిర్దేశాలున్నాయి.

**గణాంకాలతోనే సామాజిక న్యాయం**

స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ల కోసం రాజ్యాంగాన్ని సవరించడం జరిగింది. అదే అధికరణ 243 డి 6. ఈ అధికరణ స్థానిక సంస్థల్లో రిజర్వేషన్లు కల్పించింది. 1992లో ఈ అధికరణను రాజ్యాంగంలో చేర్చారు. దీని ప్రకారం ఎస్సీలు, ఎస్టీలు పంచాయతీల్లో, చైర్‌పర్సన్ల ఎన్నికల్లో తమ జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు పొందే హక్కు ఉంది. అయితే వెనుకబడిన వర్గాలు రాష్ట్ర ప్రభుత్వాలు ఇచ్చిన రిజర్వేషన్లు పొందగలరు. అందువల్లనే అవిభక్త ఆంధ్రప్రదేశ్‌లో పంచాయతీరాజ్ చట్టం 1994 తీసుకువచ్చారు. ఆ విధంగా స్థానిక సంస్థల్లో 33 శాతం రిజర్వేషన్లు ఇచ్చారు. ఈ రిజర్వేషన్లు 1994 నుంచి గత ఎన్నికలకు ముందు వరకు లభిస్తూ వచ్చాయి. ఆ తర్వాత కేసీఆర్ ప్రభుత్వం ఒక ఆర్డినెన్స్ తీసుకువచ్చింది. సుప్రీంకోర్టు క్యాప్ 50 శాతం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు ఇచ్చిన తర్వాత మిగిలిన స్థానాల లభ్యతను బట్టి సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రిజర్వేషన్లు ఇవ్వాలని నిర్ణయించారు. ఇదంతా ఎందుకు జరిగిందంటే కుల సముదాయాల డాటా అందుబాటులో లేకపోవడం వల్లనే. అందువల్లనే కులగణన అవసరం. సమగ్ర కుటుంబ సర్వేలో కానీ, కులగణనలో కానీ ఉన్న ప్రశ్నలు పాతవే. 2011లో జరిగిన సర్వేలో ఉన్న ప్రశ్నలే ఇప్పుడూ అడుగుతున్నారు. అప్పుడు ఎవరు అభ్యంతరాలు చెప్ప లేదు. నిజానికి, గణాంకాల చట్టం ఉంది. అధికరణ 342 ఏ (3) ప్రకారం ప్రభుత్వానికి పూర్తి అధికారం ఉంది. శ్రీశ్రీశ్రీ రవిశంకర్ దేశంలో కులగణన జరిగితే తిరుగుబాట్లు జరుగుతాయని మాట్లాడారు. కులగణన జరగకపోతేనే అణగారిన వర్గాలు తిరగబడి అంతర్గత సంఘర్షణ మొదలవుతుంది. కులరహిత వ్యవస్థ ఏర్పడాలంటే కులగణన తప్పనిసరి అవసరం. బడుగు బలహీనవర్గాలు సామాజికంగా కాస్త పై స్థాయికి చేరుకున్నప్పుడే కులాంతర వివాహాలు జరుగుతాయి. ఆ విధంగా కులనిర్మూలన జరుగుతుంది. అందువల్ల అందరూ కులగణనకు సహకరించాలని కోరుతున్నాను. కులగణన సమగ్ర ప్రగతి వికాసాలకు తోడ్పడే మొదటిఅడుగు. ❑

# రాజ్యాంగ రక్షణే నేటి తక్షణ కర్తవ్యం

**(4వ పేజీ తరువాయి)**

ఆటంకాలు కల్పించడంతో రాజీనామా చేశారు. హిందూ మతంలోని వర్ణ వ్యవస్థ అసమానతలతో, వివక్షలతో కూడి ఉన్నదని, బౌద్ధమతం సమాజాన్ని మానవత్వంతో పునర్‌నిర్మించగలదని, బుద్ధుడు చెప్పిన దు:ఖం అన్న దానిని నిరుపేదరికంతోనూ, దోపిడీతో సమాన అర్థంగా భావించారు. ప్రయివేటు ఆస్తులను రద్దు చేయడం ద్వారా దీనిని నివారించవచ్చని ఆయన భావించారు. అందుకే లక్షలాది మంది తన అనుచరులతో బౌద్ధమతం స్వీకరించారు. మనం స్వాతంత్ర్యం సాధించుకుని 76 ఏళ్లు అయినప్పటికీ, నాడు అంబేద్కర్ ఏ వివక్షతకు వ్యతిరేకంగా జీవితాంతం పోరాడారో ఆ వివక్షత నేటికీ కొనసాగుతూనే వుంది. జనాభాలో 70 శాతంకి పైగా ఉన్న దళితులు, గిరిజనులు, వెనుకబడిన తరగతుల వారు అనాగరికమైన కుల వివక్షతకు గురవుతూనే ఉన్నారు. అణచివేత, అత్యాచారాలు నిరంతరం సాగుతూనే వున్నాయి. వీరిలో అత్యధికులు వ్యవసాయ కార్మికులు, పేద, సన్నకారు రైతులు, చేతివృత్తుల వారుగా ఉండి ఆర్థిక దోపిడీకి గురవుతున్నారు. కులపరమైన దోపిడీ వీరి బతుకులను మరింత దుర్భరం చేస్తున్నాయి. ఈ వివక్షతకు వ్యతిరేకంగా, సమానత్వం కోసం అనేక ఉద్యమాలు సాగుతున్నాయి. వాటిలో భాగస్వాములం కావడం అంబేద్కర్ ఆశయ సాధన కృషిలో భాగం కాగలదు. అంబేద్కర్ బోధించినట్లు సామాజిక న్యాయానికి భంగం కలిగిస్తున్న, ప్రజల జీవన ప్రమాణాలను దిగజారుస్తున్న విధానాలను అధ్యయనం చేద్దాం. వీటికి వ్యతిరేకంగా ప్రజానీకాన్ని సమీకరిద్దాం. ఉద్యమాలు నిర్వహిద్దాం. అదే ఆయనకు మనం సమర్పించే నిజమైన నివాళి. ❑

**(నవ తెలంగాణ సౌజన్యంతో)**

# సమగ్ర కులగణనతోనే సమాజ గమనం



- మల్లెపల్లి లక్ష్మయ్య

**జనగణనలో కులగణన గత కొంత కాలం వాద, వివాదాలకు నెలవైంది. జనగణన జరగాల్సిందే కానీ, అందులో కులాలవారీగా గణన అక్కర లేదనే వాళ్ళు న్నారు. అయితే కులగణన వల్లనే దేశ ప్రగతి అంటే ప్రజలందరి పురోగతి అర్థమవుతుందనే అభిప్రాయం బలంగా ఉంటే ముఖ్యంగా ప్రతిపక్ష పార్టీలుగా ఉన్న వాళ్ళు ఈ నినాదాన్ని ఎన్నికల హామీగా కూడా మార్చారు. ముఖ్యంగా కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ తన ప్రధాన డిమాండ్‌గా, హామీగా ముందుకు తీసుకొచ్చారు. మన రాష్ట్రంలో గత సంవత్సరం జరిగిన ఎన్నికల్లో కులగణన తమ తక్షణ కార్యక్రమంగా ఉంటుందని కాంగ్రెస్ పార్టీ ప్రకటించింది. అందుకనుగుణంగానే గత కొన్ని రోజుల క్రితం కులగణనకు సంబంధించిన కార్యాచరణను ప్రభుత్వం ప్రకటించింది. ముందుగా బి.సి జనగణనగా భావించారు. కానీ అది ఇప్పుడు పూర్తి జనగణన జరుపుతామని నిర్ణయించారు.**

నిజానికి కేవలం బి.సి జనగణన జరిపితే సామాజిక చిత్రం మనకు అర్థంకాదు. అన్ని కులాల, వర్గాల సామాజిక, ఆర్థిక, సాంస్కృతిక, రాజకీయ విషయాలతో కూడిన గణన జరగడం వల్ల సమగ్ర సమాజ గమనం అర్థం కాగలదు. తెలంగాణ రాష్ట్రం 1948కి ముందు హైదరాబాద్ సంస్థానంలో ఉండింది. ఇందులో తొమ్మిది తెలంగాణ జిల్లాలు ఉండేవి. అందులో ఖమ్మం, రంగారెడ్డి జిల్లాలు లేవు. అయితే రంగారెడ్డి జిల్లాకు బదులుగా అత్రాఫ్ ఇ బాల్దా అనే పేరుతో ఒక ప్రత్యేకమైన జిల్లా ఉండేది. ఇది పూర్తిగా నిజాం నవాబుల ప్రత్యక్ష ఏలుబడిలో ఉండేది. మిగతా జిల్లాల్లో జాగీర్దార్లు, జమీందారుల పాలన ఉండేది. హైదరాబాద్ స్వతంత్ర సంస్థానంలో స్వతంత్రంగా ఉండేది. అయితే కొన్ని విషయాల్లో బ్రిటిష్ ఇండియా విధానాలను అనుసరిస్తుండేది. అందులో ఒక సెన్సస్ (జనగణన) బ్రిటిష్ ఇండియాలో జనగణన 1881 నుంచి క్రమం తప్పకుండా ప్రతి పది సంవత్సరాలకోసారి జరిగేది. అదే విధానాన్ని హైదరాబాద్ అమలుచేసింది. 1881కి ముందు అంటే బ్రిటిష్ ఇండియాలో మొట్ట మొదటిసారిగా 1802లో ఢాకాలో సెన్సస్ (జనగణన) నిర్వహించారు. ఆ తర్వాత వివిధ పట్టణాల్లో, వివిధ సందర్భాల్లో వివరాలను సేకరించారు. 'సెన్సస్' అనేది లాటిన్ పదం. దాని అర్థం అంచనా.

నిజానికి 'సెన్సస్' అంటే కేవలం జనగణన మాత్రమే కాదు. వనరులు, పశుసంపద, నీటి వనరులు, భూములు, పరిశ్రమలు, అడవులు ఇంకా అనేక రకాలైన విషయాలు ఇందులో ఉంటాయి. అయితే, సెన్సస్ అనే పదాన్ని జనగణన అనే పదానికి పర్యాయపదంగా వాడుతున్నాం. 1881 నుంచి జనాభా లెక్కలు క్రమపద్ధతిలో మొదలైనప్పటికీ, 1931లో మాత్రమే కులగణన జరిపారు. అందులో ముందు మతాలకు సంబంధించిన లెక్కలు ఉండేవి. 1911 నుండి ఆనాడు అంటరాని కులాలుగా పిలువబడుతున్న కులాలను ఒక ప్రత్యేక కేటగిరి కింద నమోదు చేశారు.

హైదరాబాద్ రాజ్యం దళిత నాయకుడుగా పేరు ప్రఖ్యాతులు సంపాదించిన భాగరెడ్డి వర్మ నాయకత్వంలోని ఆది హిందూ సోషల్ సర్వీస్ లీగ్ అభ్యర్థన మేరకు ఇక్కడ ఉన్న మహర్, మాల, మాదిగ కులాలను ఆది హిందువులని ప్రత్యేకంగా నమోదు చేశారు. భారతదేశంలో లాగానే హైదరాబాద్‌లో కూడా 'సెన్సస్'లో కులగణన జరిగింది. అందులో దాదాపు 44 హిందూ కులాలను, రెండు ఆది హిందూ కులాలను, ఆరు ఆదివాసీ తెగలను నమోదు చేశారు.

1931లో జరిగిన జనగణనలో కులగణన చాలా విషయాలను నమోదు చేసింది. వారి జీవన విధానం, అక్షరాస్యత, జీవనోపాధి, ఉద్యోగాలు, వివాహ వ్యవస్థలను ఇందులో పేర్కొన్నది. మతపరమైన, భాషాపరమైన వివరణ, జనన, మరణాలకు సంబంధించిన విషయాలను పొందుపరిచారు. బ్యాంకులు, పరిశ్రమలు వాటి యాజమాన్య వివరాలు ఇందులో వివరించారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో జరగబోయే కులగణన గురించి చాలా మంది ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. అందులో ఎవరి జనాభా ఎంత ఉంటుందో తెలుస్తుందనే ఉత్సుకత చాలా మందిలో ఉంది. అయితే 1931లో ఆ వివరాలన్నింటినీ జన గణనలో నమోదుచేశారు. అప్పుడున్న తొమ్మిది జిల్లాలు, హైదరాబాద్, అత్రాఫ్ ఇ బాల్దా, కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్, మెదక్, మహబూబ్‌నగర్, నల్లగొండ జిల్లాల్లో జనాభా 75,54,598. అందులో ప్రధాన కులాల జనాభా, వారి శాతాన్ని

మనం ఇందులో పరిశీలించవచ్చు. బ్రాహ్మణులు 1,43,659, ఇది మొత్తం జనాభాలో 1.90 శాతం. వైశ్య జనాభా 2,24,660, వీరి శాతం 2.97. కాపు జనాభా 7,94,043 కాగా, వీరి శాతం 10.51. ఇక్కడ గమనించాల్సిందేమంటే 1931 జనాభా లెక్కల్లో రెడ్ల ప్రస్తావన లేదు. అందరూ కాపులు గానే చెప్పుకున్నారు. వెలమల జనాభా 51,988 కాగా, వారి శాతం 0.68గా పేర్కొన్నారు. ఇక ఇప్పుడు మనం పిలుచుకుంటున్న ఓబీసీ కులాల్లో తెలగ ఒకటి. ఇందులో రెండు కులాలను చేర్చారు. ఒకటి మాత్రాసి, రెండోది మున్నూరు. మున్నూరు అని అన్నారు కానీ మున్నూరు కాపు అనలేదు. వారిద్దరి జనాభా 8,59,874, వారి శాతం 11.38 శాతం. అదే విధంగా కలాల్ అంటే గౌండ్లు. వారి జనాభా 3,73.341 కాగా, వారి శాతం 4.94. మరొక ప్రధాన ఓబీసీ కులం. యాదవులు వారి జనాభా 5,10,576, జనాభా శాతం 6.75. కురుమలను వేరుగా చూపెట్టారు. వారి జనాభా 1,64,075, జనాభా శాతం 2.17 అని పేర్కొన్నారు. పద్మశాలీలను జులాహిలుగా నమోదు చేశారు. ఇందులో సాలె, దేవాంగులను చేర్చారు. వారి జనాభా 2,95,445 కాగా, జనాభా శాతం 3.91గా నమోదయింది.

ఇక ఈ రోజు మనం ఎస్సీ కులాలుగా చెప్పుకుంటున్న ఆది హిందువులలో మాల, దాని ఉప కులాల జనాభా 4,81,722 కాగా, జనాభా శాతం 6.37, మాదిగ, దాని ఉప కులాల జనాభా 7,72,680 అయితే జనాభా శాతం 10.22 శాతం నమోదు చేశారు. ఆదివాసుల్లో గోండుల జనాభా 1,11,367 అయితే దాని జనాభా శాతం 1.47 కాగా, లంబాడాల జనాభా 2,02,423 అయితే జనాభా శాతం 2.67. ఇందులో కొన్ని ఆసక్తికరమైన విషయాలు కూడా ఉన్నాయి. బోగం అనే పేరుతో ఒక కులం నమోదైంది. దాని జనాభా దాదాపుగా లేదు. అయితే ఈ రోజు ఆ సామాజిక వర్గం ఉనికిలో లేదు. రాబోయే కుల గణనలో ఆ కులం పేరు ఉండే అవకాశం లేదు. మరొక కులం తెలి. అదే గాండ్లు నూనె తీసేవాళ్ళు. గత ముప్పై సంవత్సరాల క్రితం గ్రామాల్లో గానుగతో నూనె తీసే వృత్తి కనుమరుగైంది ఈ కులగణనలో ఆ సామాజిక వర్గం ఉనికి ఎట్లా ఉంటుందో చూడాలి. ఇక ఆనాడు అక్షరాస్యత విషయానికి వస్తే, బ్రాహ్మణుల్లో అక్షరాస్యత అధికంగా ఉంది. మొత్తం జనాభాలో ఈ కులం శాతం చాలా తక్కువ. బ్రాహ్మణులలోనే అక్షరాస్యత 47.8 శాతం, అందులో స్త్రీల శాతం 4.67, కాపుల్లో 0.30, కోమట్లలో 16.42 శాతం, వెలమల్లో 14.44 శాతం మిగతా ఏ కులంలో కూడా ఒక్క శాతం దాటలేదు. తెలంగాణలో కుల గణన జరిగిన తర్వాత 1931 జనాభా లెక్కలతో సరిపోల్చుకుంటే ఈ వందేళ్లలో జరిగిన ప్రగతి మనకు అర్థం కాగలదు. ఇటువంటి విస్తృతమైన కులగణన 1931తోనే ఆగిపోయింది. మళ్లీ వందేళ్ళ తర్వాత ఇప్పుడు మనం దానిని చూడబోతున్నాం. జనాభా లెక్కల్లో కులగణన వల్ల ఆర్థిక, సామాజిక రంగాల్లో ఏ ఏ కులాలు ఎటువంటి ముందడుగు వేశాయి. ఏ ఏ కులాలు వెనుకబడిపోయాయి అనే విషయాలు మనకు అర్థమవుతాయి. చాలా కుల సంఘాలు తమ తమ కులాల జనాభాను ఎక్కువ చేసి చెప్పుకోవడం అలవాటైంది. దానితో అటువంటి పొరపాట్లకు తెరపడగలదు. గత చరిత్రను అర్థం చేసుకోవడానికి, వర్తమానాన్ని సరిచూసుకొని, భవిష్యత్తు నిర్మించుకోవడానికి వీలుగా 1931 జనాభా లెక్కల సారాన్ని మీ ముందుంచాను. ❑

## అదానీ-జగన్‌రెడ్డి ముడుపుల చెలగాటం

**(6వ పేజీ తరువాయి)**

జరిపించాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు చెప్పారు. వివిధ రాష్ట్రాల నేతలకు ముడుపులు ఇచ్చినట్లు ఆరోపణలు వచ్చినందున కేంద్రమే దర్యాప్తు జరపాల్సి ఉంటుంది. ఈ ఉదంతంలో నరేంద్రమోడీ చంద్రబాబు నాయుడు ఇరకాటంలో పడినట్లు చెప్పవచ్చు. తన రాజకీయ ప్రత్యర్థి జగన్‌మోహనరెడ్డి పట్ల ఎలాంటి సానుభూతి లేకున్నా, ముడుపులు ఇచ్చినట్లు చెబుతున్నది అదానీ గనుక విచారణ గురించి చంద్రబాబు పట్టుబడతారా అన్నది సందేహమే. ఎవరు అవునన్నా కాదన్నా మోడీ అదానీ బంధం గురించి తెలిసిందే. గతంలో తాను చెట్టాపట్టాలు వేసుకు తిరిగిన డోనాల్డ్ ట్రంప్ అధికారానికి వచ్చినందున ఆ సంబంధాలతో అదానీ అండ్ కోను బయట పడవేయిస్తే ఇక్కడ జగన్మోహన రెడ్డిని రక్షించినట్లే గాక సచ్ఛీలుడని అంగీకరించాల్సి ఉంటుంది. అదానీ కంపెనీల నుంచి రాష్ట్రానికి పెట్టుబడులను ఆశిస్తున్న చంద్రబాబు మాట మాత్రంగా విచారణ జరపాలన్నారు తప్ప అంతకుమించి మాట్లాడకపోవచ్చున్నది ఒక అభిప్రాయం. గతంలో వైసీపీ ప్రభుత్వం అదానీ కంపెనీతో చేసుకున్న విద్యుత్ మీటర్ల ఒప్పందాన్ని వ్యతిరేకించిన తెలుగుదేశం దాన్ని కొనసాగించేందుకే నిర్ణయించుకుంది. సెకి ఒప్పందాన్ని రద్దు చేసుకుంటే విద్యుత్ సమస్య తలెత్తవచ్చనే సాకు చూపి కొనసాగించవచ్చు. కేంద్రం తీసుకొనే నిర్ణయం, ప్రతిపక్షాలు ఈ సమస్యను ముందుకు తీసుకుపోయే తీరుతెన్నులను చూసిన తరువాత చంద్రబాబు వైఖరి నిర్ణయం కావచ్చు. అవినీతి అక్రమాలను నిలదీస్తా, తాట వలుస్తా అని గతంలో బీరాలు పలికిన జనసేన నేత పవన్ కల్యాణ్‌కూ ఇది పరీక్షే. అమెరికాకూ ఇది ప్రతిష్టాత్మకంగా మారిందనే చెప్పాలి. అక్కడి న్యాయశాఖ, ఆర్థిక లావాదేవీల నియంత్రణ సంస్థ దాఖలు చేసిన కేసులు వీగిపోతే అవినీతిని సహించదనే దాని ప్రతిష్టకు భంగం కలుగుతుంది. మొత్తం మీద ఈ కేసు ఏ మలుపు తిరుగుతుందో అన్న ఆసక్తిని రేకెత్తిస్తున్నది. ❑

# కుల గణన : పది పాక్షిక సత్యాలు



- యోగేంద్ర యాదవ్

**హంగేరియన్ సామాజిక శాస్త్రవేత్త, జ్ఞాన సామాజిక శాస్త్రానికి ఆద్యుడు అయిన కార్ల్ మ్యాన్‌హీమ్ (1893-1947) 'భావజాలం' అనే పదాన్ని ఒక ప్రత్యేకమైన అర్థంలో వాడుతుండేవారు. ఒక సమాజం యొక్క 'నిజమైన స్వభావాన్ని దాచిపెట్టే 'మిథ్యా విశ్వాసాలను 'భావజాలం' సూచిస్తుందని మ్యాన్‌హీమ్ అనేవారు. అయితే ఆయన ఆ పదానికి (భావజాలం అనే పదానికి) ఆపాదించిన అర్థం విస్తృత ప్రాచుర్యం పొందలేదు. భావాలను వాటి సామాజిక ప్రాతిపదికలకు కుదించివేసేందుకు మ్యాన్‌హీమ్ సాగించిన కృషికి సైతం సహ సామాజిక శాస్త్రవేత్తలలో మినహా విశాల మేధో ప్రపంచంలో ఆమోదం, ఆదరణ లభించనేలేదు.**

భావజాలం గురించిన మాన్‌హ్యామ్ వ్యాఖ్యానానికి దృష్టాంతం కావాలా? ఇదుగో.. కులగణన(కులాల ప్రాతిపదికన జనాభా లెక్కలు) విషయమై ప్రస్తుతం మన సమాజంలో జరుగుతున్న చర్చే అందుకు సరైన ఉదాహరణ. ఉదారవాదులు, ప్రగతిశీల విద్యావంతులు అయిన భారతీయులతో "కుల గణన" విషయమై ఎప్పుడైనా చర్చించారా? నేను చాలాసార్లు చర్చించాను. ప్రతిసారీ దిగ్భ్రాంతి చెందాను. కలవరపడ్డాను. ప్రజల విశ్వాసాలను వారి యాదృచ్ఛిక సామాజిక మూలాలతో ముడిపెట్టే వైఖరులను నేను సుతరామూ ఇష్టపడను. వాటిని తీవ్రంగా వ్యతిరేకిస్తాను. అయితే "కుల గణన" అంశంపై సదరు గౌరవనీయులు తత్తరపాటుతో తమ అజ్ఞానాన్ని, అపోహలను బయటపెట్టుకోవడంతోపాటు వారు తమ అహంకారాన్ని ప్రదర్శించడం నన్ను వ్యాకులపరిచింది. మన దేశంలో ప్రజాభిప్రాయాన్ని మలిచేవారు/సృష్టించేవారు/ప్రచారం చేసేవారు ఇప్పటికీ చాలవరకు అగ్రవర్ణాలవారే కదా అన్న వాస్తవాన్ని నేను జ్ఞాపకం చేసుకోవడాన్ని అనివార్యం చేసింది. "కుల గణన" పట్ల ఈ తరహా 'సైద్ధాంతిక' వ్యతిరేకత తమ తమ స్వార్థ ప్రయోజనాలకే ప్రాధాన్యమిచ్చే అనేక పాక్షిక విశ్వాసాలుగా పరిణమించింది. **పాక్షికత..!** అవును, ప్రతి పాక్షిక అభిప్రాయంలోను రవంత సత్యం ఉన్నా సమాజ స్వతస్సిద్ధ స్వభావాన్ని మాటుపరిచే/ మెరుగుపరిచే విధంగా సదరు మిథ్యా విశ్వాసాలు లోకంలో ప్రచలితమవు తున్నాయి / ప్రచారం పొందుతూ ఉన్నాయి. అవి అనేకముగా ఉన్నాయని అన్నాను కదూ. అయితే వాటిలో పది మామూలు పాక్షిక సత్యాలను మాత్రమే రేఖామాత్రంగా విశదీకరిస్తాను.

- (1) స్వాతంత్ర్యం రాక ముందు 1931వ సంవత్సరం తర్వాత భారత ప్రభుత్వం ఎన్నడూ కుల ప్రాతిపదికన జన గణన నిర్వహించలేదు. **"నిజమే".** 1931 తరువాత జరిగిన 'జనాభా గణన' (డెసీని యల్ సెన్సస్) ప్రక్రియలో గణకులు ప్రతీ వ్యక్తిని కులం గురించి ప్రశ్నించలేదు. అయితే ఈ అపవాదు అనుచితమైనది. స్వతంత్ర భారతదేశంలో ప్రతి పదేళ్లకొకసారి నిర్వహిస్తున్న 'జనాభా గణన'లో ప్రతిసారీ కులం ఏమిటని ప్రశ్నిస్తూనే ఉన్నారు. అయితే ప్రతిస్పందించిన పౌరుడు షెడ్యూల్డు కులాలకు చెందిన వాడా 'లేక' షెడ్యూల్డు తెగలకు చెందిన వాడా అనే విషయాన్ని మాత్రమే విధిగా నమోదు చేయడము జరుగుతోంది. అంతేకాదు ఎస్సీలలో ఏ నిర్దిష్ట ఉపకులం లేదా షెడ్యూల్డు తెగలలో ఏ నిర్దిష్ట ఉప తెగకు చెందినవారో కూడా స్పష్టంగా నమోదు చేస్తున్నారు. ఈ దేశంలో ఉన్న ఎస్సీ, ఎస్టీల యొక్క.. విద్యార్హతలు, మరియు ఆర్థిక స్థితిగతులపైన అభివృద్ధి గురించి.. ప్రభుత్వం మరియు ఇతర సంస్థలు.. సెన్సస్ ద్వారా సేకరించిన ఆ ఉపకులాల/ తెగల నిర్దిష్ట వివరాల సమాచారం ఆధారంగానే అంచనాకు వస్తున్నారు.
- (2) "కుల గణన" అనేది రాహుల్‌గాంధీ కొత్తగా చేస్తున్న డిమాండ్. **వాస్తవమే.** కుల గణన నిర్వహించి తీరాల్సిందేనని ఇటీవలి కాలంలో కాంగ్రెస్ పార్టీ వ్యక్తం చేస్తున్న రాజకీయ సంకల్పం చాలా వరకు రాహుల్‌గాంధీ యొక్క దృఢ విశ్వాసంలో నుండి జనితమైనదే. అయితే ఈ డిమాండ్‌లో కొత్త విషయం కానీ, స్వార్థ ప్రయోజనాలు కానీ లేనేలేవు. "కుల గణన" నిర్వహించాలన్న సిఫారసు రాహుల్‌గాంధీ కంటే ముందే ఉద్భవించినది. అంటే ఈ కులగణన అనే అంశం వాజపేయి ప్రభుత్వకాలం నాటిది. సామాజిక న్యాయ మంత్రిత్వ శాఖ సెన్సస్ కమిషనర్, మరియు రిజిస్ట్రార్ జనరల్ ఆ సిఫారసును చేశారు. మే 2010లో లోక్‌సభ ఈ సిఫారసును సమగ్రంగా చర్చించి బీజేపీ

సంపూర్ణ ఆమోదంతో దేశవ్యాప్తంగా "కులాలవారీ జన గణన"ను నిర్వహించాలని ఏకగ్రీవంగా నిర్ణయించింది. 2018లో తదుపరి జనాభా గణనలో ఓబీసీ కులాలకు సంబంధించిన జనాభా లెక్కల సేకరణను చేర్చుతామని నాటి హోంమంత్రి రాజ్‌నాథ్‌సింగ్ హామీ ఇచ్చారు. బీహార్‌లోని ఎన్డీఏ ప్రభుత్వం సహా సామాజిక న్యాయంపై పార్లమెంటరీ స్థాయీ సంఘం, ఇంకా నేషనల్ కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్ మొదలైన చట్టబద్ధ సంఘాలు అందుకు మద్దతు తెలిపాయి.

- 3) కుల గణన అనేది ఒక బృహత్తర కార్యం. దానివల్ల జనాభా లెక్కల సేకరణ జాప్యమవుతుంది/ఆలస్యం అవుతుంది. **యథార్థమే.** అయితే ఆ జాప్యం/ ఆలస్యం కొన్ని సెకన్లు లేదా ఒక నిమిషంకంటే తక్కువగా ఉంటుంది. కులం ఏమిటి అన్న ప్రశ్నను సకల కులాల వారికి విధిగా వేయాలంటే ప్రస్తుతం జనాభా లెక్కల సేకరణకు అనుసరిస్తున్న అధికారిక నమూనాలో చాలా చిన్న మార్పు చేయవలసి వుంటుంది. అయితే ఇదేమీ పెద్ద పని కాదు.
- (4) భారత ప్రభుత్వం వద్ద సిద్ధపరిచిన సమగ్ర కులాల జాబితా లేదు. అటువంటి జాబితాను రూపొందించడం చాలా కష్టమైన పని. **నిజమే.** జనరల్ కేటగిరీకి చెందిన అన్ని కులాల, ఉప కులాల అధికారిక జాబితా మాత్రమే లేదు. అయితే మన దేశ జనాభాలోని నాలుగింట మూడు వంతుల జనాభా–ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ–కు సంబంధించిన అటువంటి జాబితా భారత ప్రభుత్వం వద్ద సిద్ధంగా ఉన్నది. జనరల్ కేటగిరి విషయానికి వస్తే సంబంధిత పౌరుడు చెప్పిన కులం పేరును కచ్చితంగా నమోదు చేస్తే సరిపోతుంది. భాష, మతం విషయంలో వలే అలా నమోదు చేసిన పేర్లను ఆయా కులాల వారీగా వర్గీకరించవచ్చు.
- (5) ప్రతి కులానికి సంబంధించిన జనాభాలో ఎంత మంది వ్యక్తులు ఉన్నారో లెక్కించడమే కులగణన. **అవును.** అయితే "కులగణన"లో వెల్లడైన వివరాలను ప్రచురించినప్పుడు అందరూ మొదటగా ఆసక్తి చూపేది ఆ విషయంపైనే అనడంలో సందేహం లేదు. అయితే "కుల గణన" నుంచి మనకు లభించేది అతి ముఖ్యమైన సమాచారంగా ఉంటుంది. సంబంధిత కులాలకు చెందిన ప్రజల సామాజిక, ఆర్థిక స్థితిగతులు, విద్యార్హతలు. కులాల వారీగా స్త్రీ పురుషుల నిష్పత్తి, విద్యా స్థాయి, వృత్తి, ఎలాంటి గృహంలో నివసిస్తున్నారు ? కుటుంబ ఆస్తులు, మంచినీరు, విద్యుత్, వంటగ్యాస్ సదుపాయాలు మొదలైన వాటికి సంబంధించిన సమాచారం అందుబాటులోకి వస్తుంది. ఇటువంటి కచ్చితమైన ఆధారాల ప్రాతిపదికన ప్రామాణిక సామాజిక విధానం రూపకల్పనకు అటువంటి సమాచారం తప్పనిసరిగా అవసరం అని సుప్రీంకోర్టు నిర్దేశించింది.
- (6) కుల గణనలో హిందూ మతస్తులు కాని వారిని మినహాయిస్తారు. ప్రతి ఒక్కరూ ఏదో ఒక కులాన్ని అనుసరించేలా కుల గణన ప్రక్రియ నిర్బంధం చేస్తుంది. **ఈ అభిప్రాయం శుద్ధ అబద్ధం.** ప్రతి మత సమూహంలోను కులాలు ఉన్నాయి. హిందూ మతంలోనే కాకుండా ముస్లిం, క్రైస్తవ, సిక్కు మతాలలోనూ కులాలు ఉన్నాయి. బీహార్‌లో జరిగిన 'కుల గణన'లో ముస్లిం మతస్తులలో డజన్‌కు పైగా కులాలు ఉన్నట్టు వెల్లడయింది.
- (7) దేశంలో ప్రస్తుతం అమలులో రిజర్వేషన్ కోటాలను మరింతగా పెంపొందించుకునేందుకే ఈ "కుల గణన"ను డిమాండ్ చేస్తున్నారు. **నిజమే.** కుల గణనను కోరుతున్న వారిలో అత్యధికుల ఉద్దేశం అదే. అది న్యాయం కూడాను. అందులో న్యాయ విరుద్ధమైనది ఏదీ లేదు. ఒక నిర్దిష్ట కుల జనాభా సంఖ్యకు అనుగుణంగా దేశంలో ఉన్న వనరులలో, అవకాశాలలో ఆ కులస్తులకు తగిన వాటా ఉందా లేక, కొరవడిందా, తేడా ఎంత అనే విషయాలను "కుల గణన" ధ్రువీకరిస్తుంది. ఇతర విధానపరమైన విషయాలకు కుల గణన చాలా ముఖ్యం. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీ రిజర్వేషన్లను సంబంధిత వర్గంలోని అన్ని కులాల వారికి సమానంగా విభజించాలా? ఓబీసీ కోటా నుంచి కొన్ని కులాలను మినహాయించాలా? ఎస్సీ ఎస్టీలలో సంపన్న శ్రేణిని పరిగణనలోకి తీసుకోవాలా? ఓబీసీలలో సంపన్న శ్రేణిని నిర్వచించడమెలా? 'అగ్ర కులాల'లో పేదరికం ఏ మేరకు (ఎంత శాతం) ఉన్నది? సామాజిక అసమానతలను అర్థం చేసుకునేందుకు కులం అనేది ఒక ప్రమాణమా? ఈ ప్రశ్నలకు సమాధానాలు కోరుతున్న రిజర్వేషన్ల వ్యతిరేకులు, అనుకూలురు అందరూ కులగణనను డిమాండ్ చేస్తున్నారు.
- (8) ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు "కులగణన" అవసరం కానీ జనరల్ కేటగిరీ కులాల వారికి అవసరం లేదు. **వాస్తవమే.** కుల వ్యవస్థ యొక్క కాఠిన్యం, మోసాలు మరియు, ప్రతికూలతలకు నష్టపోయిన ఎస్సీ ఎస్టీ ఓబీసీ కులాల వారికి దేశంలో ఉన్న వనరుల/ఆస్తుల/అవకాశాల/ అసమానంగా పంపిణీ జరుగుతున్న తీరుతెన్నులు అవి ఏ మేరకు (ఎంత మేరకు) జరుగుతోందో అర్థం చేసుకోవడమే "కుల గణన" చేయాలని డిమాండ్ చేయడం వెనుక ఉన్న ముఖ్యమైన ప్రేరణ. ఒక ప్రామాణికత (బెంచ్ మార్క్) లేకుండా ఈ ప్రతికూలతలు, నష్టాలను అంచనా వేయలేము కదా. అందుకు 'జనరల్' కేటగిరీ కులాల వారు పొందుతున్న సదుపాయాలను, అవకాశాలను, వారికి లభిస్తున్న అధికారం, ఆధిపత్యం మొదలైన వాటి గురించిన వివరాలు సంపూర్ణంగా పరిగణనలోకి తీసుకోవల్సి ఉన్నది. పౌరులు అందరికీ సమాన అవకాశాలు కల్పించాలన్న రాజ్యాంగ

**(మిగతా 25వ పేజీలో)**

# కుల నిర్మూలన సాధించే మార్గం

(స్వేచ్ఛానుసరణా ఎం.వి.ఎస్.శర్మ)

- ప్రొఫెసర్ ప్రభాత్ పట్నాయక్

**ప్రాచీన కాలం నుంచి భారతదేశంలో ఉనికిలో ఉన్న నాలుగు వర్ణాల వ్యవస్థలో కుల వ్యవస్థ మూలాలు ఉన్నాయి. ఆ వ్యవస్థ మరింతగా విస్తరించే క్రమం కొనసాగుతోంది. నాలుగు వర్ణాల వ్యవస్థలో ప్రధానంగా బ్రాహ్మణులు (పురోహిత వర్గం), క్షత్రియులు (యుద్ధాలు చేసేవారు) మిగిలిన రెండు శ్రామిక తరగతులకు చెందిన వారు. వీరిలో ప్రధానంగా లొంగదీసుకున్న స్థానిక తెగలకు చెందిన వైశ్యులు (చేతివృత్తుల వారు, ఇతర ఉత్పత్తిదారులు), శూద్రులు (తక్కువ స్థాయి పనులు చేసే శ్రామికులు) ఉన్నారు.**

రక్త సంబంధీకుల గుంపులతో, పుట్టుకను బట్టి అమలు జరిగే ఒక నిచ్చెన మెట్ల మాదిరి వ్యవస్థగా ఇది ఉంది. ఒక్కో గుంపు ఒక్కో ప్రత్యేకమైన వృత్తిని నిర్వహిస్తుంది. అది వంశపారం పర్యంగా సంక్రమిస్తుంది. ఈ వ్యవస్థలో అంతర్భాగంగా అంట రానితనం, కంటబడకూడని ఆచారం అనే సహించరాని ఆచారాలు ఉన్నాయి. తక్కువ కులపు వ్యక్తిని ముట్టుకున్నా, లేక చూసినా అగ్రకులానికి చెందిన వ్యక్తి మైల పడిపోతాడనే ఊహ ప్రాతిపదికన ఈ ఆచారాలు ఏర్పడ్డాయి. ఈ తక్కువ కులాలకు చెందిన వారు ఎటువంటి స్వంత భూమినీ కలిగి వుండకూడదనీ, వారు తమ గ్రామాన్ని విడిచిపెట్టి పోరాదని ఆచారాలు ఆంక్షలు విధించాయి. తద్వారా అగ్ర కుల భూయజమానులకు అవసరమైన కూలి మనుషులు ఎప్పుడు కావాలన్నా లభించే ఏర్పాటు జరిగింది. వ్యవసాయ భూములు సాధారణంగా గ్రామాలకు పరిసరాల్లో ఉంటాయి. ఆ రోజుల్లో కూలీలు వేరే ప్రదేశాలకు తరలిపోయి స్వంతంగా, స్వతంత్రంగా జీవించే అవకాశాలు మెండుగా ఉన్నాయి గనుక ఆ విధంగా జరగకుండా ఈ ఆంక్షలు వచ్చాయి. సామాజిక, ఆర్థిక అసమానతలు ఈ విధంగా వ్యవస్థీకృతమైన ఈ సమాజంలో వలస పాలన ఫలితంగా చట్టం ముందు అందరూ సమానులే అన్న సూత్రం(మొక్కుబడిగానే) ప్రవేశించింది. ఐతే అదే వలస పాలన భౌతిక జీవితంలో అసమానతలను మరింత పెంచింది పారిశ్రామిక ఉత్పత్తులను పెద్ద ఎత్తున దిగుమతి చేసి ఇక్కడి చేతి వృత్తులను నాశనం చేయడం, పన్నుల పేరుతో రైతుల నుండి భారీగా వసూళ్ళు చేసి ఆ ధనంతోనే ఇక్కడి వ్యవసాయోత్పత్తులను చేజిక్కించుకోవడం జరిగింది. దీనివలన తక్కువ కులాల ప్రజల భౌతిక జీవన పరిస్థితులు మరింత దిగజారాయి.

సామాజిక న్యాయం కోసం, విముక్తి కోసం 19, 20 శతాబ్దాలలో సాంఘిక ఉద్యమాలు జరిగాయి. వాటితోబాటు సమాంతరంగా సామ్రాజ్యవాద వలస పాలనకు వ్యతిరేకంగా పోరాటం జరిగింది. స్వాతంత్ర్యం వచ్చాక, ఒక రాజ్యాంగాన్ని రూపొందించడం జరిగింది. చట్టం ముందు అందరూ సమానులే అన్న మొక్కుబడి సూత్రం స్థానంలో ప్రజాతంత్ర పాలన, వయోజనులందరికీ ఓటు హక్కు ఎన్నికల ద్వారా ప్రభుత్వం ఏర్పాటు, షెడ్యూల్డ్ కులాలకు, షెడ్యూల్డ్ తెగలకు చట్ట సభలలో, ప్రభుత్వ ఉద్యోగాలలో రిజర్వేషన్లు వచ్చాయి. ఆ తర్వాత కాలంలో ఈ రిజర్వేషన్లను కొన్ని బిసి కులాలకు కూడా వర్తింపజేశారు. ఐతే, స్వాతంత్ర్యానంతర కాలపు అనుభవాన్ని బట్టి, ప్రజలను పుట్టుకను బట్టే ఎక్కువ, తక్కువ స్థాయిలకు చెందిన వారిగా విడదీసే కులవ్యవస్థ ఉనికిలో ఉన్నంత కాలం, రాజ్యాంగవరంగా కుల అణచివేతను నిర్మూలించడానికి రూపొందించిన చర్యలు ఏవీ తమ లక్ష్యాన్ని నెరవేర్చలేవు అన్నది స్పష్టమైంది. ఈ నిచ్చెనమెట్ల మాదిరి అసమానతలతో కూడిన కుల వ్యవస్థే అణచివేతతో కూడివుంది. రిజర్వేషన్ల ఫలితంగా అన్ని వృత్తులలోనూ, ఉద్యోగాలలోనూ అణగారిన కులాలవారికి కూడా తమ జనాభా నిష్పత్తి ప్రకారం అవకాశాలు లభించాయని మాట వరసకు అనుకున్నా, సుదీర్ఘకాలంగా కొనసాగుతున్న కుల వ్యవస్థ, దానిని బలపరిచే సిద్ధాంతం, భావజాలం ఉన్నంత కాలమూ ఈ సిద్ధాంతానికి, భావజాలానికి అటు అణచివేసే తరగతులు, ఇటు అణచి వేయబడుతున్న తరగతులు రెండూ తలొగ్గాయి. సమాజంలో సామాజిక అణచివేత కొనసాగుతూనే వుంటుంది. ఆర్థికవ్యవస్థలో అణచి వేతను తొలగించినంత మాత్రాన కుల వ్యవస్థ ఈ సమాజంలో అంతరించదు. కుల పరంగా మనుషుల్ని గుర్తించే విధానమే మొత్తంగా - అంతం కావాలి. అంబేద్కర్ చెప్పినట్టు కుల నిర్మూలన సాంతం జరగాలి. గాంధీ దీనికి భిన్నంగా ఎక్కువ తక్కువలు లేని, అణచివేత లేని కుల వ్యవస్థ కొనసాగవచ్చునని అందులో చేసే పనికి కులానికి ఉన్న సంబంధాన్ని తెగతెంచి అందరూ అన్ని రకాల పనులనూ - పంచుకునేలా మార్పు

చేయవచ్చునని భావించాడు. (ఆ మేరకు గాంధీ ఆశ్రమాల్లో మరుగుదొడ్ల శుభ్రం చేయడంతో సహా అన్ని పనులనూ అందరూ పంచుకునేవారు.) ఇక్కడే సంబంధాల చర్చ తలెత్తుతుంది. సమాజంలో ప్రతీ ఒక్కరికీ ఏదో ఒక సమూహంతో సంబంధం ఉంటుంది. ఇది నా స్వంత సమూహం అనే విధంగా ఆ సంబంధం ఉంటుంది. అది సాధారణంగా కుల సంబంధంగా ఉంటుంది. సమాజంలో వివిధ సమూహాల(కులాల) ప్రజలు పాదార్థిక జీవితంలో సమానత్వాన్ని సాధించినప్పటికీ, కుల వ్యవస్థ కొనసాగుతున్నందున, ఒక కులం పట్ల మరొక కులానికి చిన్నచూపు ఉండడం అనేది కొనసాగుతూనే వుంటుంది. అందువల్ల అణచివేత కొనసాగుతూనే వుంటుంది. ఫలితంగా సామాజిక అభివృద్ధి అసంపూర్ణంగా ఉండిపోతుంది. ఈ పరిస్థితి సహించరానిది. అణచివేతను భరిస్తున్న తరగతుల ప్రజలు తమ పరిస్థితి ఆ విధంగా ఉండడం మామూలేనని భావించి సర్దుకుపోయేటట్టు వారిని భావజాలపరంగా సంసిద్ధం చేసినా, (ఇది దైవ నిర్ణయం అనో, తలరాత అనో, కట్టుబాట్లు అతిక్రమించకూడదనో భావించేలా చేయడం) వారిని అణచివేయడం అనేది జరుగుతూనే వుంటుంది. తమ కుల సమూహంతో వారికి ఉన్న సంబంధం రీత్యా వారు ఆ విధంగా అణచివేతకు తలొగ్గవచ్చు. ఆ విధంగా వారు అణచివేతను ఆమోదించడం లేదా సహించడం బట్టి అణచివేత సమర్థనీయం ఎంతమాత్రమూ కాదు. తమ మీద అణచివేత సాగుతోందన్న వాస్తవాన్ని ఆ సమూహం గుర్తించకపోయినా, లేక అణచివేతను వారు ఆమోదిస్తున్నా, కుల అణచివేత సాగుతోందంటూ చెప్పడం అంటే ఆ సమూహాల మీద (అణగారిన కులాల ప్రజల మీద) బలవంతంగా మన అభిప్రాయాన్ని రుద్దడమే అని వాదించే వారున్నారు. కాని ప్రస్తుతం తమ మీద అణచివేత సాగడం లేదంటూ వారు తిరస్కరించినా, వారి సమస్య ఎప్పుడో ఒకప్పుడు స్పష్టమైన రూపు తీసుకుంటుంది. అప్పుడు తరతరాలుగా సాగుతున్న అణచివేత మీద ఆగ్రహం పెల్లుబుకుతుంది. ప్రస్తుతం వారు మౌనంగా ఉన్నారనో, లేక ఆధిపత్య కుల వ్యవస్థ కట్టుబాట్లకు వారు లోబడి వున్నారనో వాదించడం అంటే వివక్ష పూరితమైన కుల వ్యవస్థ కొనసాగడం మామూలేనన్న వైఖరి తీసుకోవడమే. అంతే గాక వివక్షతను భరించాలన్న తప్పుడు భావనను సమర్థించడమే అవుతుంది. పైగా కుల ప్రాతిపదిక మీదనే సామూహిక సంబంధాలు కొనసాగడంలో తప్పు లేదని, అలా కొనసాగుతూనే వుంటాయని, కులవ్యవస్థ ఉనికితో సామాజికాభివృద్ధికి ఏ సంబంధమూ లేదని వాదించడమే అవుతుంది. మరొక్కసారి మననం చేసుకోవాలం టే, ఇప్పుడు కావలసింది ఈ వివక్ష పూరితమైన, అణచివేతతో కూడిన వ్యవస్థను వదిలించుకుని ముందుకుపోవడం. దాంతోబాటు కులపరంగా ఏర్పడిన సామూహిక సంబంధాలను, ఆ సంబంధాలను సమర్థించే సైద్ధాంతిక భావజాలాన్ని కూడా వదిలించుకుని ముందుకుపోవాలి. కావలసినది కుల నిర్మూలన. అది జరగనంత కాలం, ప్రజలు తాము ఏదో ఒక కులానికి చెందిన వారమేనన్న భావనతో ఉండి ఆ సంబంధాలను కొనసాగిస్తున్నంత కాలం నిజమైన సామాజిక పురోగతి అనేది సాధ్యం కాకుండాపోతుంది.

స్వాతంత్ర్యానంతరం భారతదేశంలో కుల సమస్య పరిష్కారానికి రకరకాల ప్రయత్నాలు జరిగాయి. ప్రభుత్వ ఉద్యోగాలలో, ప్రభుత్వ విద్యాసంస్థలలో రిజర్వేషన్ విధానాన్ని ప్రవేశపెట్టి సామాజిక న్యాయం కోసం గట్టి జోక్యం చేసుకున్నారు. అదే సమయంలో అణచివేతకు గురౌతున్న కులాల ప్రజల్లో అస్థిత్వ రాజకీయాలు తలెత్తాయి. ముఖ్యంగా ఇవి ఎన్నికల రంగంలో వ్యక్తం అయాయి. ఒక వ్యక్తి-ఒక ఓటు అన్న విధానం ఉంది గనుక, అణచివేతకు గురవుతున్న కులాల ప్రజలు సంఖ్య రీత్యా అధికంగా ఉన్నారు గనుక, ఆ తరగతుల పాదార్థిక, సామాజిక, సాంస్కృతిక ప్రయోజనాలకు ప్రాతినిధ్యం వహించే రాజకీయ పార్టీలను అధికారంలోకి తేవాలనే దిశగా ఇవి వ్యక్తమయ్యాయి. ఇటువంటివే మరికొన్ని వ్యూహాలు అమలు చేయడానికి ప్రయత్నాలు జరిగాయి. కులాల దొంతరలకు, వర్గపరమైన దొంతరలకు సంబంధం తెగ్గొట్టడానికి తోడ్పడుతుందన్న భావనతో దళిత పెట్టుబడిదారుల సంఖ్యను బాగా పెంచడానికి ప్రయత్నాలు జరిగాయి. ఈ ప్రయత్నాలన్నీ ఆయా కుల సమూహాల సామాజిక సంబంధాల చట్రానికి లోబడే జరిగాయి. కుల అణచివేతకు ముగింపు పలకాలన్న ప్రయత్నంలో భాగంగా జరిగే ఈ మాదిరి ప్రయత్నాలను బలపరచవలసిందే. కాని ఈ ప్రయత్నాలతోటే గమ్యం సిద్ధించదు. ఈ ప్రయత్నాలేవీ కుల నిర్మూలనకు దారి తీయవు. జనాభాలో కులాల వారీగా ఏయే నిష్పత్తిలో ఉన్నారో, వివిధ వృత్తులు, ఉద్యోగాలు, వ్యాపకాల్లో ఆ కులాల భాగస్వామ్యం అదే నిష్పత్తిలో లేదు. ఈ పరిస్థితిని సరిచేయాలి. ఐతే అలా సరి చేసినంత మాత్రాన కుల అణచివేత అంతం కాదు. పైగా ఫక్తు అస్థిత్వ రాజకీయాలను అనుసరించడం ద్వారా గానీ, అస్థిత్వ ప్రాతిపదికన డిమాండ్లు లేవనెత్తి వాటిని సాధించుకోడానికి ప్రయత్నించడం ద్వారా గానీ నిష్పత్తిని సరి చేయడం సాధ్యం కాదు. ప్రస్తుతం సమాజంలో రాజకీయ, సామాజిక అధికారం అగ్రకులాలకు అనుకూలంగా సాగుతోంది. అందువలన అస్థిత్వ ప్రాతిపదికన లేవనెత్తిన డిమాండ్లను పరిష్కరించడానికి ఈ పరిస్థితి ఎంత మాత్రమూ ఒప్పుకోదు. ఒకవేళ తప్పనిసరి పరిస్థితుల్లో అంగీకరించినా, ఆ తర్వాత ఆచరణలో వాటిని తిరస్కరించడం జరుగుతుంది.

అంతేకాదు, ఇప్పుడు అమలులో ఉన్నవాటిని సైతం తిరగదోడడం జరుగుతుంది.

ప్రస్తుతం భారతదేశంలో దళితులకు, ఓబీసీలకు అమలులో ఉన్న రిజర్వేషన్లను రెండు వ్యూహాలతో దెబ్బ తీస్తున్నారు. **మొదటిది :** రిజర్వేషన్లు వర్తించే ప్రభుత్వ రంగాన్ని కుదించి వేస్తున్నారు. ఇది ప్రభుత్వమే అమలు జరపడానికి పూనుకున్న, నయా-ఉదారవాద విధానాలు నిర్దేశించిన ప్రకారం జరుగుతోంది. మరోపక్క రిజర్వేషన్లను జాట్, పటేల్ వంటి వెనుకబడని కులాల వారికి కూడా వర్తింపజేయాలన్న డిమాండ్లు ముందుకు వస్తున్నాయి. ఆ కులాలకు చెందిన వారు అనుసరిస్తున్న అస్థిత్వ రాజకీయాలలో భాగం ఇది. ఈ తరహా డిమాండ్లు నిజంగా అణచి వేతకు గురౌతూ రిజర్వేషన్ సదుపాయాన్ని పొందుతున్న తరగతుల పరిస్థితిని బలహీన పరుస్తుంది. (ఈ తరగతుల వారికి రిజర్వేషన్లు కల్పించేటప్పుడు ఆర్థిక కొలబద్దను ప్రవేశ పెట్టాలన్న డిమాండ్ ఇందుకు ఒక ఉదాహరణ) **ఇక రెండవది :** ఒక కులానికి ఇంకొక కులానికి మధ్య ఘర్షణను పెంచేది. ఈ ఘర్షణల వెనుక కేవలం ఆయా సమూహాలుగా కలిగివున్న సంబంధాలే ప్రాతిపదికగా ఉంటాయి. అందుచేత అస్థిత్వ రాజకీయాలు ఆర్థిక పరంగా కుల అణచివేతను తగ్గించడానికి దోహదపడవు. ఇక కుల నిర్మూలనకు తోడ్పడవని వేరే చెప్పనక్కరలేదు. ఇప్పుడు కావలసింది కులం అనే ఒక ప్రాతిపదికన సామూహిక సంబంధాలను కలిగి వుండే పరిస్థితిని మొత్తంగా అధిగమిం చడం. అణచివేతకు గురవుతున్న కులాల వారు, ఇతర కులాలకు చెందిన వారితో కలిసి కుల సంబంధాలను అధిగమించి ఉమ్మడి అంశం ప్రాతిపదికన ఉన్నతస్థాయిలో సామూహిక సంబంధాలను పెంపొందించుకోవడం. కులాంతర వివాహాలు జరగడం, పేరులో కులాన్ని సూచించే భాగాన్ని విసర్జించడం వంటి సాంస్కృతికపరమైన చర్యల ద్వారా ఈ లక్ష్యాన్ని చేరుకోవడం సాధ్యం అని ఒకప్పుడు భావించారు.

ఇప్పటికీ ఆ విధమైన చర్యలు తోడ్పడతాయి. కాని వాటి ప్రభావం చాలా పరిమితంగా మాత్రమే ఉంటుంది. కుల సంబంధాలను అధిగమించగల సంఘీభావాన్ని పెంపొందించ గల ఉమ్మడి పోరాటాలు చేపడితేనే కుల సంబంధాలను అధిగమించగలం. యూరప్ ఖండంలోని అనుభవాలను చూసిన అనంతరం మన దేశంలో ఏర్పరచుకున్న మార్క్సిస్టు అవగాహన ప్రకారం పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి చెందే కొద్దీ పెరిగే వర్గ పోరాటాలు కులాలకు అతీతంగా కొత్త సంఘీభావాన్ని సాధించడానికి దారితీస్తాయి. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం పాత ఫ్యూడల్ సమాజపు సామూహిక సంబంధాలను పూర్తిగా నాశనం చేసింది. ఆ క్రమంలో చెల్లాచెదురైన వారందరినీ తన చట్రంలో శ్రామికులుగా ఇముడ్చుకుంది. ఆ విధంగా ఒక దగ్గరకు చేరిన శ్రామికులు కొత్త సమూహాలుగా సంఘటితం కావడం ప్రారంభించారు. అటువంటి అనుభవమే భారతదేశంలో ఎదురౌతుందని మార్క్సిస్టులు భావించారు. కాని ఆ విధంగా జరిగే అవకాశాలు కనిపించడం లేదు. యూరప్ పరిస్థితులకీ, ఇక్కడి పరిస్థితులకీ తేడా ఉంది. యూరప్‌లో పెట్టుబడిదారీ విధానం అభివృద్ధి జరిగే క్రమంలో అక్కడి పాత ఫ్యూడల్ సంబంధాలు నాశనమయ్యాయి. బతుకుతెరువు కోల్పో యిన వారు అమెరికా, ఆస్ట్రేలియా, దక్షిణాఫ్రికా తదితర ప్రాంతాలకు వలసలు పోయారు. అక్కడ వారు కొత్త జీవితాలను ప్రారంభించారు. దీనివలన ఇటు యూరప్‌లోను, అటు కొత్తగా స్థిరపడిన ప్రాంతాలలోను పనులకు అవసరమైనంత మంది కార్మికులు లేకుండాపోయారు. నిరుద్యోగం చాలా పరిమితంగా ఉండేది. ఈ పరిస్థితుల్లో శ్రామిక జనం తమను తాము సంఘటితం చేసుకోవడం ప్రారంభించారు. తద్వారా ఇటు యూరప్ ఫాక్టరీలలోను, అటు కొత్తగా స్థిరపడే ప్రాంతాలలోను వారు మెరుగైన జీవితాలను సాధించుకునే అవకాశాలు వచ్చాయి. భారతదేశం నుండి అటువంటి వలసలు పోగలిగిన పరిస్థితులు లేవు. పెట్టుబడిదారీ వ్యవస్థలో అందరికీ ఉపాధి కల్పించగల సామర్థ్యం లేదు. పాత సమాజంలో సాంప్రదాయ వృత్తులలో జీవిస్తూ ఇప్పుడు పారిశ్రామికీకరణ కారణంగా ఉపాధి కోల్పోయిన వారితో బాటు జనాభా పెరుగుదల రీత్యా కార్మికవర్గ కుటుంబాలలో కొత్తగా వచ్చే నిరుద్యోగులను కలిపితే వారందరికీ పెట్టుబడిదారీ వ్యవస్థ ఉపాధి కల్పించలేదు. ఐతే నిరుద్యోగం బాహాటంగా కనిపించదు. శాశ్వత ఉద్యోగాలను మెరుగైన జీతాలను కలిగివుండే కార్మికులతోబాటు తాత్కాలిక ప్రాతిపదికన పనిచేసే శ్రామికులు, కొన్ని రోజులు పనులు దొరికి, తక్కిన రోజుల్లో పనులు దొరకని కార్మికులు, స్వయం ఉపాధి వెతుక్కునే కార్మికులు - ఇలా ప్రచ్ఛన్నంగా నిరుద్యోగం విపరీతంగా పెరుగుతుంది. గౌరవప్రదమైన ఉపాధికి కొరత తీవ్రంగా ఉందని ఐఎల్ఓ స్వయంగా ఒప్పుకుంది. అటు గ్రామసీమల్లో దారిద్ర్యంతో సతమతమౌతున్న ప్రజానీకం, ఇటు పట్టణాల్లో ముక్కముక్కలుగా చెదిరిపోయిన శ్రామికజనం ఎక్కువ సంఖ్యలో ఉన్నారు. ఈ కారణం చేత వారిలో బలంగా సంఘటితం అయే శక్తి కొరవడింది.

అందరూ ఐక్యమై ఒకరికొకరు తోడుగా నిలిచే స్ఫూర్తి పెంపొందే అవకాశాలు లేవు. ఈ పరిస్థితులు వారిలో అస్థిత్వ రాజకీయాలు బలపడడానికి, అందునా కుల ప్రాతిపదికన రాజకీయాలు బలపడడానికి దారితీశాయి. పెట్టుబడిదారీ సరుకుల ఉత్పత్తి విధానం కార్మికులను ముక్కముక్కలుగా చీల్చి, ఒకరికి వ్యతిరేకంగా ఇంకొకరు నిలిచి ఘర్షించే పరిస్థితులు కల్పిస్తుంది. సంఘటితం కావడానికి పూర్తి వ్యతిరేక దిశలో ఈ

చీలికలు ఉంటాయి. అటువంటి చీలికలను నివారించడానికే సంఘటితం కావడం అవసరం అవుతుంది. కాని అటువంటి సంఘటనలను నిర్మించడం కష్టం ఔతుంది. ముఖ్యంగా ఉద్యోగాలు తాత్కాలిక స్వభావంతో ఉండడం, రకరకాల పద్ధతులలో కార్మికులను పనుల్లో నియోగించడం వలన వారిని సంఘటితం చేయడం దుర్లభం ఔతుంది. ముక్కముక్కలుగా చీలిన కార్మికవర్గపు పరిస్థితికి రెండో ముఖంగా అస్థిత్వ రాజకీయాలు ముందుకొస్తాయి. నయా-ఉదారవాద శకంలో భారతదేశంలో స్థూల జాతీయోత్పత్తి ఎంత వేగంగా పెరిగినా, అది కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చివేస్తోంది. తగినంత సంఖ్యలో ఉపాధి కల్పించే సామర్థ్యం ఈ వ్యవస్థకు లేకపోవడమే ఇందుకు కారణం. అదే సమయంలో ఈ నయా-ఉదారవాద విధానాలు కార్మికవర్గ చీలికలకు రాజకీయ రూపంగా అస్థిత్వ రాజకీయాలను ముందుకు తెస్తున్నాయి. కార్మికులను ఆర్థికంగా ముక్కముక్కలుగా చీల్చడం ఒకవైపు జరుగుతూంటే, అటు గ్రామసీమల్లో వ్యవసాయ రంగంలోని శ్రామికులను సంఘటితం చేయడానికి కులం ఒక పెద్ద ఆటంకంగా ఉంటోంది. అటువంటి పరిస్థితి కార్మికోద్యమం తొలిరోజుల్లో పట్టణాలలో సైతం ఎదుర్కొంది. (కమ్యూనిస్టుల నాయకత్వంలోని కార్మిక సంఘాలతో సహకరించడానికి అంబేద్కర్ దళిత కార్మికుల సంఘాన్ని ఏర్పాటుచేశారు. ఈ రెండు సంఘాల సభ్యులూ ఫాక్టరీ ఆవరణలోని ఒకే మంచినీటి కొళాయి నుండి నీరు తాగాలన్న షరతు పెట్టారు) అందుచేత కార్మికవర్గం సంఘటితమై కుల సమూహాల సంబంధాలను అధిగమించే స్థాయికి చేరుకోవడం కష్టసాధ్యం అవుతుంది. పైగా చిన్న ఉత్పత్తిదారులు, చిన్న రైతులు, వ్యవసాయ కూలీలు కలిపితే చాలా పెద్ద సంఖ్యలో ఉంటారు. వారితో పోల్చితే కార్మికుల సంఖ్య చాలా తక్కువ. అందుచేత కులబంధాలను అధిగమించగలిగేంత బలంగా శ్రామికవర్గ బంధాలు రూపొందడం చాలా కష్టం.

మరి కుల బంధాలను అధిగమించ గలిగేంత బలమైన బంధాలు శ్రామిక ప్రజానీకం నడుమ ఏర్పడి నిజమైన సామాజిక పురోగతిని సాధించడం ఎలా ? మన రాజ్యాంగం ప్రకారం ఈ దేశంలో పౌరులందరూ సమానులే. ఆ ప్రాతిపదికన ప్రజల మధ్య ఒక విశాలమైన బంధం ఏర్పడడానికి ఆటంకంగా ఉపాధి అవకాశాల కొరత ఉంది. నయా ఉదారవాద విధానాలు అమలయే క్రమంలోనే ఈ కొరత పెరుగుతూ వచ్చింది. కొన్ని సార్వత్రిక స్వభావం కల న్యాయమైన హక్కుల సాధన కోసం ప్రజలం దరినీ సమీకరించి సంఘటితం చేయగలిగితే ఆ హక్కుల కోసం జరిగే పోరాటం ప్రజలను కులబంధాలను అధిగమించగలిగేలా చేయగలుగు తుంది. ఇప్పుడు ప్రజలందరికీ సార్వత్రికంగా ఓటు హక్కు ఒకేలా ఉంది. మరికొన్ని న్యాయమైన ఆర్థిక కోర్కెల కోసం పౌరులను సంఘటితం చేయగలిగితే అప్పుడు వారంతా కుల బంధంకన్నా ఉన్నతమైన, విశాలమైన బంధం ఏర్పరచుకుం టారు. అటువంటి సార్వత్రిక ఆర్థిక హక్కుల సాధన కోసం జరిగే కృషి అస్థిత్వ రాజకీయాల అడ్డుగోడలను అధిగమిం చగలుగుతుంది. అప్పుడు కులబంధాలు వెనక్కిపోతాయి. అదే సమయంలో సాంఘిక అసమానతలను తొలగించేందుకు ప్రస్తుతం అమలు జరుగుతున్న రిజర్వేషన్లు వంటి ప్రత్యేక ఏర్పాట్లను ఆ కృషి ఏ మాత్రమూ ఆటంకపరచదు. అటువంటి సార్వత్రిక హక్కులను, తక్షణం ఆచరించగలిగినవిగా ఉండే వాటిని కొన్నింటిని ఇక్కడ పేర్కొనవచ్చు. ఆహార హక్కు ఉపాధి హక్కు ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన వైద్య సేవలు పొందే హక్కు ప్రభుత్వం ద్వారా ఉచితంగా నాణ్యమైన విద్య పొందే హక్కు, వృద్ధాప్యంలోను, అంగ వైకల్యంతో ఉన్నప్పుడు పెన్షన్ పొందే హక్కు - ఈ హక్కులను అందరికీ వర్తించేలా చేయడం కోసం తగిన ఆచరణ చేపట్టాలి. ఈ డిమాండ్లు వివిధ కుల సమూహాలకు చెందిన ప్రజలందరినీ ఒక దగ్గరకు చేర్చి వారు కుల బంధాలను అధిగమించగలిగే చైతన్యాన్ని పొందేట్లు చేయ గలవు. ఐతే, అందరికీ ఉపాధి హక్కు కల్పించినంత మాత్రాన, హీనమైన పనుల్లో, ఎక్కువ కష్టం ఇమిడివున్న పనుల్లో తక్కువ కులాలవారే ఎక్కువ మంది కుదురుకునే పరిస్థితి మారిపోదు. ఆ సమస్యను పరిష్కరించడానికి అన్ని స్థాయిలలోనూ రిజర్వేషన్లు అమలు చేయడం ఉపాధి హక్కు అందరికీ కల్పించిన అనంతరం అవశ్యం అవుతుంది. అంటే సార్వత్రిక హక్కుల సాధన కోసం జరిగే కృషి రిజర్వేషన్ల అవసరాన్ని ఏ మాత్రమూ నిరాకరించదు. పైగా అటువంటి సార్వత్రిక హక్కుల కోసం జరిగే కృషి వలన అగ్ర కులాలలోని సామాన్యులు సైతం రిజర్వే షన్ల విషయంలో తమ ప్రతికూలతను అధిగమించగలుగుతారు. ఆ క్రమంలో కుల బంధాలను అధిగమించగలిగే ఐక్యత ప్రజల్లో ఏర్పడుతుంది.

అక్కడి నుంచి కుల నిర్మూలన దిశగా సాగిపోవడం తేలిక అవుతుంది. అదే అస్థిత్వ రాజకీయాలనే అనుసరించితే అవి కులాల నడుమ శతృత్వాన్ని పెంచి కుల నిర్మూలనను అసాధ్యం చేస్తాయి. ఇక్కడ ఇంకొక ముఖ్యమైన విషయాన్ని పరిశీలించాలి. భారతీయ సమాజంలో కేవలం కులం అనేదే లోపం అని అనుకోరాదు. మతపరమైన చీలికలు ఉన్నాయి. ముఖ్యంగా ఇవి హిందువులు, ముస్లింల నడుమ పెరుగుతున్నాయి. ఈ మధ్య కాలంలో ఇవి ముఖ్య భూమికను పోషిస్తున్నాయి. ఈ మత విభేదాలు, కుల సమస్య రెండూ ముడిపడి వున్నవే. భారత ఉప ఖండంలో ముస్లింలుగా మారిన వారిలో అత్యధికులు తక్కువ కులాల నుండి వచ్చిన వారే. మతం మారినప్పటికీ వారింకా చాలా అథమస్థాయిలోనే కొనసాగుతున్నారు. వేరుగా

చూడబడుతున్నారు. పైగా, హిందువులలోని తక్కువ కులాల వారికి ఉన్న మాదిరిగా రిజర్వేషన్లు వారికి లేవు. ఇస్లాం మతం కులాన్ని అధికారికంగా గుర్తించదు కనుకనే ఈ పరిస్థితి ఉంది. అందువల్లనే, విద్యాస్థాయి వంటి సామాజిక ప్రమాణాలను చూసినప్పుడు ముస్లింలు దళితులకన్నా దిగువ స్థాయిలోనే ఉన్నారు. ఇటీవల కాలంలో కొన్ని రాష్ట్రాలలో వెనుకబడ్డ కులాల కోటాలో అంతర్భాగంగా ముస్లింలకు కూడా రిజర్వేషన్లు కల్పించారు. (మొత్తం అన్ని రకాల రిజర్వేషన్ కోటాలూ కలిపి ఒక శాతాన్ని మించి ఉండకూడదని సుప్రీంకోర్టు ఆదేశించింది) కాని హిందూత్వవాదులు నిరంతరం హిందువులలో ముస్లిం-వ్యతిరేకతను రెచ్చగొడుతున్నందు వలన ముస్లింలకు ఉద్దేశించిన రిజర్వేషన్లు అమలు కాకుండా మిగిలిపోయాయి. పౌరులు అనే భావనను, ఆ పౌరులందరికీ కులం, మతంతో నిమిత్తం లేకుండా కొన్ని హక్కులు - ఓటు హక్కు ఉన్నట్టే - సార్వత్రికంగా ఉండాలన్న డిమాండ్ను ముందుకు తెచ్చినట్టైతే మనం ముందుకు పురోగమించడానికి దారి ఏర్పడుతుంది.

ఇదంతా చర్చించడం అంటే ఒకానొక 'పౌరుల పోరాటం' అనేదానిని తెచ్చి దానిని వర్గ పోరాటానికి ప్రత్యామ్నాయంగా చూడమని చెప్పడం ఎంతమాత్రమూ కాదు. అసలు వర్గ పోరాటం అనేదే ప్రతీ పౌరుడికీ కొన్ని కనీస ప్రమాణాలతో కూడిన పాదార్థిక, సాంస్కృతిక జీవితం గ్యారంటీ చేయడం లక్ష్యంగా ముందుకు సాగాలి అని మాత్రమే సూచిస్తున్నాను.

ఇక్కడ ఒక ప్రశ్న తలెత్తుతుంది. ఈ సార్వత్రిక హక్కులు అనేవి ఆచరణ సాధ్యమేనా ? దీనికి సమాధానం ఒక్కటే. ఇప్పుడున్న పరిస్థితుల్లో మనం వేటిని మార్చగలం, ఏవి కొనసాగాలని భావిస్తున్నాం అన్నది ముందు మనం తేల్చుకోవాలి. ప్రస్తుత పరిస్థితుల్లో వేటినీ మార్చలేము అని అనుకుంటే అప్పుడు మనం ప్రస్తుత పరిస్థితులలోనే సర్దుకుని పోవలసి వుంటుంది. కుల బంధాలను, మతపరమైన బంధాలను అధిగమించి ఒక విశాలమైన ఐక్యత ప్రాతిపదికన సంబంధాలను పెంపొందించాలి అనుకున్నప్పుడు మనకి ఆటంకాల గురించిన భావన మారుతుంది. ఒక ఉదాహరణతో ఇక్కడ స్పష్టత వస్తుంది. మనం పైన సూచించిన సార్వత్రిక ఆర్థిక హక్కులను అమలు చేయడానికి అదనంగా ప్రజాధనం అవసరం అవుతుంది. అదే సమయంలో కొన్ని హక్కుల అమలు మొదలైతే మరికొన్ని హక్కుల అమలుకు దారి ఏర్పడుతుంది.

ఉదాహరణకు : అందరికీ ఉచితంగా నాణ్యత కల విద్యను పొందే హక్కు అమలైతే అప్పుడు అందుకోసం ఉపాధ్యాయులను పెద్ద సంఖ్యలో నియమించడం అనివార్యం. వారితోబాటు పాఠశాలల నిర్వహణకు, స్కూలు భవనాల నిర్మాణానికి పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, కార్మికులు అవసరం. ఐతే ఇందు కోసం మన జీడీపీలో 8 నుండి 10 శాతం వరకూ ఖర్చు చేయాలి. మన జీడీపీతో పోలిస్తే వసూలయే పన్ను నిష్పత్తి ప్రపంచంలోని ఇతర దేశాలకన్నా చాలా తక్కువ. అందుచేత పన్నులను పెంచడం పెద్ద సమస్య కాబోదు. ఐతే, పన్నులను పెంచితే మదుపుదారుల విశ్వాసం దెబ్బ తింటుంది వంటి వాదనలు తెచ్చి పన్నులను పెంచకుండా అడ్డుకోవడం నయా-ఉదారవాద వ్యవస్థలో జరుగుతోంది. అందుచేత మనకి పైన చెప్పుకున్న సార్వత్రిక హక్కుల సాధనలో ప్రధాన ఆటంకంగా ఈ నయా-ఉదారవాద విధానాలు ఉంటాయి. ఈ విధంగా పన్నుల పెంపును అడ్డుకోవడం అన్యాయం. అందరికీ వర్తించే కొన్ని సార్వత్రిక హక్కులను అమలు చేయడానికి తగిన వనరులు ఈ వ్యవస్థలో లభిస్తున్నప్పుడు ఆ హక్కుల అమలుకు ప్రాధాన్యత ఇవ్వడంకన్నా, ప్రస్తుత ఆర్థిక విధానాల కొనసాగింపుకే ప్రాధాన్యతనివ్వడం ఏ మాత్రమూ న్యాయం కాదు. అందుచేత ప్రస్తుత ఆర్థిక విధానాల చట్రం లోపలే మనం ఏ హక్కు కోసమైనా కృషి చేయాలి అని అనుకుంటే మనం ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేం.

ఇంకో విషయం కూడా చెప్పాలి. నయా ఉదారవాదం.. ప్రభుత్వం ఒక్క మదుపుదారుల విశ్వాసాన్ని పరిరక్షించే విషయంలో తప్ప వేరే దేనిలోనూ జోక్యం చేసుకోకూడదని నిర్దేశిస్తుంది. పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలో స్వత: సిద్ధంగానే ఒక ప్రాప్తకాలజ్ఞత ఉంటుంది. ప్రభుత్వం జోక్యం చేసుకోకూడదని నియంత్రించడంతో ఆ ప్రాప్తకాలజ్ఞత పూర్తి స్థాయిలో విజృంభిస్తుంది. దాని ఫలితంగా అసమానతలు తీవ్రంగా పెరుగుతాయి. కార్మికుల వేతనాలు కనీస అవసరాలను తీర్చగలస్థాయి కన్నా తక్కువకే కుదించబడతాయి. నిరుద్యోగసైన్యం సైజు అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది. మరొక వైపు కార్మికుల ఉత్పాదకత పెరుగుతూవుంటుంది. దాని వలన ఉత్పత్తి అయిన సంపదలో పెట్టుబడిదారుల వాటా అంతకంతకూ పెరిగిపోతూవుంటుంది.

ఇప్పటికే అనేక సామాజిక, ఆర్థిక అసమానతలతో ఉన్న మన దేశంలో ఆ అసమానతలను మరింతగా పెంచే విధానాలను అదనంగా తెచ్చి బలవంతంగా అమలు చేయడం జరుగుతోంది. దాని ఫలితంగా కులపరంగా, మతపరంగా అసమానతలు పెరిగిపోతాయి. అన్ని రకాల అసమానతలకూ వ్యతిరేకంగా నిలిచి అంతరాలను తగ్గించాలనుకున్నప్పుడు అటువంటి కృషిలో భాగస్వాములయ్యే వారు నయా-ఉదారవాద వ్యవస్థను మనం అధిగమించలేమని భావించరాదు. అలా భావిస్తే కష్టజీవుల మధ్య ఎటువంటి విశాల ఐక్యతనూ నిర్మించడం సాధ్యం కాదు. అది సామాజిక ఘర్షణలు మరింత తీవ్రం కావడానికే దారితీస్తుంది. ❑

# దేశ సరిహద్దులు దాటిన కులం

అనువాదం: రాజ్ కుమార్ పసెద్దుల - అశోక్ ధనావత్

కుల ఆధారిత దోపిడీ భారతదేశ సామాజిక శ్రేణిని ప్రతిబింబిస్తుంది. అది ప్రవాస భారతీయుల ద్వారా ప్రపంచ వ్యాప్తంగా విస్తరించింది. జూన్ నెలలో హిందూజా కుటుంబానికి చెందిన నలుగురికి జెనీవా లోని స్విస్ కోర్టు 4.5 సంవత్సరాల జైలు శిక్ష విధించింది. వారంతా భారతీయ సంతతికి చెందిన స్విస్ దేశ పౌరులు. వారు భారతదేశం నుండి జెనీవాకు తీసుకువచ్చిన గృహ కార్మికులకు సగటు నెలవారీ జీతంలో 10% కంటే తక్కువ చెల్లించారని తేలింది. వారికి నెలకు 220 నుండి 400 స్విస్ ఫ్రాంక్‌లు మాత్రమే చెల్లించడం ద్వారా వారు శ్రమ దోపిడీకి పాల్పడినట్లు తేలింది. ఆ కుటుంబం తక్కువ వేతనం ఇవ్వడమే కాకుండా కార్మికులకు ఎటువంటి సెలవులు ఇవ్వకుండా లేదా అదనపు పరిహారం చెల్లించకుండా రోజూ 18 గంటలపాటు షిఫ్టుల వారీగా పని చేయమని ఒత్తిడి చేసింది. మరియు వారి జీతాలను భారతీయ ఉద్యోగ మార్కెట్ ప్రమాణాలతో చెల్లించింది. గృహ కార్మికులకు ప్రతి మూడు నుండి ఆరు నెలలకు భారత కరెన్సీలో వేతనాలు చెల్లించింది. అదనంగా, స్విట్జర్లాండ్‌లోని ఇతర ప్రాంతాలకు కాకుండా జెనీవాలోనే వారి కదలికలను హిందూజా కుటుంబం పరిమితం చేసింది. అక్కడికి వచ్చిన తర్వాత వారి పాస్‌పోర్ట్‌లను జప్తు చేసింది. స్వల్పకాలిక EU శెన్జెన్ వీసాలపై తీసుకురాబడిన ఈ కార్మికులకు చట్టపరమైన అధికారం లేదా అనుమతులు పొందే ప్రక్రియను కూడా దోషులు ప్రారంభించలేదు. హిందుజా కుటుంబం తమ కార్మికులకంటే తమ కుక్కల కోసం ఎక్కువ ఖర్చు చేస్తుందని ప్రాసిక్యూటర్ వైవ్స్ బెర్టోసా వాదించారు. ఈ వార్త భారతీయ మీడియాతో సహా ప్రపంచవ్యాప్తంగా ప్రకంపనలు రేపింది.

ఈ కేసు సాధారణమైనది కాదు. ఇది కులం, వర్గం, జెండర్‌తో ముడిపడి ఉన్న విస్తృత దోపిడీ నమూనాను ప్రతిబింబిస్తుంది. కుల-అణచివేతకు గురైన వారి శ్రమను ఈ నయా ఉదారవాద (నియో లిబరల్) వ్యవస్థ దోపిడీ చేస్తుంది. ఈ విధానం సంపన్న భారతీయులకు అందుబాటులో ఉన్న సులభమైన వలస అవకాశాల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరిస్తోంది. అణగారిన కులాల నుండి మొదటి తరం చదువుకున్న వారిగా, ప్రవాస భారతీయులలోని భారతీయ మరియు దక్షిణాసియా మూలాలకు చెందిన వ్యక్తులకు సంబంధించిన ఇటువంటి దోపిడీ కేసులను ఈ మా వ్యాసం ద్వారా తెలియజేయాలి అనుకుంటున్నాము. అలాగే దాని వెనుక ఉన్న కారణాలను పరిశీలించి, రిషి సునక్, ప్రీతి పటేల్, సుయెల్లా బ్రేవర్‌మాన్, కమలా హారిస్ వంటి మితవాద రాజకీయ నాయకుల కార్మిక వ్యతిరేక రాజకీయ విధానాలకు గల సంబంధాలను వివరించాలనుకుంటున్నాము.

### భారత సాంస్కృతిక కట్టుబాట్లు

భారతదేశంలో ఇంటి పనులను చేయడం కోసం ఎక్కువగా కుల-అణచివేతకు గురైన లేదా ఆదివాసీ (గిరిజన) నేపథ్యాల నుండి వచ్చిన మహిళలను తీసుకుంటారు. కాంట్రాక్టులు మరియు చెల్లింపుతో కూడిన అనారోగ్య లేదా ప్రసూతి సెలవు వంటి రక్షిత నిబంధనలు లేకుండా, ఈ అనధికారిక పని కార్మికులను శ్రమదోపిడీకి గురి చేస్తుంది. సమాజంలోని ఉన్నత స్థాయికి చెందిన కుటుంబాలు ఎక్కువగా ఈ అనధికారిక కార్మికుల శ్రమపై ఆధారపడి ఉన్నాయి. అయినప్పటికీ, యజమానులు తమ గృహ కార్మికుల పట్ల వ్యవహరించే తీరు తరచుగా అణచివేతకు గురిచేస్తుంది. కార్మికులు వారు పనిచేసే ఇళ్లలోని ఫర్నిచర్‌పై కూర్చోవడానికి అనుమతించకపోవడం, వినియోగానికి ప్రత్యేక పాత్రలు ఇవ్వడం సాధారణంగా జరుగుతున్న ఆచారం. ఇక్కడ విడ్డూరమేమిటంటే, వాటిని శుభ్రంగా ఉంచే వారినే ఎక్కడ వారి పరిసరాలను 'అశుద్ధం లేదా కలుషితం' చేస్తారో అనే నెపంతో సంపన్నులు వారిని కొన్ని గేటెడ్ అపార్టుమెంట్లు లేదా కమ్యూనిటీలలో లిఫ్టులను ఉపయోగించడానికి అనుమతించరు. ప్రత్యేక ప్రవేశ ద్వారాల ద్వారా వారిని అనుమతిస్తారు. ఒక విధంగా, గేటెడ్ కమ్యూని టీలు అణగారిన కుల కార్మికులను దూరంగా ఉంచుతూ అవొక ఆధునిక కుల అగ్రహారాలుగా ఏర్పడుతున్నాయి. ఇటువంటి చర్యలు నిచ్చెన మెట్ల కుల సమాజంగా విభజించబడిన కుల క్రమం మూలాల నుండి వచ్చినవి. మొదటి మూడు స్థానాల్లో ఉన్న వ్యక్తులు అర్చక విధులు, రక్షణ, వ్యాపారం వంటి 'స్వచ్ఛమైన' పనిని చేయడానికి ఉద్దేశించబడ్డవారైతే, ఆ క్రింది స్థానంలో శూద్రులు మలినమైన అశుభ్రతగా ఉండే పనులు చేయడానికి ఉద్దేశించబడ్డవారు. ఈ కుల వ్యవస్థ వెలుపల ఉన్న వ్యక్తులు అంటరానివారు, చూడరానివారుగా పరిగణించబడ్డారు. కార్మికులు ఫర్నీచర్, పాత్రలు, ఎలివేటర్లను ఉపయోగించ కుండా నిషేధించే ఆచారం ఆధునిక రోజుల్లో వ్యక్తమవుతున్న

తీరే ఈ కులతత్వం. శ్రమ మరియు శ్రామికుల యొక్క విభజన వలన ఆధిపత్య కులాలు అనుభవిస్తున్న సౌలభ్యం తరచుగా సవాలు చేయబడదు. దోపిడీ స్వభావం గల ఈ అలవాటు భారతదేశం, ఉపఖండంలోని విషయాలలో సహజ క్రమం వలె చూడబడు తుంది. ఆధిపత్య కులాల ప్రజలు శ్రమ దోపిడీ చేసేందుకు అర్హులని భావిస్తారు. అనేక సందర్భాల్లో, ఈ వ్యవస్థీకృత అణచివేత యొక్క స్వభావం కారణంగా ఈ ఆలోచనను కార్మికులే అంతర్గతంగా స్వీకరించారు. ప్రస్తుతానికి ఈ దోపిడీని అంతం చేయాలని లేదా కనీస వేతనం, అనారోగ్య వేతనం, వారంవారీ తప్పనిసరి సెలవులు, ప్రసూతి వేతనం వంటి దిద్దుబాటు చర్యలను డిమాండ్ చేసే ప్రధాన సామాజిక లేదా రాజకీయ ఉద్యమాలు ఏవీ లేవు. కొన్ని ఇళ్లలో గృహ కార్మికులు ఉండటం సర్వసాధారణం. వీరిలో చాలామంది గ్రామీణ ప్రాంతాలకు చెందినవారే. ఈ కార్మికులు తమకంటూ వ్యక్తిగత జీవితాలున్నాయనే విషయాన్ని మరిచిపోయి, తరచుగా తమ యజమానులతోపాటే నివసిస్తూ, నిరంతరం వారి కొరకు పని చేస్తూనే ఉంటారు. ఉదయం నుంచి రాత్రి వరకు తమ యజమానుల అవసరాలు తీర్చేందుకు నిత్యం పరిగెడుతుం టారు. ఈ అలవాటు యొక్క దోపిడీ స్వభావం గురించి కావా లనే పట్టించుకోనివ్వకుండా చేసి, వారి శ్రమతో ప్రయోజనం పొందే ప్రజల జీవితాలను చాలా సుఖమయం చేస్తుంది.

## విదేశాల్లో ఉల్లంఘనలు

ఈ సౌకర్యాలకు అలవాటుపడిన వారు ఇతర దేశాలకు వెళ్లడం ప్రారంభించినప్పుడు, వారి స్వంత శ్రమతో ఈ పనులను నిర్వహించడం చాలా ఇబ్బందికరమని వారు గ్రహిస్తారు. ప్రజలు సాధారణంగా తమ ఇంటి సహాయకులను ఎంతగా కోల్పోతారు అనే దాని గురించి అనేకసార్లు ఫిర్యాదు చేసిన దాఖలాలు మనం చాలానే చూస్తూ ఉంటాం. ఇది వారి పనివారి పట్ల వారికి ఉన్న అభిమానం వల్ల కాదు కేవలం శ్రమ దోపిడీ నుండి లభించే విశ్రాంతి కార్యకలాపాల నుండి వారు విశ్రాంతి, ప్రయోజనం పొందగలరు కాబట్టి. కొంతమంది దీనికే అలవాటు పడి తమ సిబ్బందిని వారు వెళ్లే దేశాలకు దిగుమతి చేసుకోవ డం మొదలుపెట్టారు. మనం చూసినట్లుగా, ఇది కొన్నిసార్లు స్థానిక చట్టాలకు లోబడి లొసుగులను ఉపయోగించుకోవడం ద్వారా లేదా మనం హిందుజా విషయంలో చూసినట్లుగా చట్టాన్ని తీవ్రంగా ఉల్లంఘించడం ద్వారా జరుగుతుంది. భారతదేశంలోని గృహ కార్మికులను యూరప్, యుఎస్ వంటి ప్రగతిశీల శ్రామిక చట్టాలు కలిగి ఉన్న దేశాల లేబర్ మార్కెట్ లకు తీసుకొనిపోయినట్లయితే వారి ఉపాధి, పని పరిస్థితులు అక్కడ చట్టవిరుద్ధంగా పరిగణించబడుతాయి. అక్కడ కఠినమైన ఉపాధి చట్టాలు, కనీస వేతనాలు, నియంత్రిత పని గంటలు, పెన్షన్‌లు మరియు అనారోగ్యం, ప్రసూతి వేతనాలను తప్పనిసరి చేస్తాయి. ఉద్యోగుల కోసం ఈ ప్రయోజనాలు తరచుగా ట్రేడ్ యూనియన్ల ద్వారా సామూహిక ఉద్యమాల ద్వారా పొందబడతాయి. అయినప్పటికీ, స్థానిక కార్మికులకు అందుబాటులో ఉన్న కార్మికుల రక్షణల చుట్టూ ఒక మార్గాన్ని కనుగొంటూనే UKలో డొమెస్టిక్ వర్కర్ వీసా వంటి నిర్దిష్ట నిర్బంధ వీసాలు ఉన్నాయి. ఇవి ప్రజలు తమ గృహ కార్మికులను విదేశాల నుండి తెచ్చుకోవడానికి అనుమతిస్తాయి. ఈ వీసాలపై కేవలం ఆరు నెలల పరిమితి ఉంటుంది, వీటిని మళ్ళీ పునరుద్ధరించుకోవాలి అంటే వారు తమ మాతృదేశానికి వెళ్లాల్సి ఉంటుంది. ఇంకా ఈ వీసాలపైన వచ్చిన కార్మికులు తమ ఉద్యోగదారులను వదిలి కొత్త పని చేసుకోవడానికి అవకాశం లేదు. ఈ నిబంధనల నేపథ్యంలో వారి పరిస్థితులు చేజారిపోతే వారికి చట్టపరమైన సహాయం అందడం కష్టం. కనీస వేతనం ఎగవేసే మరో మార్గం ఏమిటంటే, భోజనం, నివాసం అందించిన పక్షంలో తక్కువ వేతనం ఇవ్వవచ్చు. ఇంకా మనం దగ్గరగా గ్రహించినట్లు అయితే హిందూజాల శ్రమ దోపిడి మరియు కేలిఫోర్నియాలో లక్ష్మిరెడ్డి బాలిరెడ్డి మానవ అక్రమ రవాణా కేసులలో కూడా ఇదే ప్రధాన వాదనని ఉపయోగించారు. కార్మిక ఉల్లంఘనలు, చౌక శ్రమ కోసం మానవ అక్రమ రవాణా పాశ్చాత్య మార్కెట్లో ఇంటి పనులకు మించి విస్తరించి, విస్తృత నియోలిబరల్ దోపిడీకి దోహదపడుతుంది. పేలవమైన కార్మిక చట్టాలు విదేశాలలో కార్మికుల ప్రయోజనాలను రక్షించడంలో విఫలమవుతున్నాయి. వివిధ అభద్రతల వల్ల, జ్ఞానం లేకపోవడం, ఇమ్మిగ్రేషన్ విరుద్ధ చట్టాల కారణంగా, చాలామంది కార్మికులు విదేశాలలో చట్టపర మైన మద్దతును పొందరు, అందువల్ల వారి కార్మిక హక్కుల ఉల్లంఘనలను ఇది వేగవంతం చేస్తుంది. ఇది వారిని దోపిడీ చేయడానికి మార్గం సులువు చేస్తుంది. ఉదాహరణకు, శరవణ భవన్ వంటి గ్లోబల్ రెస్టారెంట్ చైన్‌లు - చెన్నైలో ప్రారంభమ య్యాయి. ప్రపంచవ్యాప్తంగా విస్తరించాయి. అనేక వేతన ఉల్లంఘన కేసులను ఎదుర్కొన్నాయి. కాలిఫోర్నియాలో 317 మంది ఉద్యోగులతో కనీస వేతనం చెల్లించనందుకు ఆ సమస్యను కోర్టు పరిష్కరించింది. ఈ సమస్య కేవలం రెస్టారెంట్ పరిశ్రమకు మాత్రమే పరిమితం కాలేదు. అమెరికా ఆశలు చూపించే పెద్ద పెద్ద సంస్థలు కార్మికులను దోపిడీ చేస్తాయి. ఉదాహరణకు, షిప్‌బిల్డింగ్ కంపెనీ సిగ్నల్ ఇంటర్నేషనల్ భారతదేశానికి చెందిన కార్మికులకు ఉపాధి, గృహాలు, గ్రీన్ కార్డులు వంటి వాగ్దానాల ద్వారా కార్మికులను అక్రమ రవాణా చేసింది, ఉద్యోగ భద్రత లేకుండా రద్దీగా ఉండే పరిస్థితులలో జీవించమని వారిని బలవంతం చేసి, వారి

పాస్‌పోర్ట్‌లను తమ ఆధీనంలో ఉంచుకుంది. దావా ప్రకారం U.S. చరిత్రలో ఈ కేసు అతిపెద్ద మానవ అక్రమ రవాణా ఘటనల్లో ఒకటిగా గుర్తించబడింది. మత సంస్థలు కూడా పెద్ద ఎత్తున మానవ అక్రమ రవాణా కేసుల్లో చిక్కుకున్నాయి. 2000 సంవత్సరానికి చెందిన ఒక ముఖ్యమైన కేసు. UKలోని వెంబ్లీలో ఆలయాన్ని నిర్మించే పనిలో ఉన్న నిర్మాణ సంస్థ శ్రీకోకు చెందిన భారతీయ మతపరమైన స్వచ్ఛంద సంస్థ శ్రీ వల్లభ్ నిధికి సంబంధించినది. ఇది రాజస్థాన్ నుండి కార్మికులను నియమించుకుంది. వారు జాతీయ కనీస వేతనం గంటకు 3.70కి బదులుగా 0.30 పెన్స్ చెల్లించారు, అనగా ఆ సమయంలో సగటు UK జీతం కంటే 90% తక్కువ. దాదాపు 24 సంవత్సరాల తరువాత, ఈ స్థాయి దోపిడీ ముఖ్యంగా అణగారిన కులాలు మరియు అట్టడుగు వర్గాల వారిపై ఎలాంటి మార్పు లేకుండా ఉంది. అక్కడ మతపరమైన మనోభావాలను దెబ్బతీస్తుందనే భయం. కుల-ఆధిపత్య ప్రవాస భారతీయుల కమ్యూనిటీల శక్తివంతమైన లాబీయింగ్ కారణంగా తరచుగా ఈ కేసులను తీవ్రంగా పరిగణించరు. పైన పేర్కొన్న స్వచ్ఛంద సంస్థ అప్పటి UK హోమ్ ఆఫీస్ మంత్రి పాల్ బోటెంగ్‌తో ఉన్న సంబంధాలను 'బానిస-కార్మికులను' తీసుకురావడంలో ఇమ్మిగ్రేషన్ అడ్డం కులను అధిగమించడానికి ఉపయోగించుకోవడం జరిగింది. బహుశా ఎన్నికల ప్రయోజనాల కోసం దక్షిణాసియా-మూలం ఆధిపత్య కులాలు-వర్గాలు, విదేశీ ప్రభుత్వాల మధ్య సంబంధాలను ఈ విధానం హైలైట్ చేస్తుంది. ఇది న్యాయమైన వేతనాలను నిర్ధారించడానికి ఉద్దేశించిన చట్టాన్ని దాట వేసేందుకు వారిని అనుమతిస్తుంది. మే 2021లో, హిందూ శాఖ అయిన బోచసన్వాసి అక్షర్ పురుషోత్తం స్వామినారాయణ్ సంస్థ (BAPS)పై వేసిన దావా, అమెరికా లోని హిందూ దేవాలయ నిర్మాణ స్థలంలో 15 ఏళ్లుగా అట్టడుగు కులాల కార్మికుల శ్రమదోపిడీని బహిర్గతం చేసింది. 1990వ సంవత్సరంలో, లకిరెడ్డి బాలిరెడ్డి అనే సంపన్న రియల్ ఎస్టేట్ పెట్టుబడిదారుడు బర్కిలీలోని తన 1,000 అద్దె ఆస్తుల నుండి నెలకు $1 మిలియన్ సంపాదించి, ప్రస్తుత ఆంధ్రప్రదేశ్ రాజధాని ప్రాంతంలో తన ప్రభావాన్ని కొనసాగిస్తోన్న వ్యక్తి, దళిత బాలికలను లైంగిక బానిసత్వం కోసం, బలవంతంగా పని చేయించడం కోసం వారిని అమెరికాకు అక్రమంగా రవాణా చేసి తీవ్ర దోపిడీకి పాల్పడ్డాడు.

**స్వాతంత్ర్యానికి పూర్వం నుండి సమైక్య ఆంధ్రప్రదేశ్ వరకు విస్తరించి ఉన్న ఈ దోపిడీ రెడ్డి, వెలమ, కమ్మ, ఇతర ఆధిపత్య కుల సమూహాలచే దోపిడీకి గురయిన వ్యవసాయ కార్మికుల చారిత్రక పద్ధతులకు అద్దం పట్టింది. బాలిరెడ్డి మూడు దశాబ్దాల క్రితం ఉత్తర అమెరికాలో పురాతన పెట్టుబడిదారీ ప్రజాస్వామ్యం అని పిలవబడే చోట నిరంతర కుల ఆధారిత అణచివేతను ఎత్తిచూపుతూ అనేక ఏళ్ల తర్వాత కూడా కుల గతిశీలతను ప్రభావితం చేశాడు. ఈ దోపిడీ భారతదేశ కుల నిచ్చెనమెట్ల సమాజాన్ని ప్రతిబింబిస్తుంది. ప్రవాస భారతీయుల ద్వారా ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. ఈ చర్యల వల్ల తీవ్ర పరిణా మాలు ఉన్నప్పటికీ, ప్రధాన తెలుగు మీడియా బాలి రెడ్డి గురించి ఎటువంటి వివరణాత్మక నివేదికను వారి పత్రికలలో న్యూస్ రాయలేదు. ఈ కేసు కాలిఫోర్నియాలో మానవ అక్రమ రవాణా ఏ స్థాయిలో ఉందో కూడా నొక్కి చెప్పింది. ఈ కేసు ఆధారంగా కాలిఫోర్నియా రాష్ట్రం 2005లో మానవ అక్రమ రవాణా వ్యతిరేక చట్టాన్ని ఆమోదించింది. ఏదేమైనా, బాలిరెడ్డి కుటుంబం బాధితులతో రాజీ కుదుర్చుకుంది.**

అందుకు ఫలితంగా, అతను శిక్ష అనుభవించాల్సిన దానికంటే తక్కువ అనుభవించి కేవలం 8 సంవత్సరాలలోపే జైలు శిక్షను పొందాడు. ఈ కేసులో అతని కుటుంబం పాల్గొన్నప్పటికీ, వారిపై ఏ చర్యలు లేకుండా వారి వ్యాపార విస్తరణను కుటుంబీకులు కొనసాగించారు. కాలిఫోర్నియాలో వారి వ్యాపార ప్రభావాన్ని పటిష్టం చేసుకున్నారు. అలాగే ఆంధ్ర ప్రదేశ్‌లో ప్రతిపాదిత రాజధాని అమరావతికి కొద్ది మైళ్ళ దూరంలో ఉన్న అతని ప్రైవేట్ ఇంజనీరింగ్ కళాశాల అతన్ని ఓ విజనరీ విద్యావేత్తగా ఆ ప్రాంత, అక్కడి విద్యను అభ్యసించే వారు కొనియాడుతున్నారు. ప్రవాస భారతీయులలో మానవత్వం, సంఘీభావం లేకపోవడం ప్రవాస భారతీయులలో ప్రముఖులలో మితవాద భావజాలం యొక్క పునరుజ్జీవనం ఈ మధ్య బాగా కనిపిస్తుంది. రిషి సునాక్, ప్రీతి పటేల్, సుయెల్లా బ్రావె ర్మాన్ వంటి వాళ్ళు శ్రామికవర్గం, ఇతర అట్టడుగు సమూహాలను లక్ష్యంగా చేసుకుని అమానవీయ రాజనీతిని మితవాదాన్ని ప్రచారం చేస్తున్నారు. UKలో ఈ మధ్య వీరు ద్వేషపూరిత ప్రసంగాలతో ఇస్లామోఫోబియా, వలసదారులు మరియు శరణార్థుల వ్యతిరేక భావనలు వ్యక్త పరుస్తూ, శ్రామిక వ్యతిరేక చట్టాలకు మద్దతు పలుకుతున్నారు. వీటిలో ఈ మధ్య కాలంలో రద్దు చేయబడిన రువాండా పథకం ఉంది. వీరి వ్యవహారం కుల ప్రభావం గురించి తెలియని వ్యక్తులు, ఇలాంటి వలస నేపథ్యాలు ఉన్న వ్యక్తుల నుండి వచ్చిన విచిత్ర వైఖరి అని అనుకోవచ్చు. **(మిగతా 29వ పేజీలో)**

# హిందూయిజం అంటే ఏమిటి?

(అనువాదం: జివిఎన్ చలపతి)

- బి.జయమోహన్

**ఇది దక్షిణ భారతదేశంలో కొన్ని దశాబ్దాల క్రితం ఒక స్కూలు తరగతి గదిలో ఒకానొక కుర్రవాడికి ఎదురైన అనుభవం. ఆ క్లాస్ టీచర్ "మీలో ముస్లిం విద్యార్థులు ఎవరెవరో లేచి నిలబడండి" అని గట్టిగా అడిగింది. మన కుర్రాడు తన పక్కనే కూచున్న అతని ప్రాణ స్నేహితుడు సులేమాన్ లేచి నిలబడడం చూసి తానూ లేచి నిలబడ్డాడు. కాని "నువ్వు కూర్చో" అని టీచర్ ఈ కుర్రాడిని గదమాయించింది. తర్వాత ఆ టీచర్ క్లాసులో క్రైస్తవులు ఎవరో వారంతా నిలబడాలని కోరింది. తన మరో ప్రాణ స్నేహితుడు పీటర్ లేవడం చూసి మన కుర్రాడు మళ్ళీ తానూ నిలబడ్డాడు. అప్పుడు కూడా టీచర్ ఇతడిని కూర్చోమని గట్టిగా చెప్పింది. చివర్లో "ఇప్పుడు హిందువులంతా లేచి నిలబడండి" అని టీచర్ ఆదేశించింది. అప్పుడు ఆ బెంచీ లోని పరమేశ్వర అనే వడ్రంగి కుర్రాడు లేచి నిలబడ్డాడు. కాని మన కుర్రాడు లేవలేదు. ఎందుకంటే ఆ పరమేశ్వరతో తానెప్పుడూ ఆడుకోలేదు కదా. అప్పుడు ఆ టీచర్ మన వాడిని ఎర్రగా చూసి "లేచి నిలబడరా గాడిదా ! నువ్వు హిందువువి" అని గట్టిగా అరిచింది.**

"అప్పుడైతే నేను మాత్రం గాడిద అన్న పదానికి హిందువు అన్నది ఒక పర్యాయ పదమేమో అనుకున్నాను. కాని నేను గాడిదనైతే కాదు మరి. మరి ఆ టీచర్ నన్ను హిందువుగా ఎలా పరిగణించింది? ఇంటికెళ్ళాక నేను క్లాసులో జరిగింది మా అమ్మతో చెప్పాను. నేను గాడిదను కాదు కదా, అటువంటప్పుడు గాడిదకు పర్యాయ పదమైన హిందువు అన్న పదం నాకెలా వర్తిస్తుందని అడిగాను. అప్పుడు మా అమ్మ నువ్వు హిందువువే అని చెప్పింది. నానెత్తిన పిడుగు పడినట్టయింది. అప్పుడు మా అమ్మ ఇంకా ఇలా వివరించింది. హిందువు అంటే అర్థం గాడిద అని కాదు. ఆదివారం నాడు చర్చికి గానీ, శుక్రవారం నాడు మసీదుకి గానీ వెళ్ళకుండా ఉండే మెజారిటీ భారతీయులందరూ హిందువులు గానే పరిగణించబడతారని ఆమె చెప్పింది. ఈ సంఘటనను ఆ కుర్రవాడు దశాబ్దాల తర్వాత, 1981 ఆగస్టు 12న "నాకు సంబంధించి మతం అంటే ఏమిటి ?" అన్న వ్యాసంలో ప్రస్తావించాడు. అప్పటికే అతగాడి కుతూహలం అతడిని తాత్విక శోధనలో చాలా లోతుల్లోకి పోయేలా చేసింది. ఆ తర్వాత అతడు 'నిత్య చైతన్య యతి' అనే పేరుతో హిందూ సన్యాసిగా ప్రసిద్ధికెక్కాడు. ఆధునిక కేరళ చరిత్రలో ప్రతిభావంతుడైన తత్వవేత్తగా, పండితుడిగా అతడు తన ముద్ర వేశాడు (1924–1999). ఆధ్యాత్మికత, కళ, సాహిత్యం, మనస్తత్వ శాస్త్రం వగైరా అంశాల మీద ఇంగ్లీషులో, మలయాళంలో దాదాపు 140 గ్రంథాల వరకూ రచించారు. ప్రఖ్యాత నారాయణ గురు స్థాపించిన ఆధ్మాత్మిక సాంప్రదాయ మార్గాన్నే తానూ కొనసాగించాడు.

నారాయణ గురు మాదిరిగానే ఈయన కూడా కుల వ్యవస్థను తీవ్రంగా వ్యతిరేకించాడు. హిందూయిజం అంటే అదొక ఏక శిలారూపమైన వ్యవస్థ వంటిది కాదని విశ్వసించాడు. ఒక మతాన్ని విశ్వసించడం లేదా మతానికి దూరంగా ఉండడం అనే దానిని బట్టి ఒక వ్యక్తి ఆధ్యాత్మిక పురోగతి ఆధారపడి వుండదని ఆయన గట్టిగా చెప్పాడు. ఇటువంటి మహానుభావులు అద్వైత వేదాంతాన్ని అనుసరించారే తప్ప వైదిక సాంప్రదాయాన్ని కాదు. బ్రాహ్మణ నియమనిష్టలను అధిగమించి విశ్వమానవ సోదరత్వాన్ని ప్రచారం చేశారు. ఇతరుల యెడల సానుభూతితో వ్యవహరించడం నేర్పారు. ఇదే హిందూ జీవన విధానం అని వారు ప్రకటించారు. ఇదే మన భారతీయ సాంప్రదాయపు ప్రధానముద్ర అని చెప్పారు. మనం దీని గురించి ఇప్పుడెందుకు చర్చిస్తున్నాం? హిందూయిజాన్ని సనాతన ధర్మం అనే ఉక్కు చట్రంతో కలిపి వేయాలని, అదే అసలైన వైదిక హిందూ అవగాహన అని రుద్దడానికి చాలా గట్టిగా ప్రయత్నాలు జరుగు తున్న చారిత్రక దశలో మన దేశం ఇప్పుడు ఉంది. నిత్య చైతన్య యతికి తాను శిష్యుడిని అని సగర్వంగా చెప్పుకునే బి.జయ మోహన్ ఈ విషయం మీద శక్తివంతంగా, కొత్త వెలుగులు ప్రసరించే విధంగా రాసిన వ్యాసం దిగువన ఇస్తున్నాం.

"భారతదేశపు పురాతన సద్ జ్ఞాన సాంప్రదాయం ఏకశిలా సదృశం కాదు. అది సంక్లిష్టమైన, బహుళత్వంతో కూడిన విజ్ఞానం. శతాబ్దాలపాటు కొనసాగిన తాత్విక సంవాదాల ద్వారా అది సుసంపన్నమైంది. పరస్పరం విరుద్ధంగా ఉండే భావాల నడుమ సంఘర్షణ,సమన్వయం ఆ సంవాదాల స్వభావం".

హిందూయిజాన్ని వైదిక మతంతో కలగలిపి వేయడం ఒక ప్రమాదకర వక్రీకరణ. ఈ మధ్య తమిళనాడు ముఖ్యమంత్రి స్టాలిన్ కుమారుడు ఉదయనిధి స్టాలిన్ సనాతన ధర్మం మీద చేసిన వ్యాఖ్యలను చాలా మంది విమర్శించారు. ఐతే వారిలో అత్యధికులకు అసలు వివాదం మతానికి సంబంధించినది కాదనీ, అది తాత్వికతకు, ఆధ్యాత్మికతకు సంబంధించినది అన్న సంగతి తెలిసినట్టు లేదు.

ఆధ్యాత్మికత అని, హిందూ తాత్వికత అని విడివిడిగా చూడడం బదులు నేను సాధారణంగా "హిందూ సజ్ఞాన (అసలైన జ్ఞాన) సాంప్రదాయం" అన్న మాటను వాడతాను. మతానికి సంబంధించి చర్చించేటప్పుడు జ్ఞానం అనే దానికి ఉన్న ప్రాధాన్యతను నొక్కి చెప్పడం నా ఉద్దేశ్యం. హిందూయిజం ఒక ఏకశిలారూపంగా ఉండే వ్యవస్థకాదు. దానికి ఒకే ప్రామాణిక సిద్ధాంత గ్రంథం అంటూ ఏదీ లేదు. అది ఏదో ఒకే కేంద్రీకృత అధికారం కింద కొనసాగేది కాదు. ఇంత వైవిధ్యంతో కూడుకున్న హిందూయిజం మీద ఒకే కేంద్రీకృత అధికారాన్ని సాధించాలని గానీ, ఒకే వ్యాఖ్యానానికి సాధికారత కల్పించాలని గానీ జరిగిన ప్రయత్నాలన్నీ రాజకీయ ప్రయోజనాలరీత్యా ప్రేరేపించబడినవే తప్ప ఆధ్యాత్మిక ప్రయోజనాల కోసం కాదు. ఇటువంటి ప్రయత్నాలు యావత్ హిందూ సద్ జ్ఞాన సాంప్రదాయాన్ని అనివార్యంగా నాశనం చేయడానికే దారి తీస్తాయి. ఆ సాంప్రదాయాన్ని పరిరక్షించాలని భావించే ప్రతీ ఒక్కరూ అటువంటి ప్రయత్నాలను గట్టిగా ప్రతిఘటించాలి. భారతదేశపు పురాతన సద్ జ్ఞాన సాంప్రదాయం కూడా ఏకశిలాసదృశం కాదు. అది ఒక సంక్లిష్టమైన, బహుళత్వం కలిగిన జ్ఞానరూపం. అది రూపొందడం వెనుక శతాబ్దాలపాటు తీవ్రంగా కొనసాగిన తాత్విక సంవాదాలు ఉన్నాయి. పరస్పరం విరుద్ధమైన భావాలను సమన్వయం చేయడానికి 'పూర్వపక్షం-సిద్ధాంతం' అనే ప్రక్రియను ఉపయోగించారు. జీవితానికి సంబంధించిన మౌలిక ప్రశ్నల చుట్టూ ఆ సంవాదాలన్నీ నడిచాయి. కాబట్టి ఆ ప్రక్రియ బహుశా ఎప్పటికీ ఆగదు. అదేవిధంగా ఆ సాంప్రదాయం కూడా కొనసాగుతుంది. నిరంతరం పెంపొందుతూ వుంటుంది.

వివిధ దృక్పథాలు, ఆచారాలు పరస్పరం సంపర్కం చెందే క్రమంలోనే, ఒకదానినొకటి పక్కకు నెట్టే ప్రయత్నాలలోనే నిజమైన జ్ఞానాన్వేషి తాత్విక-ఆధ్యాత్మిక శోధనలో కొత్త వెలుగులను దర్శిస్తాడు. భిన్న భావాలను పరస్పరం ఇచ్చి పుచ్చుకునే ఈ తరహా సంవాదాలు ఈ దేశపు ఆధ్యాత్మిక సంస్థలలో వేలాది సంవత్సరాలుగా వర్ధిల్లుతూవచ్చాయి. ప్రతీ ఒక్క తాత్విక సిద్ధాంతానికీ, ప్రతీ ఒక్క విశ్వాసానికీ ఈ సంవాద ప్రక్రియలో స్థానం ఉండేది. తమ తాత్విక దృక్పథం పూర్తిగా లోపరహితం అని, పరమసత్యం తమ దృక్పథం ద్వారా మాత్రమే లభిస్తుందని ఎవరికి వారు బలంగా వాదించేవారు.

అదే సమయంలో ఆ భావాలను వ్యతిరేకించే వారి విశ్వాసాలను వారు చిన్నచూపు చూడడం గానీ, వారిదంతా అజ్ఞానం అంటూ ముద్ర వేయడం గానీ చేసేవారు కాదు. మన దేశపు ఆధ్యాత్మిక, తాత్విక చర్చల పట్ల ఏ కాస్త చిన్న అవగాహన ఉన్నా, ఈ చర్చల్లో ఒకవైపు ఉన్నవారిని రెండోవైపు ఉండేవారు శత్రువుల ముఠాగా ఎంతమాత్రమూ పరిగణించే వారు కాదన్న సంగతి గ్రహించవచ్చు. తాత్విక వైఖరుల విషయంలో పరస్పర వ్యతిరేకత ఉండవచ్చు కాని అవతలి పక్షపు నోళ్ళు మూయించాల్సిందేనన్న ధోరణికి ఆస్కారం లేదు. దాడి చేయడం, అవమానించడం,నిషేధించడం వంటి ధోరణులకు తాత్విక రంగంలోని సత్యాన్వేషకులు అవకాశం ఇచ్చేవారు కాదు. ఈ కారణం చేతనే "దైవ దూషణ" అన్న పద ప్రయోగాన్ని నేను పూర్తిగా వ్యతిరేకిస్తాను. కొన్ని విశ్వాసాలు, చిహ్నాలు విమర్శలకు అతీతంగా ఉంటాయని విశ్వసించడం మౌలికంగానే విజ్ఞాన సముపార్జనకు, మేధోపరమైన కృషికి వ్యతిరేకం. గత 30 సంవత్సరాలుగా నేను ఇదే నొక్కిచెప్తున్నాను.

**మేధోపరమైన చర్చల్లో విశ్వాసకులకు స్థానం లేదు. కేవలం నిజాయితీగా సత్యాన్ని అన్వేషించాలనుకునే వారికి మాత్రమే స్థానం ఉంటుంది. ప్రాచీన సద్ జ్ఞాన సాంప్రదాయంలోని వివిధ రకాల ధోరణులను స్థూలంగా మూడు తరహాలుగా విభజించవచ్చు. అవి వైదిక, వైదిక-వ్యతిరేక, వేదాంత సాంప్రదాయాలు. వైదిక సాంప్రదాయాలు ప్రాథమిక, పరమ జ్ఞానానికి వేదాలే మూలాధారమని, తక్కినవన్నీ ఆ వేదాలకు కొనసాగింపు మాత్రమేనని భావిస్తాయి. వేదాల్లో నిర్దేశించిన యజ్ఞ కర్మకాండలకు అధిక ప్రాధాన్యతనిస్తాయి. కర్మకాం డలకు, ఆచారాలకు, విశ్వాసాలకు ఖచ్చితంగా కట్టుబడి వుండాల్సిందేనని నొక్కి చెబుతాయి. ఈ సాంప్రదాయాన్ని అనుసరించేవారిని ఆచార వాదులుగా (ఎట్టి పరిస్థితుల్లోనూ ఆచారాలకు లోబడి వుండాలనేవారు) నిష్టాగరిష్టులుగా (కర్మకాండలను విధిగా పాటించేవారు) చెప్పవచ్చు. మన సాంప్రదాయంలో వీరిని పూర్వ మీమాంసకులు అనేవారు.**

పూర్వ మీమాంసక సాంప్రదాయం మొదట్లో ఇంద్రుడు, వరుణుడు మొదలైన వైదిక దేవతలనే గుర్తించేవారు. శివుడు, విష్ణువు వంటి దేవతామూర్తులను సర్వశక్తి మంతులుగా

అంగీకరించలేదు. దేవాలయాలు, పూజా పునస్కారాలు సైతం వీరికి ఆమోదయోగ్యంగా లేవు. భక్తి మార్గానికి కూడా వ్యతిరేకులుగానే ఉండేవారు. అగ్నిలో ఆహుతి చేయడం అనే యజ్ఞ ప్రక్రియను మాత్రమే బలపరుస్తూండేవారు. ఐతే కాలం గడిచిన కొద్దీ పూర్వ మీమాంసకులు నెమ్మదిగా ఆరు సాంప్రదాయ విశ్వాసాలను కూడా స్వీకరించారు. అవి శైవ, వైష్ణవ, శాక్తేయ, కౌమార, గణపత్య, శౌర్య సాంప్రదాయాలు. సర్వశక్తివంతుడైన దైవానికి, దేవాలయాల్లో ఆరాధనకు, భక్తి మార్గానికి చోటు కల్పించింది పూర్వ మీమాంస. ఈనాడు వైదిక హిందూయిజంగా ఉనికిలో ఉన్నది ఈ సాంప్రదాయమే. హిందూ తాత్విక సాంప్రదాయంలో వైదిక సాంప్రదాయాన్ని బలంగా వ్యతిరేకించే ధోరణులు ఎప్పుడూ ఉంటూనేవచ్చాయి.

**సాంఖ్య, యోగ, న్యాయ, వైశేషిక సాంప్రదాయాలు సైతం అన్ని వైదిక భావనలను, అన్ని ఆచారాలను అంగీకరించలేదు. ఇక చార్వాక, తార్కిక సిద్ధాంతాలు చూస్తే మొత్తంగానే వైదిక సాంప్రదాయాన్ని పూర్తిగా వ్యతిరేకించాయి. శైవంలోంచి పుట్టుకొచ్చిన ఆరు శాఖలు (పురా-చమయమ్) మౌలికంగానే వేదాలకు వ్యతిరేకం. శైవ శాఖలకు కొనసాగింపుగా వచ్చిన సిద్ధ సాంప్రదాయం కూడా అంతే. ఇక మూడవ తరహా అయిన వేదాంత సాంప్రదాయం జ్ఞానాన్వేషణలో తొలి మెట్టుగా వేదాలను పరిగణిస్తుంది. ఐతే అక్కడితో మొదలు పెట్టి జ్ఞానాన్వేషణను కొనసాగించడానికి వేదాల పరిధిని అధిగమించి శోధిస్తుంది. ఆ క్రమంలో వేదాంత సాంప్రదాయం కర్మకాండల చట్రాన్ని, యాగాలలో బలులిచ్చే సాంప్రదాయాలను విడిచి పెట్టింది. కొన్ని సందర్భాలలో వేదాల సూత్రాలను విమర్శించింది కూడా.**

ఈ సూక్ష్మ వివరాలను విస్మరించిన కొందరు సనాతన ధర్మం అనే పదాన్ని మొత్తం హిందూ యిజానికి వర్తింపజేస్తున్నారు. కాని సనాతన ధర్మం అంటే మొదటి తరహా సాంప్రదాయానికి మాత్రమే సంబంధించినది. దానినే ఇప్పుడు వైదికమతం అన్న పేరుతో పిలుస్తున్నారు.

సనాతనం అంటే ఆదిమ కాలం నుంచీ ఉన్నది అని, లేదా దానికి ప్రారంభం అనేదే లేనిదని అర్థం. ఆ ధర్మాన్ని బలపరిచేవారు దాని ప్రాచీనతే దాని విలువను ప్రశ్నించడానికి వీలు లేదని వాదిస్తారు. అందుచేతనే తమ విశ్వాసానికి సనాతనం అన్న పదాన్ని చేర్చి గట్టిగా సమర్ధిస్తారు.

ఈ సాంప్రదాయాన్ని వ్యతిరేకించేవారు కూడా సనాతనం అన్న పదాన్ని వాడతారు. వైదిక సాంప్రదాయాన్ని విమర్శించడానికి ఆ పదాన్ని ఉపయోగిస్తారు. హిందూ మత పరిధిలోకి వచ్చే అన్ని రకాల శాఖలనూ వ్యతిరేకించడం వాళ్ళ లక్ష్యం కాదు. కాని వాళ్ళు సనాతనం అన్న పదాన్ని ప్రత్యేకంగా ఉపయోగించడానికి కారణం దాని వలన తమ వాదనకు ప్రాచీనత ఉంది అని చెప్పవచ్చు. తద్వారా సాధికారతను కలిగి వున్నట్టు చెప్పవచ్చు. అంతేకాక సనాతనధర్మం పేరుతో రుద్దుతున్న ఆచారాలను, సాంప్రదాయాలను వ్యతిరేకించవచ్చు. చాలా ప్రాచీన వేదాంత వ్యవస్థలు ఇదివరకెప్పుడో వైదిక పరిధిలోకి వచ్చేశాయి. కర్మకాండల సుడిగుండంలో పడిపోయి వేదాంతం తాలూకు తాత్వికతను విడిచి పెట్టేశాయి. ఐతే 18వ శతాబ్దంలో రామకృష్ణ పరమహంస, వివేకానందుడు, నారాయణగురు, నటరాజ గురు తదితరుల ఆధ్వర్యంలో వేదాంత దర్శనం పునరుజ్జీవం పొందింది. సాంప్రదాయ హిందూ ఆచారవాదులు నిరంతరం, అతి తీవ్రంగా వేదాంత సాంప్రదాయం కిందకు రాని ఇతర సాంప్రదాయాలను వ్యతిరేకిస్తూనే వున్నారు. వేదాంత దర్శనంగా తొలుత మొదలైన వ్యవస్థ వైదిక ఆచారాలకు లొంగిపోయింది. కాని తక్కిన సాంప్రదాయాలు మాత్రం వేదాంత దర్శనంలోని మేధో దార్శనికతను ఆవిష్కరించడానికి ప్రయత్నించాయి. సనాతనవాదులు ఎంతో దూకుడుగా ముందుకు తెచ్చిన వైదిక కర్మకాండలకు, మూఢవిశ్వాసాలకు, ఛాందసత్వానికి, కుల ప్రాతిపదికన తెచ్చిన చీలికలకు, ముఖ్యంగా బ్రాహ్మణాధిపత్యానికి ఎదురు నిలిచి వ్యవహరించడంలో ఈ దార్శనికత ఉపయోగపడింది. నేటికీ ఈ విషయాల్లో రాజీ పడడానికి ఆ తక్కిన సాంప్రదాయాలేవీ సిద్ధంగా లేవు.

హిందూయిజంలో నయా వేదాంతులు మాత్రమే మొదటి నుంచీ నికరమైన వైఖరితో ఉన్నారు. (అ) మన శ్రుతులలో (తొలినాటి ధర్మశాస్త్రాలు, వేదాలు– వినికిడి ద్వారా మాత్రమే ఒకరినుండి మరొకరు నేర్చుకున్నవి) ఎక్కడా కులం, తెగ ప్రస్తావనలు లేవు. (ఆ) కులం పేరుతో అమలు జరిపిన వివక్షతలన్నీ సాంప్రదాయం పేర రుద్దినవే తప్ప అవి మౌలికంగా హిందూ ఆచారాలు కావు. (ఇ) హిందూ సద్ జ్ఞాన సాంప్రదాయం కాలాలు మారినా, నేటికీ వర్తిస్తుంది. –ఇదీ నయా వేదాంతుల వైఖరి. వైదిక సాంప్రదాయ వాదులు, లేదా సనాతనులు చాదస్తపు కర్మకాండలనే అత్యంత ప్రధానంగా పరిగణించారు. అందుచేత వాళ్ళు ఈ నయా వేదాంతుల వైఖరిని ఏనాడూ అంగీకరించలేదు. పైగా ఎదురుదాడి చేశారు. సనాతన సంప్రదాయానికి పెరుగుతున్న వ్యతిరేకతను గమనించిన కొందరు హిందూయిజం సారాంశం సద్ జ్ఞాన సాంప్రదాయంలో ఉంది తప్ప కర్మకాండల్లో లేదని, కాలం చెల్లిన ఆ కర్మకాండలను, ఆచారాలను కట్టుబాట్లను బట్టి మన సద్

జ్ఞాన సాంప్రదాయాన్ని నిందించకూడదని అంటున్నారు. ఆ కర్మకాండలు, కట్టుబాట్లు, ఆచారాలు కాలంతోబాటు మారిపోతున్నాయని అంటున్నారు. మరి ఈ వ్యాఖ్యానంతో సనాతనవాదులు, వైదిక సాంప్రదాయ వాదులు ఎంతవరకు ఏకీభవిస్తారో చూడాలి.

సనాతన వైదిక సాంప్రదాయాన్ని పట్టువదలకుండా ప్రతిఘటించడం, వారి వైఖరిని గట్టిగా విమర్శించడం భారతీయ మేధోరంగానికి, హిందూ తాత్విక రంగానికి చాలా అవసరం అని నేను ఎప్పటి నుంచో గట్టిగా భావిస్తున్నాను. దానికి కారణం సనాతన సాంప్రదాయం మూర్ఖంగా కర్మకాండలకి, క్రతువులకి, ఆచారాలకి కట్టుబడివుంది. వాటికోసమే ఉంది. ఆ ఆచారాలు ఎంత అమానవీయమైనా, వాటి ప్రాచీనతకే అది కట్టుబడి, వాటిని యథాతథంగా కొనసాగించాలని భావిస్తోంది.

ఆదిమ తెగల కాలం నాటి పూర్వీకుల దృక్పధాన్ని, జీవనశైలిని అన్ని విధాలా యథాతథంగా కొనసాగించాల్సిందేనని సనాతన, వైదిక సాంప్రదాయవాదులు వాదిస్తారు. తరతరాలుగా అవి కొనసాగి మనకు అందించబడ్డాయి గనుక వాటిని మనమూ కొనసాగించాల్సిందేనంటారు. అప్పటి జీవనశైలి ఇప్పుడు ఉనికిలో లేదన్న విషయాన్ని ఒప్పుకోవడానికి మొండిగా నిరాకరిస్తారు. ఆధునిక సమాజపు విలువలకు ఆ నాటి దృక్పథానికి పొంతన కుదరదని, దానినే కొనసాగిస్తే అది అన్యాయం ఔతుందని వారే నాటికీ గుర్తించరు. గతంలోనే ఉండిపోయి ఎదుగూ బొదుగూ లేకుండావుండే సంకుచిత వైఖరి ఇది. ఆ దృక్పధమే గనుక పైచేయి సాధిస్తే ఆధ్యాత్మికంగా, తాత్వికంగా హిందూ సద్ జ్ఞాన సాంప్రదాయం కాలాలు మారినా, నేటికీ వర్ధిస్తుంది. –ఇదీ నయా వేదాంతుల వైఖరి.

వైదిక సాంప్రదాయ వాదులు, లేదా సనాతనులు చాదస్తపు కర్మకాండలనే అత్యంత ప్రధానంగా పరిగణించారు. అందుచేత వాళ్ళు ఈ నయా వేదాంతుల వైఖరిని ఏనాడూ అంగీకరించలేదు. పైగా ఎదురుదాడి చేశారు. పురోగతి అనేదే ఉండదు. సమాజం అంధకారమయం అవుతుంది. సామాజిక అణచివేత, మానవ శ్రమ దోపిడీ విచ్చలవిడిగా సాగుతాయి. ఆర్థిక వ్యవస్థ కుప్పకూలుతుంది.

ప్రాచీన మత సాంప్రదాయాలన్నీ మనల్ని అంధకారంలోకి నెట్టి ఎదుగూ బొదుగూ లేకుండా అణచి వుంచుతాయి. మానవత్వానికి అవి పూర్తి వ్యతిరేకం. ఆ పద్ధతులను అనుసరించిన ఏ దేశమూ ఎప్పుడూ బాగుపడలేదు. ఇప్పుడు మన కళ్ళముందు కూడా అదే కనపడుతోంది. నేను సనాతనుల పక్షాన లేను. కాని సనాతన సాంప్రదాయాన్ని నేను నా ప్రత్యర్థిగానే పరిగణిస్తాను తప్ప శత్రువుగా కాదు. నేను వేదాలను తిరస్కరించను. వాటిలో ఉన్న మేధోపరమైన జ్ఞానాన్ని గుర్తించి తదనుగుణంగా వాటిపట్ల వైఖరి తీసుకుంటాను. అందుచేత నేను మూడో తరహాకు చెందుతాను. అదే వేదాంతుల శాఖ. వైదిక మూలాల్లో అనాదికాలం నాటి లోతైన ఆధ్యాత్మిక అనుభవాలు ఇమిడి వున్నాయి. మానవజాతికి అవి చాలా విలువైన వారసత్వంగా ఉంటాయి. వాటి నుండి నేను నేర్చుకోడానికి ప్రయత్నిస్తాను. అదే సమయంలో వేదాలతో ముడిపడిన ఛాందసత్వాన్ని, కర్మకాండలను నేను తిరస్కరిస్తాను.

నారాయణగురు సాంప్రదాయాన్ని అనుసరించే నిత్య చైతన్య యతికి నేను అనుయాయుడిని. ఈ తాత్విక శాఖకు చెందిన గ్రంథాలను పైపైన చూసినా, అది అత్యంత అభ్యుదయశీలమని, అది ఒక బలమైన ధోరణిగా ఉందని కనిపిస్తుంది. నేను తీసుకున్న వైఖరిని ఛాందసవాదులు, సాంప్రదాయ వాదులు తీవ్రంగా విమర్శిస్తారని, అభ్యంతరాలు వ్యక్తం చేస్తారని నాకు తెలుసు. వారిని నేను అర్ధం చేసుకోగలను. అటువంటి తాత్విక ధోరణి ఒకటి ఎప్పుడూ కొనసాగుతూనే వుంటుంది. హిందూ సాంప్రదాయంలో స్థిరంగా, మార్పు లేకుండా ఉండే ధోరణికి వాళ్ళు ప్రతినిధులు. ఎటువంటి మార్పునైనా సరే వాళ్ళు వ్యతిరేకిస్తారు. యథాతథ స్థితి అలాగే కొనసాగాలని వారు కోరుకుంటారు. వాళ్ళ ప్రయత్నాలవల్ల మన సాంప్రదాయంలోని కొన్ని అవశ్యమైన అంశాలు అంతరించిపోకుండా కొనసాగుతున్నాయి.

హిందూ సజ్ఞాన సాంప్రదాయానికి మూలంగా ఉండే ఆధ్యాత్మిక భావజాలం అన్ని రకాల ప్రతికూలతలనూ తట్టుకుని నిలిచిందంటే అది సనాతనవాదుల మొండి పట్టుదల, మార్పును వ్యతిరేకించే స్వభావం వల్లనే. ప్రతీ పరిణామంలోనూ రెండు పరస్పర వ్యతిరేక శక్తులు ఉంటాయి. ఒకటి చలనరహితం, ఇంకొకటి చలనశీలం. చలనరహితమైన శక్తి లేకపోతే ఆ పరిణామానికి నిలకడ లేకుండా పోతుంది. అప్పుడది అదుపు తప్పి అంతిమంగా అంతరించిపోతుంది. ఆ చలనరహితమైన శక్తిదే పైచేయి అయితే, అప్పుడు ఆ పరిణామం ఎదుగూ బొదుగూ లేకుండా పోతుంది. అప్పుడది శిథిలమౌతుంది.

అందుచేత పరిణామ క్రమం పురోగమించాలంటే చలన రహిత పార్శ్వం మీద చలనశీలమైన పార్శ్వం ఆధిపత్యం సాధించాలి. హిందూ సాంప్రదాయం వరకూ చూస్తే నయా-వేదాంతం ఆ చలనశీలమైన పాత్ర పోషిస్తుంది. వేదాలను తిరస్కరించే రెండో పార్శ్వం ఉంది. వారి వైఖరిని నేను పూర్తిగా ప్రశంసిస్తాను. భారతీయ తాత్విక సంవాద క్రమంలో వారి దృక్పథం శాశ్వతంగా విడదీయలేని అంతర్భాగంగా ఉంటుంది. వారి వాదన అలా ప్రతిధ్వనిస్తూనేవుండాలి. ఆ వాదన గొంతు మూగబోతే అప్పుడు హిందూసాంప్రదాయం కేవలం కర్మకాండల వ్యవహారంగా దిగజారిపోతుంది. దాని నైతిక పురోగమనం ఆగిపోతుంది. అప్పుడది ఎదుగూ బొదుగూ లేని స్థితికి చేరి అంతరించిపోతుంది.

**వేద ప్రమాణాన్ని తిరస్కరించే బలమైన ధోరణులు వేద కాలం నుండే ఉన్నాయి. ఈ విషయాన్ని ఆ వేదాలలోనే ప్రస్తావించారు. బృహస్పతి సాంప్రదాయం అగ్నికి ఆహుతి ఇచ్చే క్రతువులను, బలులను వ్యతిరేకించిన జైనం, కణాదుడు, అజిత కేశ కంబళి వంటివారు వైదిక సాంప్రదాయాలను విమర్శించిన సంగతులు వేదాలలో ప్రస్తావించబడ్డాయి. మహాభారతంలో కూడా వేద వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నాయి. దాయాదుల నడుమ యుద్ధం ముగిసిన తర్వాత యుధిష్ఠిరుడు సింహాసనం అధిష్ఠించిన సందర్భంలో చార్వాకుడు అక్కడికి వచ్చి ఆ విజయాన్ని నిరసిస్తూ మాట్లాడతాడు. జైనం, బౌద్ధం కూడా వేద ప్రమాణాన్ని బలంగా వ్యతిరేకించాయి. ఆ మతాలు, వాటి అభ్యంతరాలు నేటికీ ఉనికిలో ఉన్నాయి. శైవం లోని వివిధ శాఖల్లో కూడా తీవ్రమైన వైదిక వ్యతిరేక భావజాలం కనిపిస్తుంది.**

ఎం.ఎన్.రాయ్, దేవీప్రసాద్ చట్టోపాధ్యాయ, కె.దామోదరన్ వంటి పండితులు ఈవిషయాలపై చాలా విస్తృతంగా రచించారు. భారతదేశంలో సాంస్కృతిక వికాస ఉద్యమాలు జరిగిన సందర్భాలలో, ఆంగ్ల విద్యను అభ్యసించే అవకాశాలు వచ్చిన నేపథ్యంలో వైదిక వ్యతిరేక సిద్ధాంతాలు తిరిగి ముందుకొచ్చాయి. సంస్కరణవాదం, ఉదారవాదం, మార్క్సిజం వంటి రూపాల్లో ఇవి వ్యక్తం అయాయి. జవహర్‌లాల్ నెహ్రూ, రామ్ మనోహర్ లోహియా, బి.ఆర్. అంబేద్కర్, కె.దామోదరన్ ఇ.ఎం.ఎస్. నంబూద్రిపాద్ వంటి మేధావులు ఈ కొత్త భావజాలానికి ప్రతిరూపాలుగా నిలిచారు. ఒక సాంఘిక సంస్కర్తగా ఇ.వి. రామస్వామి నాయకర్ కూడా ఈ జాబితాలో ఉన్నారు. వారు వేదాలను సంపూర్ణంగా తిరస్కరించారు. దానికి సామాజిక, తాత్విక ప్రాతిపదికలు రెండూ ఉన్నాయి. మూర్ఖపు ఛాందసత్వంతో ముడిపడినందు వలన వైదిక సాంప్రదాయం మానవత్వాన్ని కోల్పోయిన ఒక వ్యవస్థగా, సాటి మానవులను జంతువులకన్నా హీనంగా చూసేదిగా దిగజారినందు వలన సామాజిక కోణం నుండి దానిని తిరస్కరించారు. ఈ సిద్ధాంతం కారణంగా శతాబ్దాల తరబడి అణచివేతకు, బానిసత్వానికి గురైన తరగతుల ప్రజానీకానికి ఈ వైదిక సాంప్రదాయాన్ని మొత్తంగానే తిరస్కరించేందుకు అన్ని హక్కులూ ఉన్నాయి.

తాత్వికంగా చూసినప్పుడు మొండిగా ధర్మసూత్రాలను పట్టుకుని వేలాడడం అంటే ప్రతీ కొత్త దృక్పథాన్నీ తిరస్కరించడమే ఔతుంది. అటువంటి ధోరణి సహజంగానే ఉదారవాదానికి, ప్రజాస్వామ్య భావాలకి విరుద్ధం.అందుచేత నెహ్రూ గానీ, లోహియా గానీ వైదిక సాంప్రదాయాన్ని తోసిపుచ్చారు.

నారాయణ గురు ప్రధాన శిష్యుడైన సహోదరన్ అయ్యప్పన్ వైదిక సాంప్రదాయ వ్యతిరేక ధోరణికి చెందినవాడు. నవ కేరళలో మొదటి సాంప్రదాయ వ్యతిరేకి, నాస్తికుడు అతడే. అతడి సమకాలీకుడు, నారాయణ గురు సన్నిహిత శిష్యులలో ఒకడు అయిన సి.వి.కున్హిరామన్ రచయిత, సంస్కర్త. అతడు కూడా బలమైన వైదిక వ్యతిరేక ధోరణి తోనే ఉండేవాడు. చరిత్ర ఇంకా లిఖిత పూర్వకంగా రాయని ప్రాచీన కాలంలోనే వైదిక సాంప్రదాయం తమిళనాడులో ఉండినట్టు పురానానూరు వంటి కొన్ని ప్రాచీన తమిళ గ్రంథాలలో ఆధారాలు ఉన్నాయి. వాటిలోనే ఆనాటికి సమాజంలో వైదిక సంప్రదాయం పట్ల ఉన్న వ్యతిరేక భావాల ప్రస్తావన కూడా ఉంది.

సంగం సంస్కృతి ఉన్న కాలంలో అప్పటి కొన్ని పాటలు వైదిక బ్రాహ్మణులను హేళనచేస్తూ పాడినవి ఉన్నాయి. వేలపార్పార్ అనే ఒక బ్రాహ్మణుల బృందం యజ్ఞాలను వ్యతిరేకిస్తున్నట్టు శిలప్పాదికారం అనే పురాణగ్రంథంలో కవి ఇలాంగో పేర్కొన్నాడు. ఆనందంగా జీవించడమే తమ విధానంగా ప్రకటిస్తూ ఆ బృందం సంగీతం, మద్యపానం వంటి కార్య కలాపాల్లో ఉండేవారని తెలిపాడు. మణిమేఖలై అనే తమిళ పురాణంలో ఆ నాటికి తమిళనాట ఉన్న వివిధ తాత్విక దర్శనాల గురించి ప్రస్తావనలున్నాయి. వాటిలో చాలా భాగం వైదిక సాంప్రదాయానికి వ్యతిరేకంగా ఉన్నవే.

క్రీ.శ. 7వ శతాబ్దం వరకూ తమిళనాడులో జైనం, బౌద్ధం ప్రధాన మతాలుగా ఉండేవి. ఈ రెండూ వేదాలను పూర్తిగా తిరస్కరించాయి. తమిళ ఆదర్శాలకి, నైతిక విలువలకి చిహ్నంగా పరిగణించే తిరువళ్ళువార్ జైనుడని, ఆచార్య కుంత అనే జైన సన్యాసి శిష్యుడని తమిళనాడులో లభిస్తున్న అత్యంత ప్రాచీన ఆధారాలు వెల్లడిస్తున్నాయి. శైవ, వైష్ణవ రుషులు ప్రారంభించిన భక్తి ఉద్యమం తమిళనాడులో 7వ శతాబ్దం నుంచీ వికసించింది. ఆ తర్వాత దేశమంతటికీ వ్యాపించింది. ఆ ఉద్యమం వేదాలను అంత తీవ్రంగా వ్యతిరేకించలేదు. ఒక ఆధ్యాత్మిక అగ్రస్థానంలో వేదాలు ఉన్నట్లు అవి అంగీకరించాయి. ఐతే స్థానం మర్యాదపూర్వకంగా ఇచ్చినది మాత్రమే. ఉదాహరణకి, శైవ భక్తి ఉద్యమం శివుడిని వేదముదల్వన్ (వేదాలకు మూలం) అని ప్రశంసించింది. ఐతే, యజ్ఞాలు తదితర వైదిక ఆచారాలను అది బేషరతుగా ఆమోదించలేదు. యజ్ఞాలకు బదులు దేవాలయాల్లో పూజలను, దైవ భక్తిని ఆచరించాయి. ఈ పద్ధతులు వైదిక సాంప్రదాయానికి చెందినవి కావు.

భక్తి ఉద్యమం పైచేయి సాధిస్తున్న కొద్దీ వైదిక సాంప్రదాయం

క్రమంగా ఆ ప్రజాదరణ పొందిన పద్ధతులను తనవిగా స్వీకరించి ఇముడ్చుకుంది. ఆ క్రమంలోనే అది బౌద్ధాన్ని, జైనాన్ని పక్కకు తప్పించి తాను ప్రధాన స్రవంతిలోకి రాగలిగింది. వైదిక సాంప్రదాయంతో ముడిపడిన కర్మ కాండలను, విశ్వాసాలను భక్తి ఉద్యమం పదే పదే కొట్టిపారేస్తూ వచ్చింది. నిజమైన భక్తుడు అయినవాడు ఆ ఉద్యమానికి కేంద్రం. సాధారణంగా ఒక పేద రైతు గానీ, ఒకవేటగాడు గానీ ఆ కేంద్ర స్థానంలో ఉండేవాడు. గాఢమైన భక్తితో, ఆరాధనతో అటువంటివాళ్ళు ఏ దైవ సాక్షాత్కారం పొందగలిగేవారు. వేద మంత్రాలు వల్లిస్తూ, యజ్ఞాలు నిర్వహిస్తూ ఉండే బ్రాహ్మణులకు ఆ దైవం అందేవాడు కాదు. భక్తి ఉద్యమంలో అగ్రభాగాన ఉండిన చాలా మంది రుషులు, బ్రాహ్మణులు కానేకారు. వారిలో అత్యధికులు సమాజంలో అణగారిన తరగతులనుండి వచ్చినవారే.

**నందనార్ గాథ ఒక మంచి ఉదాహరణ. ఆ దళిత భక్తుడికి చిదంబరంలోని శివాలయంలోకి ప్రవేశం నిషేధించారు. కాని దేవాలయం వెలుపలి నుండే నందనార్ శివుడిని దర్శించడానికి వీలు కల్పిస్తూ అడ్డంగా ఉన్న నంది విగ్రహం పక్కకు తొలిగిందని ఆ గాథ చెప్తుంది. భక్తి ఉద్యమం ప్రధానంగా శూద్రులు, దళితులతో నడిచింది. ఆ తరగతుల ప్రజలకు యజ్ఞాలు నిర్వహించడమే గాక చూడడం కూడా నిషేధించింది వైదిక సాంప్రదాయం. భక్తి ఉద్యమంలో అత్యధికులు శ్రమజీవులు గనుక ఆ ఉద్యమాన్ని శ్రమణక సాంప్రదాయం అని పిలిచేవారు. భక్తి ఉద్యమం కుల కట్టుబాట్లను, కర్మకాండలను తిరస్కరించింది. వాటికి బదులు పవిత్రమైన భక్తితో ఆరాధించాలని చెప్పింది.**

వైష్ణవ సాంప్రదాయాన్ని నెలకొల్పడంలో కీలక పాత్ర పోషించిన రామానుజాచార్యుడు వేద ప్రమాణాన్ని ఆమోదించినప్పటికీ, వైష్ణవ సాంప్రదాయం వైపు దళిత ప్రజలను తీసుకువచ్చి వారికి తిరుకులత్తర్ (గౌరవప్రదమైన పుట్టుక కలవారు) అని పేరు పెట్టాడు. అందుచేత తమిళ భక్తి ఉద్యమం వైదిక సాంప్రదాయాన్ని తిరస్కరించిన బలమైన పునాదుల మీద రూపొందిందని చెప్పవచ్చు. తమిళ శైవ సాంప్రదాయం సంక్లిష్టమూ, బహుళ దొంతరలతో కూడినదీ. అందులో 12 ప్రధాన శాఖలున్నాయి. వీటిలో చాలా శాఖలు వేద ప్రమాణాన్ని సవాలు చేశాయి. శైవ సిద్ధాంతంలో వేదాలను పవిత్రమైనవిగానే పరిగణిస్తారు తప్ప వాటిని మూలాలుగా కానీ, విధిగా ఆచరించవలసిన సూత్రాలుగా కానీ అంగీకరించరు. శివ జ్ఞాన బోధం వంటి తాత్విక గ్రంథాల నుండి రూపొందించిన విధానాలను, శైవ ఆగమాలను ప్రమాణాలుగా పరిగణిస్తారు. వైదిక సాంప్రదాయం శూద్రులను రుషిత్వానికి అనర్హులుగా ప్రకటించింది. కాని శైవ సంప్రదాయంలో ప్రధాన రుషులంతా శూద్ర కులాల నుండి వచ్చినవారే. తమిళనాడులో ప్రధానమైన మతం భక్తి ఉద్యమం ఆధారంగా వచ్చినదే. సనాతన, వైదిక ధర్మం అనేది స్వల్ప పాత్రనే పోషించింది. మహా అయితే పరోక్షంగా కొంత ప్రభావాన్ని కలిగించిందేమో. రాష్ట్రంలోని సామాన్య ప్రజానీకానికి సనాతన, వైదిక సాంప్రదాయంతో ఏ నిమిత్తమూ లేనే లేదు. దేశవ్యాప్తంగా చూసినప్పుడు హిందూయిజం నడక ప్రత్యేకంగా ఉంటుంది. అది మూడు స్థాయిలలో కొనసాగుతుంది. అగ్రభాగాన రూప, గుణ రహితుడైన పరబ్రహ్మ ఉంటాడు. మధ్య దొంతరలో ప్రజల్లో ప్రాచుర్యం పొందిన శైవ, వైష్ణవ మతాలు ఉంటాయి. ఆ దిగువన స్థానిక దేవతలు, ఆయా కుటుంబాల దేవతలు ఉంటారు. ఈ స్థానిక దేవతలు, కుటుంబ దేవతలు అంతా వైదిక సాంప్రదాయానికి దూరంగానే ఉంటారు. ఆ దేవతలలో ఎక్కువ భాగం నిస్సందేహంగా వైదిక సాంప్రదాయ వ్యతిరేకంగానే ఉంటారు.

తమిళనాడులో వైదిక సాంప్రదాయ వ్యతిరేకులు వైదిక సాంప్రదాయాన్ని అనుసరించే వారితో కనీసం సమానమైన బలం కలిగి వుంటారు. వైదిక మతాన్ని వ్యతిరేకించే వారంతా దానిని సనాతన ధర్మం అంటారు. అందుచేత సనాతన ధర్మాన్ని వ్యతిరేకిస్తున్నట్లు ఎవరైనా ప్రకటిస్తే దానిని ఆ నేపథ్యంలో చూడాలి. వైదిక సాంప్రదాయానికి వ్యతిరేకంగా దక్షిణాదిన గళమెత్తి నంత బలంగా ఉత్తరాదిన లేదు. వివేకానందుడితో మొదలైన నయా-వేదాంత ఉద్యమం ఉత్తరాదిన అంత బలంగా లేదు. భక్తి ఉద్యమం ముందుకు తెచ్చిన వైదిక మత వ్యతిరేకత అక్కడ కాలం గడిచినకొద్దీ బలహీనపడింది.

వైదిక మూఢ విశ్వాసాలకు వ్యతిరేకత వ్యక్తం అయిన సందర్భాలు ఉన్నా అవి ఒక నికరమైన బలాన్ని పొందలేదు. అందుచేత ఉత్తర భారతంలో హిందూయిజం అంటే కేవలం వైదిక సాంప్రదాయమే అన్న భావన స్థిరపడింది. అది ఒక తిరుగులేని విషయంగా అయిపోయింది. ఒక ఏక శిలా రూపమైన విశ్వాసంతో, ఒకే ఒక అధికారిక ధర్మసూత్రాల ప్రాతిపదికన నడిచే వ్యవస్థగా హిందూయిజం చిత్రించబడింది. ఆధిపత్య స్థానంలో ఉన్న సామాజిక శక్తులు, ఉనికిలో ఉన్న రాజకీయ శక్తులు ఒకదానికొకటి తోడై ఈ భ్రమలో జనాన్ని కొనసాగిస్తున్నాయి.

**ఉదాహరణకి అక్కడ కొందరు వ్యక్తుల్ని లక్ష్యంగా చేసుకుని వీధిలో వారిని చుట్టుముట్టి "జై శ్రీరామ్" అని అనమని బలవంతం చేస్తారు. దక్షిణాదిన ఒక శివభక్తుడిని అదే విధంగా గనుక వత్తిడి చేసినా, ప్రాణాలకే ముప్పు వచ్చినా అతడు ఆ వత్తిడికి తల వొగ్గడు. అంతమాత్రం చేత అతడు హిందువుగా ఏ విషయంలోనూ తక్కువ కాదు గదా. ఒక వేదాంత సాంప్రదాయ వాదిగా నేనూ ఆ విధంగా అనడానికి తిరస్కరిస్తాను. అలా తిరస్కరించినంత మాత్రాన నేను హిందువును కాకుండా పోను. ఐతే ఇప్పుడు పరిస్థితి ఎలా ఉన్నదంటే అలా తిరస్కరించి నందుకు నన్ను మూకగా చంపివేయవచ్చు. నిజానికి వివేకానందుడు గాని, నారాయణ గురు కాని, వల్లవార్ కాని ఇప్పుడు జీవించి వుంటే వారు కూడా ఈ విద్వేషమూకల చేతుల్లో చావును చవి చూడాల్సిందే.**

సనాతన ధర్మంతో హిందూయిజాన్ని కలగలిపి వేసి తాత్వికంగా గానీ, సామాజిక ఉద్యమం రూపంలో గానీ ఎవరైనా సనాతన, వైదిక సాంప్రదాయాన్ని వ్యతిరేకిస్తే దానిని హిందూ వ్యతిరేకతగా చిత్రించడం పనిగట్టుకుని కొందరు సాగిస్తున్న వక్రీకరణ. ఇది హిందూ సద్ జ్ఞాన సాంప్రదాయానికి దీర్ఘకాలంలో ఎనలేని హాని చేస్తుంది. అంతర్గతంగా కొనసాగే సంవాదాలను నిర్మూలిస్తుంది. మన సాంప్రదాయాలలో తీసుకు రావలసిన సంస్కరణల కోసం జరిగే కృషిని అడ్డుకుంటుంది. యావత్తు హిందూ ఆధ్యాత్మిక సాంప్రదాయాలనూ నిర్జీవంగా మార్చి సంకుచిత కర్మకాండల మధ్య, సాంప్రదాయాల మధ్య ఛాందసత్వం మధ్య పాతి పెట్టేస్తుంది. అంతిమంగా అది హిందూయిజానికి ఆత్మహత్యా సదృశమే ఔతుంది.

భారతదేశ నేపథ్యంలో ఈ ధోరణికి వ్యతిరేకత ఎక్కడ నుంచి వచ్చినా దానికి తగిన ప్రాధాన్యతనివ్వాలి. అది హైందవేతరుల నుండి వచ్చినా, ఉదారవాదుల నుండి వచ్చినా, మార్క్సిస్టుల నుండి వచ్చినా ముఖ్యమైనదే ఔతుంది.

హిందూయిజంలోని సంకుచిత శక్తులను నిలవరించి, వారి అమానవీయ ధోరణులను కట్టడి చేయడంలో దాని ఉపయోగం చాలా ఉంది. అందుచేత ఎవరి నిరసననైనా సరే, అణచివేయడాన్ని మనం వ్యతిరేకించాలి. ఏ అభిప్రాయాన్నీ అగౌరవంగా చూడకూడదు. దైవదూషణ ముద్ర వేయకూడదు. నా భావాలను వ్యతిరేకించే హక్కు సనాతనవాదులకు ఉన్నది. కాని వారు తమను వ్యతిరేకించే వారిని సంవాదం ద్వారా ఓడించాలే తప్ప భయ భ్రాంతులకు గురి చేసే ఎత్తుగడలతో, అమానవీయ దాడులతో కాదు. కొత్త దృక్పథాలు ఆవిష్కరించబడాలన్నా, కొత్త వాదనలు ముందుకు రావాలన్నా అందుకు అవసరమైన ఆరోగ్యకర వాతావరణం ఉండాలి. విద్యావంతులైన పండితులు, విజ్ఞాన ఖనులైన రుషులు హిందూయిజానికి మార్గదర్శకులుగా ఉండాలే తప్ప విద్వేషంతో రగిలిపోయే రాజకీయ నాయకులు కారాదు.

అధికార దాహంతో తపించిపోతున్న దారిదోపిడీ ముఠాలూ కావు. హిందూ మేధావులు, రుషులు మనకు అన్ని నదులూ సాగరంలో సంగమిస్తాయని నేర్పారు. ఆ పాఠాన్ని మనం మరిచిపోవద్దు. ❑

# కుల గణన : పది పాక్షిక సత్యాలు

**(12వ పేజీ తరువాయి)**

నిర్దేశాన్ని అమలుపరిచేందుకు సకల జీవన రంగాలలోని హిందూ అగ్రకులాల వారి ప్రత్యేక హక్కులు, సదుపాయాలను బహిర్గతపరచడం అత్యవసరం.

- (9)కులాలకు సంబంధించిన రాజకీయాలు పెచ్చరిల్లేందుకు, సామాజిక సంఘర్షణలు తీవ్రమయ్యేందుకు కులగణన దారితీస్తుంది. **ఇది కూడా పాక్షికంగా సత్యమే.** అధికారిక రికార్డులలో కుల అస్తిత్వాన్ని నమోదు చేయడమంటే దాన్ని మరింత దృఢపరచడమే. అయితే మనమంతా గమనించని వాస్తవం ఏమిటంటే ఈ దేశ జనాభాలో నాలుగింట మూడొ వంతు (75–80శాతం) మందికి సంబంధించిన కుల అస్తిత్వాలు ఇప్పటికే అధికారిక రికార్డుల్లో నమోదయి ఉన్నాయన్న వాస్తవాన్ని మనం విస్మరించడం. ఇప్పుడు వాటిని శాస్త్రీయంగా సేకరించి, మిగిలిన 25 శాతం మంది వివరాలు కూడా సేకరించాల్సిన అవసరం ఉంది.
- (10) ప్రతి పదేళ్లకు ఒకసారి జరిగే జనాభా లెక్కల సేకరణ లో కులాన్ని చేర్చడానికే కుల గణన పరిమితమవుతుంది. **పాక్షికంగా నిజమే.** కుల గణనపై సామాన్య ప్రజల అవగాహన అది. అయితే ఈ ప్రక్రియ ద్వారా కులాలవారీగా వారు వారు కలిగి ఉన్న ఆస్తుల, సదుపాయాల, వనరుల, అవకాశాల, ప్రాతినిధ్యాల వివరాలు సేకరించేందుకు సెన్సస్ సమగ్ర జాబితాకు కులం ప్రశ్నను ఇతర సమాచార సేకరణ సంబంధిత సర్వేలలో కూడా చేర్చవలసి ఉంటుంది. ❑

**(సెప్టెంబరు 6 ఆంధ్రజ్యోతి సౌజన్యంతో)**

# పెట్టుబడిదారులకు ద్రవ్య బదలాయింపులు



\- ప్రభాత్ పట్నాయక్

**ఈ మధ్య ప్రభుత్వాలు పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం మామూలైపోయింది. కార్పొరేట్ పన్నులను తగ్గించడం ద్వారా గాని, నేరుగా కాని ధనాన్ని బదలాయిస్తు న్నాయి. ఈ విధంగా చేయడం ద్వారా దేశ ఆర్థిక వ్యవస్థకు ఊపు తేవాలని భావిస్తున్నాయి ప్రభుత్వాలు. డొనాల్డ్ ట్రంప్ మొదటిసారి అధ్యక్షుడిగా ఉన్న కాలంలో ఇదే ఉద్దేశ్యంతో కార్పొరేట్ పన్ను తగ్గించాడు. ఇక్కడ మోడీ ప్రభుత్వం కూడా అదే ఉద్దేశ్యంతో భారీగా పన్ను రాయితీలను కార్పొరేట్లకు కట్టబెడుతోంది. ఐతే ఆర్థిక శాస్త్రంలో కనీసపు అవగాహన ఉన్నవారికి కూడా ఈ మాదిరి బదలాయింపుల వలన నయా ఉదారవాద వ్యవస్థలో ఆశించిన దానికి పూర్తి భిన్నంగా ఫలితాలు వస్తాయని తెలుసు.**

నయా ఉదారవాద వ్యవస్థలో ద్రవ్యలోటు జిడిపిలో ఒకానొక నిర్ణీత శాతానికి మించకుండా ఉండాలనే నిబంధన వర్తిస్తుంది. ప్రభుత్వాలు సాధారణంగా ఆ పరిమితికి లోబడే నడుచు కుంటాయి. అటువంటప్పుడు పెట్టుబడి దారులకు ద్రవ్యాన్ని బదలాయించడం అంటే ఇంకెక్కడో ప్రభుత్వం తన ఖర్చు తగ్గించు కోవలసి వస్తుంది. మామూలుగా ఇలా ఖర్చు తగ్గించుకోవలసి వచ్చినప్పుడు ఆ వేటు ప్రజా సంక్షేమ పద్దుల మీదే పడుతుంది. లేదా శ్రామిక ప్రజల నుండి అదనంగా పన్నుల రూపంలో రాబట్టవలసి వస్తుంది. పెట్టుబడిదారులకు రూ.100 బదలాయించడానికి కార్మికులకు ఇచ్చే సంక్షేమంలో రూ.100 కోత పెట్టారనుకుందాం. అప్పుడు ఆ మేరకు స్థూల డిమాండ్ తగ్గిపోతుంది. దాని పర్యవసానంగా ఉపాధి, ఉత్పత్తి కూడా తగ్గిపోతాయి. అంటే పెట్టుబడిదారులకు ధనాన్ని బదలాయించడం వలన ఆర్థిక వ్యవస్థ అదనంగా ఊపు అందుకునేది ఏమీ ఉండదు సరికదా, ఉన్న స్థాయి నుంచి ఇంకా ముడుచుకు పోతుంది. కార్మికుల మీద అదనపు పన్నుల భారాన్ని మోపినా ఇదే జరుగుతుంది. ఈ పరిణామం ఏ విధంగా జరుగుతుందో చూద్దాం. ఈ ఏడాదిలో ఎంత పెట్టుబడులు పెట్టాలన్నది ఇంతకు ముందే తీసుకున్న నిర్ణయాల ఆధారంగా జరుగుతుంది. పరిశ్రమల కోసం పెట్టే పెట్టుబడులు కార్యరూపం ధరించడానికి, ప్రాజెక్టులు పూర్తి అవడానికి ఎక్కువ సమయం పడుతుంది. ప్రభుత్వ రంగంలోనైనా లేక ప్రైవేటు రంగంలోనైనా సరే ఇది వర్తిస్తుంది. ఇప్పుడు ఆ పెట్టుబడులు పెట్టే వేగాన్ని పెంచి ఆర్థిక వ్యవస్థకు అదనపు ఊపు తేవాలనుకుంటే ఈ ఏడాది తీసుకున్న నిర్ణయం అమలు కావడానికి వచ్చే ఏడాది వరకూ సమయం పడుతుంది. ఆ తర్వాతే ఆ ఊపు పెరుగుతుంది. అదనపు పెట్టుబడి పెట్టాలన్న నిర్ణయంతో బాటు ఇప్పుడు ఎంత మోతాదులో పెట్టుబడి పెడుతున్నారో అది కూడా యథాతథంగా అదే స్థాయిలో కొనసాగాలి. ఐతే, ఈ లోపు ఈ ఏడాదిలో ఉత్పత్తి వినిమయం అయ్యే స్థాయిలో మార్పు వస్తుంది. సాధారణంగా కార్మికులు తమకు లభించే ఆదాయంలో అత్యధిక శాతం వెంటనే ఖర్చు చేసేస్తారు. పెట్టుబడిదారులు అలా కాదు. ఇప్పుడు కార్మికుల సంక్షేమానికి కోత పెట్టో లేక వారి మీద అదనంగా పన్నులు పెంచో ఆ సొమ్మును పెట్టుబడిదారులకు బదలాయిస్తే అప్పుడు వినిమయం స్థాయి తగ్గిపోతుంది. అంతే కాదు, పెట్టుబడిదారులు వినియోగించే సరుకులలో ఎక్కువ భాగం దిగుమతుల ద్వారా లభించేవే. వారికి అదనంగా ధనం బదలాయిస్తే అప్పుడు దిగుమతులు పెరుగుతాయి. వాటితో పోల్చినప్పుడు ఎగుమతుల నిష్పత్తి తగ్గిపోతుంది. ఐతే వాదన కోసం అలా జరగదని, పెట్టుబడిదారులకు అదనంగా ద్రవ్యం బదలాయించినా ఎగుమతి-దిగుమతి నిష్పత్తిలో ఏ మార్పూ ఉండదని అనుకుందాం.

దేశంలోని వినిమయం 'వి' అన్న అక్షరంతో సూచిద్దాం. అలాగే దేశంలో ఆ ఏడాది పెట్టిన పెట్టుబడిని 'పె' అన్న అక్షరంతోను, ప్రభుత్వ వ్యయాన్ని 'ప్ర' అన్న అక్షరంతోను, ఎగుమతుల విలువను 'ఎ' అన్న అక్షరంతోను, దిగుమతుల విలువను 'ది' అన్న అక్షరంతోను సూచిద్దాం. అప్పుడు దేశంలో మొత్తం స్థూల జాతీయ ఆదాయం ('ఆ' అనే అక్షరంతో సూచిద్దాం) లెక్కించాలంటే వినిమయం+పెట్టుబడి ం ప్రభుత్వ వ్యయంం (ఎగుమతుల విలువ-దిగుమతుల విలువ) అవుతుంది. దీనినే

ఆ = వి+పె+ప్ర+ (ఎ-ది) అని సూత్రంగా చెప్పవచ్చు.

ఇందులో 'వి' అన్నది (వినిమయం) తగ్గితే అప్పుడు 'ఆ' (స్థూల జాతీయ ఆదాయం) కూడా తగ్గిపోవడం అనివార్యంగా జరుగుతుంది. అది ఉత్పత్తిలో, ఉపాధిలో తగ్గుదల రూపంలో వ్యక్తం ఔతుంది. ఇది జరిగిందంటే ఆర్థిక వ్యవస్థలో ఇప్పుడున్న పరిశ్రమల స్థాపక సామర్థ్యాన్ని వినియోగించే స్థాయి తగ్గిపోతుంది. ఉన్న సామర్థ్యాన్నే పూర్తిగా వినియోగించలేనప్పుడు అదనంగా పెట్టుబడులు పెట్టడానికి కూడా ఎవరూ ముందుకు రారు. ఆ విధంగా ఆర్థిక వ్యవస్థ ఊపందుకోడానికి బదులు ముడుచుకుపోతుంది. ఐతే వ్యవహారం ఇక్కడితో ఆగిపోదు. ఆర్థిక వ్యవస్థ ముడుచుకు పోయినప్పుడు దాని ఫలితంగా లాభాలు తగ్గిపోతాయి. అంటే పెట్టుబడిదారులకు అదనంగా ద్రవ్యాన్ని బదిలీ చేయడం కోసం కార్మికుల కొనుగోలు శక్తికి కోత పెట్టడం వలన పెట్టుబడిదారులకు వచ్చే లాభాలు తగ్గిపోతాయి. పెట్టుబడిదారులకు అదనంగా బదలాయించిన ధనం ఎంత ఉంటుందో, దాదాపుగా అదే మోతాదులో వారి లాభాలు తగ్గిపోతాయి. అంటే నికరంగా వారి లాభాల స్థాయిలో ఏ మార్పూ ఉండదు. మన దేశంలో ఆర్థిక స్థాయిలో అట్టడుగున ఉన్న 50 శాతం ప్రజానీకం దగ్గర దేశ సంపదలో కేవలం 2 శాతం మాత్రమే ఉంది. వారు తమ ఆదాయాల్లో పొదుపు చేయగలిగినదంటూ ఏమీ ఉండదు. ఆదాయాన్ని మొత్తం ఖర్చు చేస్తారు. ఆర్థిక వ్యవస్థలో పొదుపు చేసే సంపద అంతా పైస్థాయిలో ఉన్నవారి ద్వారానే జరుగుతుంది.

సంపన్నులు-అంటే పెట్టుబడిదారులు వారి ఆదాయాన్ని మొత్తం పొదుపు చేస్తారనుకుందాం. వారి ఆదాయం అంటే వారికి వచ్చిన లాభాల మొత్తమే కదా. ఏ ఆర్థిక వ్యవస్థలోనైనా, మొత్తం దేశీయ పొదుపు లేదా పెట్టుబడిదారుల లాభం ఆ ఏడాది పెట్టిన ప్రైవేటు పెట్టుబడి + ఆ ఏడాది ద్రవ్య లోటుతో (ఇందులో నుంచి విదేశీ పొదుపును తీసెయ్యాలి) సమానంగా ఉంటుంది. ఆర్థిక వ్యవస్థలో వృద్ధి లేనప్పుడు ప్రైవేటు పెట్టుబడి పెరగదు. ద్రవ్య లోటును పెంచడానికి వీలు లేదు. విదేశీ పొదుపు కూడా ఆర్థిక వృద్ధి లేనప్పుడు పెరగదు. ఇవన్నీ స్థిరంగా ఉన్నప్పుడు పెట్టుబడిదారుల లాభాలు స్థిరంగానే ఉంటాయి తప్ప పెరగవు. అందుచేత పెట్టుబడి దారులకు బడ్జెట్ ద్వారా చేసే బదలాయింపులు పెట్టుబడిదారుల లాభాలను పెంచవు. ఆర్థిక వ్యవస్థ ఊపు అందుకోవడానికీ తోడ్పడవు. పైగా ఆర్థిక వ్యవస్థ మరింత ముడుచుకు పోవడానికే దారి తీస్తాయి. మరి అటువంటప్పుడు ప్రభుత్వం ఎందుకు ఈ బదలాయింపులకు పూనుకుంటోంది. ఇప్పుడు తెలుసుకుందాం. మొత్తం పెట్టుబడిదారుల లాభాలు ఏమీ మారవు అని తెలుసుకున్నాం. ఐతే, ఆ పెట్టుబడిదారుల్లో గుత్త పెట్టుబడిదారు లకు అనుకూలంగా లాభాల పంపిణీ జరగడానికే ప్రభుత్వం ఈ బదలాయింపులకు పూనుకుంటోంది. కార్మికుల ఆదాయాలను తగ్గించడం ద్వారా ఈ బదలాయింపులు జరుగుతున్నాయి. దాని వలన కార్మికుల కొనుగోలు శక్తి తగ్గిపోతుంది. ఆ కార్మికులు కొనుగోలు చేసే సరుకుల అమ్మకాలు తగ్గిపోతాయి. వాటిని ఉత్పత్తి చేసేవారిలో ఎక్కువ శాతం చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు ఉంటారు. వారి లాభాలు బాగా తగ్గిపోతాయి. ఇంకోవైపు ప్రభుత్వం చేసే ద్రవ్య బదలాయింపుల్లో ఎక్కువ శాతం గుత్త పెట్టుబడిదారులు. బడా కార్పొరేట్లు దక్కించుకుంటారు. వాటిలో చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులకు దక్కేది చాలా తక్కువ. అంటే ఈ మొత్తం ప్రక్రియలో చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు దెబ్బ తింటారు. గుత్త పెట్టుబడి దారులు, బడా కార్పొరేట్లు మరింత లాభపడతారు. ఈ ప్రక్రియనే మార్క్స్ "పెట్టుబడి కేంద్రీకరణ" అని అన్నాడు. ఈ విధమైన బదలాయింపుల వలన గుత్త పెట్టుబడిదారులు మరింత బలపడతారే తప్ప దేశ ఆర్థిక వ్యవస్థకు అదనంగా ఏ ఊపూ లభించదు. పెద్ద నోట్ల రద్దు చేసినప్పుడు, జిఎస్‌టి అమలులోకి వచ్చినప్పుడు ఆ చర్యల ఫలితంగా చిన్న, మధ్య స్థాయి పెట్టుబడిదారులు బాగా దెబ్బ తిన్నారని ప్రతిపక్షాలు, మీడియాలో ప్రధాన భాగం విమర్శించాయి. ఆ చర్యల పర్యవసానాలను వారు గుర్తించినట్టు ఈ ద్రవ్య బదలాయింపుల పర్యవసానాన్ని గుర్తించడం లేదు. ❑

# దేశ సరిహద్దులు దాటిన కులం

**(22వ పేజీ తరువాయి)**

ఏదేమైనా, మీరు ఈ విషయాన్ని కుల-అవగాహన దృక్పథం నుండి చూసిన తర్వాత కార్మికవర్గానికి, అట్టడుగు వర్గాలకు మరియు ఆధిపత్య కులాల ప్రజలకు మధ్య ఈ సంఘీభావం లేకపోవడం ఆశ్చర్యం కలిగించదు, పైగా కుల నిచ్చెన మెట్ల సమాజంలో వారి పాత్ర చాలా సహజంగా అనిపిస్తుంది. ఇస్లామోఫోబియా యొక్క సాధారణ ప్రయోజనాల వల్ల మితవాద పార్టీలలో ఈ ప్రవాస భారతీయుల ప్రాముఖ్యత పెరుగుతుంది. ప్రఖ్యాత సామాజిక కార్యకర్త డా ఆనంద్ తేల్తుంబ్డే తన రిపబ్లిక్ ఆఫ్ క్యాస్ట్ పుస్తకంలో భారతదేశంలో ముస్లింలు ప్రధానంగా పీడిత కులాల నుండి వచ్చినందున ఇస్లాం పట్ల ఆధిపత్య కులాలకు విరక్తి ఉంటుందని వివరించారు. అంతిమంగా, ఈ సవాళ్లను పరిష్కరించడం కోసం ప్రపంచ అవగాహన, అట్టడుగు వర్గాలలో సంఘీభావం, శ్రమ హక్కులను పరిరక్షించడానికి దక్షిణ ఆసియా లోపల మరియు వెలుపల కుల-ఆధారిత వివక్షను ఎదుర్కోవటానికి బలమైన చట్టపరమైన చర్యలకు డిమాండ్ చేయాలి. ❑

# జిల్లాల ఆర్థిక అసమానతలు, వెనుకబాటుతనం



- డా బి.గంగారావు,

**ఆంధ్ర రాష్ట్రంలో జిల్లాల పునర్విభజన అనంతరం తొలిసారిగా జిల్లాల వారీగా 26 జిల్లాల స్థూల ఉత్పత్తి గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసింది. ఈ వివరాల దృష్టాంతం జిల్లాల మధ్య అసమానతలు, వెనుకబాటుతనం, సంపద కేంద్రీకరణ అలాగే వ్యవసాయ, పారిశ్రామిక, సేవా రంగాల్లోను, వాటి ఉత్పత్తి విలువల్లో చోటు చేసుకుంటున్న ఆందోళనకర పరిణామాలు వాటి పర్యవసానంగా రాష్ట్ర ఆర్థిక రంగంలో ఎలాంటి మార్పులు జరుగుతున్నాయో తెలియజేస్తున్నాయి.**

డైరెక్టర్ ఆఫ్ ఎకనామిక్స్ అండ్ స్టాటిస్టిక్స్ ప్లానింగ్ డిపార్ట్‌మెంట్ విడుదల చేసిన గణాంకాల ప్రకారం 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.14.39 లక్షల కోట్లుగా రాష్ట్ర స్థూల ఉత్పత్తి (ఎస్ జిడిపి) నమోదయింది. ఇందులో వ్యవసాయ రంగం నుండి రూ.4.53 లక్షల కోట్లు, పారిశ్రామిక రంగం నుండి రూ.3.41 లక్షల కోట్లు, సేవా రంగం నుండి రూ.5.33 లక్షల కోట్లు ఆదాయం వచ్చిందని, అలాగే రాష్ట్ర తలసరి ఆదాయం రూ.24,2479గా వుందని తెలిపింది. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో విశాఖ జిల్లా రూ.1,19,268 కోట్లతో మొదటి స్థానంలో ఉంది. ఆ తరువాత ఎన్‌టిఆర్, కృష్ణా జిల్లాలు రెండు, మూడు స్థానాల్లోనూ, తిరుపతి, ఏలూరు జిల్లాలు నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. అట్టడుగు ఐదు స్థానాల్లో 22 నుండి 26 స్థానాలు అల్లూరి సీతారామరాజు, పార్వతీపురం మన్యం, విజయనగరం, అన్నమయ్య, నంద్యాల జిల్లాలు వరుసగా ఉన్నాయి. ఈ జిల్లాల మొత్తం స్థూల ఉత్పత్తి విశాఖ జిల్లా స్థూల ఉత్పత్తికి సమానంగా ఉంది. దీన్నిబట్టి అట్టడుగున ఉన్న జిల్లాల ఆర్థిక దుస్థితిని అర్థం చేసుకోవచ్చు. అడుగున ఉన్న ఐదు జిల్లాల్లో మూడు ఉత్తరాంధ్రలోను, రెండు రాయలసీమలో ఉన్నాయి. రాష్ట్ర సగటు స్థూల ఉత్పత్తి రూ.50,135 కోట్లుగా ఉంది. 13 జిల్లాలు వాటి స్థూల ఉత్పత్తి రాష్ట్ర సగటు కంటే దిగువ స్థాయిలో ఉన్నాయి. ఇందులో ఐదు జిల్లాలు రాయలసీమకి మరో నాలుగు ఉత్తరాంధ్రకి చెందినవి. జిల్లాల స్థూల ఉత్పత్తి విలువలను పరిశీలిస్తే జిల్లాల మధ్య తీవ్ర అసమానతలు కనిపిస్తున్నాయి. రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో విశాఖ జిల్లా వాటా 9.15 శాతం ఉంటే అట్టడుగున ఉన్న అల్లూరి జిల్లా 1.16 శాతం, మన్యం జిల్లా 1.17 శాతం వాటా కలిగి వున్నాయి. 2 నుండి 3 శాతం మధ్య విజయనగరం, అన్నమయ్య, నంద్యాల, బాపట్ల, శ్రీకాకుళం, కోనసీమ జిల్లాలు ఉంటే 3 నుండి 4 శాతం వాటా మధ్య 13 జిల్లాలు ఉన్నాయి. కేవలం ఏలూరు 5.13 శాతం, తిరుపతి 5.18 శాతం, కృష్ణా 5.24 శాతం, ఎన్‌టిఆర్ జిల్లా 5.65 శాతం వాటాతో కొంత మెరుగుదలలో ఉన్నాయి.

రాష్ట్ర తలసరి ఆదాయంతో జిల్లాల తలసరి ఆదాయాలను పోల్చి చూస్తే జిల్లాల మధ్య అసమానతలు ఇంకా ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తున్నది. విశాఖ జిల్లా రూ.4,83,892 తలసరి ఆదాయంతో రాష్ట్రంలో మొదటి స్థానంలో ఉంది. రెండో స్థానంలో కృష్ణా, మూడో స్థానంలో ఏలూరు, నాల్గో స్థానంలో ఎన్.టి.ఆర్, ఐదో స్థానంలో తిరుపతి జిల్లాలు వున్నాయి. దిగువ స్థాయిలో ఐదు స్థానాల్లో వరుసగా అల్లూరి, మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, నంద్యాల జిల్లాలు ఉన్నాయి. రాష్ట్ర తలసరి ఆదాయం పైభాగాన 9 జిల్లాలు ఉంటే, దిగువున 17 జిల్లాలు ఉన్నాయి. ఇందులో ఉత్తరాంధ్ర, రాయలసీమ జిల్లాలే కాకుండా కాకినాడ, కోనసీమ, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు జిల్లాలు కూడా వుండటం విశేషం. జిల్లాలకు సంబంధించిన స్థూల ఉత్పత్తులను, వాటికి చోదక శక్తులుగా వున్న రంగాల ఉత్పత్తులు, ఉత్పత్తి కేంద్రాలు లేదా మండలాలను పరిశీలిస్తే జిల్లాల మధ్య అసమానతలే కాకుండా జిల్లాలోనే వివిధ మండలాల మధ్య నెలకొన్న అంతరాలను కూడా గుర్తించొచ్చు. వ్యవసాయ రంగ ఉత్పత్తుల్లో రాష్ట్రంలో ఏలూరు, కృష్ణా, అనంతపురం, పశ్చిమ గోదావరి, నెల్లూరు జిల్లాలు వరుస ఐదు స్థానాల్లో ఉన్నాయి. ఇందులో కూడా ఆయా జిల్లాల స్థూల ఉత్పత్తిలో ఏలూరు జిల్లా 63.21 శాతం, కృష్ణా జిల్లా 47 శాతం, పశ్చిమ గోదావరి జిల్లా 44.57 శాతం వ్యవసాయం నుండి ఆదాయం వస్తున్నది. దీనికి ప్రధాన కారణం చేపలు, రొయ్యల సాగుబడి. ఉదాహరణకు 2022-23లో ఏలూరు జిల్లా స్థూల ఉత్పత్తి రూ.66834 కోట్లు. ఇందులో చేపలు, రొయ్యల ద్వారా రూ.20860 కోట్లు ఆదాయం వచ్చింది. మొత్తం జిల్లాలో 24 మండలాలు ఉంటే 11 మండలాల్లో చేపలు, రొయ్యల సాగు జరుగుతున్నది. ఇందులో కూడా కలిదిండి, ముదినేపల్లి, కైకలూరు, మండవల్లి మండలాలు

చేపలు, రొయ్యల ఉత్పత్తిలో అగ్రభాగాన ఉన్నాయి.

కృష్ణా జిల్లా స్థూల ఉత్పత్తి రూ.68301 కోట్లు ఉంటే ఇందులో చేపలు, రొయ్యల నుండి రూ.20860 కోట్లు వస్తున్నది. మొత్తం 25 మండలాల్లో కేవలం నందివాడ, మచిలీపట్నం, కృతివెన్ను, నాగాయలంక, బంటుమిల్లి మండలాల నుండే రొయ్యలు, చేపల నుండి అత్యధిక ఆదాయం వస్తున్నది. చేపలు, రొయ్యల ఉత్పత్తుల్లో మరో ముఖ్యమైన జిల్లా పశ్చిమగోదావరి. ఈ జిల్లాలో మొత్తం 20 మండలాలు ఉన్నాయి. ఈ జిల్లా స్థూల ఉత్పత్తి రూ 51,078 కోట్లు. ఇందులో 9 మండలాల నుండి చేపలు, రొయ్యల నుండి రూ.15,859 కోట్లు ఆదాయం వచ్చింది. ఈ జిల్లాలోను పెనుగొండ, ఆకివీడు, ఇరగవరం, యలమంచిలి, గణపవరం, భీమవరం మండలాలు అగ్రభాగంలో ఉన్నాయి. ఆ తరువాత ఉండి, ఆచంట, కాళ్ల మండలాలు ఉంటాయి.

అనంతపురం జిల్లా వ్యవసాయ ఉత్పత్తిలో ముఖ్యంగా ఆహార పంటలైన తృణధాన్యాలు, పప్పుల ఉత్పత్తిలో రాష్ట్రంలో అగ్ర శ్రేణిలో ఉంది. ఈ జిల్లా స్థూల ఉత్పత్తి రూ.63767 కోట్లు ఉంటే ఇందులో ఆహార పంటల నుండి రూ.19116 కోట్లు వస్తున్నది. నెల్లూరు జిల్లా ఆహార పంటలు, పశు పోషణ (పౌల్ట్రీ, పాలు, మాంసం), చేపలు, రొయ్యల మిశ్రమంగా ఉంది. మరో ముఖ్యమైన అంశం రొయ్యలు, చేపల ఉత్పత్తిలో ముఖ్యమైన పాత్ర పోషిస్తున్న ఏలూరు, కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల్లో మరో మార్పు చోటు చేసుకుంటున్నది. ఈ జిల్లాలు చేపలు, రొయ్యల తరువాత పశుపోషణ నుండి అత్యధిక ఆదాయం పొందుతున్నాయి. దీంతో ఈ జిల్లాల్లో ఆహార పంటల సాగు గణనీయంగా పడిపోతున్నది. రాష్ట్రంలో చాలా జిల్లాలో ఈ పరిణామం మనకు కన్పిస్తున్నది. ఈ మార్పు గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి అవకాశాలను దెబ్బతీస్తూ, భూ కేంద్రీకరణ పర్యావరణ సమస్యలను ముందుకు తెస్తున్నది.

జిల్లాల పారిశ్రామిక అభివృద్ధి పరిశీలిస్తే చాలా విచిత్ర పరిస్థితి కనిపిస్తున్నది. విశాఖపట్నం జిల్లా రాష్ట్రంలో పారిశ్రామికీకరణ లో అనేక దశాబ్దాల నుండి ముందు భాగంలో ఉంది. రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 20 శాతం వాటా కలిగి ఉంది. రెండో స్థానంలో తిరుపతి, మూడో స్థానంలో అనకాపల్లి, నాల్గో స్థానంలో ప్రకాశం, ఐదో స్థానంలో ఎన్‌టిఆర్, ఆరో స్థానంలో కాకినాడ జిల్లాలు ఉన్నాయి. ఈ ఆరు జిల్లాలే రాష్ట్ర పారిశ్రామిక ఉత్పత్తిలో సుమారు 50 శాతం వాటా కలిగి ఉంటే మరో 11 జిల్లాలు కేవలం 20 శాతం ప్రాతినిధ్యానికే పరిమితమయ్యాయి.

విశాఖ జిల్లా మినహా ఉత్తరాంధ్ర జిల్లాలతోపాటు రాయల సీమ జిల్లాలైన చిత్తూరు, అన్నమయ్య, నంద్యాల జిల్లాలతో పాటు మధ్య కోస్తాలోని బాపట్ల, ఏలూరు, పశ్చిమ గోదావరి, కృష్ణా, పల్నాడు జిల్లాలు పారిశ్రామికంగా బాగా వెనుకబడి ఉన్నాయి. పారిశ్రామిక ఉత్పత్తిలో ముందు వరుసలో ఉన్న జిల్లాలను పరిశీలిస్తే రెండో స్థానంలో ఉన్న తిరుపతి ప్రధానంగా శ్రీ సిటీ కేంద్రంగా ఉన్న పరిశ్రమలే కీలకం. మిగిలిన జిల్లాలో పారిశ్రామికీకరణ గుర్తించదగిన స్థాయిలో ఎక్కడా కనిపించదు. అలాగే అనకాపల్లి జిల్లాలో ఫార్మా, రసాయన పరిశ్రమల కేంద్రంగా పరవాడ, అచ్యుతాపురం, రాంబిల్లి, నక్కపల్లి మండలాలకే పరిమితమై ఉంది. జిల్లా స్థూల ఆదాయంలో సగ భాగం ఈ నాలుగు మండలాల పరిశ్రమల నుండే వస్తున్నది. ఈ రెండు జిల్లాలు రాష్ట్రంలో వస్తు తయారీకి ప్రధాన పారిశ్రామిక కేంద్రాలుగా ఉన్నాయి. ప్రకాశం జిల్లాలో చీమకుర్తి, సంతనూతలపాడు మండలాల్లో గ్రానైట్ మైనింగ్, మద్దిపాడులో ఉన్న పారిశ్రామిక గ్రోత్ సెంటర్, సింగరాయకొండలో రొయ్యల పరిశ్రమ ముఖ్యమైనవి. మొత్తం జిల్లా పారిశ్రామిక ఉత్పత్తిలో ఈ మూడు మండలాలలో ఉన్న గ్రానైట్, రొయ్యల పరిశ్రమలే 65 శాతం ఉత్పత్తి విలువ కలిగి ఉన్నాయి. ఎన్‌టిఆర్ జిల్లాలో నిర్మాణ రంగం కేంద్ర బిందువుగా ఉంది. వస్తు తయారీ రంగం నామమాత్రంగా ఉంది. సత్యసాయి, కాకినాడ, తూర్పు గోదావరి, గుంటూరు, కడప, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల్లో ఒక్కో జిల్లాలో ఒక్కో ప్రాంతంలో కొద్ది పరిమాణంలో కొన్ని పరిశ్రమలు నెలకొన్నాయి. ఈ కేంద్రాలు ఆ జిల్లాల ప్రజల జీవితాలను ప్రభావితం చేసేలా లేవు.

సేవా రంగంలో జిల్లా కేంద్రాలు ఆధారంగా పెద్ద నగరాల చుట్టూ ఆర్థిక కార్యకలాపాల కేంద్రీకరణ కొనసాగుతున్నది. ఎన్‌టిఆర్ జిల్లా 61.68 శాతం, గుంటూరు జిల్లా 57.63 శాతం, విశాఖపట్నం 49.68 శాతంతో ఆయా జిల్లా స్థూల ఉత్పత్తిలో భాగస్వామ్యం వహిస్తున్నాయి. అల్లూరి, మన్యం, బాపట్ల, అనకాపల్లి, అన్నమయ్య జిల్లాలు సేవా రంగంలో అట్టడుగున ఉన్నాయి. 15 జిల్లాలు వాటి జిల్లా స్థూల ఉత్పత్తిలో సేవా రంగం వాటా 35 శాతం లోపే ఉన్నాయి. రియల్ ఎస్టేట్, రవాణా, బ్యాంకింగ్, కార్యకలాపాలు సేవా రంగ విలువలో సగ భాగానికి ప్రాతినిధ్యం వహిస్తున్నాయి. ప్రజలకు వచ్చే ఆదాయాలను బట్టి ఈ రంగ విస్తరణ జరుగుతుంది. కానీ రాష్ట్ర విభజన అనంతరం రాష్ట్ర స్థూల ఉత్పత్తిలో సేవా రంగం వాటా 44.13 శాతం నుండి 40.16 శాతానికి క్షీణించింది. అత్యధిక జిల్లాల్లో ఇదే పరిస్థితి చోటుచేసుకున్నది. స్థూలంగా గడిచిన పదేళ్లల్లో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థల్లో వ్యవసాయ పారిశ్రామిక, సేవా రంగాలు తీవ్ర మార్పులకు గురయ్యాయి. కొన్ని జిల్లాల్లో వ్యవసాయ రంగంలో దాని అనుబంధ రంగాల ఉత్పత్తి గణనీయంగా పెరుగుతూ వస్తున్నది. ముఖ్యంగా పశుపోషణ (పౌల్ట్రి, పాలు, మాంసం), చేపలు, రొయ్యలు ఉత్పత్తి పెరుగుదల వల్ల వ్యవసాయ ఉత్పత్తి విలువ పెరుగుతున్నది. ఫలితంగా రాష్ట్ర జీడీపీలో 2014-15లో 30.39 శాతం వ్యవసాయ రంగం

**(మిగతా 35వ పేజీలో)**

# భారతీయ వితంతు వ్యవస్థ మీద చర్చకు దోహదం చేసే పుస్తకం

- వంగాల సంపత్‌రెడ్డి

**సమాజంలోని విషమ సమస్యలన్నీ ఒకదానికి ఒకటి ముడిపడి ఉంటాయి. అవిద్య, పేదరికం, అసమానతలు, అవకాశాల లేమి, అవగాహనా రాహిత్యం, వ్యసనాలు, దురలవాట్లు సమాజాన్ని నేరపూరితం చేయడమే కాక ఆ సమాజ అస్తిత్వాన్ని ప్రశ్నార్థకం చేస్తాయి. అలాంటి వాటిలో వితంతు సమస్య ఒకటి. సకల అసమానతలకు, అంటరానితనాలకు సూక్ష్మస్థాయి నిర్మాణ వ్యవస్థ కుటుంబం. దానిని నడిపించేది. పితృస్వామ్యం. స్త్రీల జీవితాల్లోని అనేక సంక్షోభాలకు సవాళ్లకు కారణం అది. స్త్రీల ఆలోచనలను, జీవితాలను ప్రతి క్షణం నియంత్రించడానికి పితృస్వామ్య వ్యవస్థ నిరంతరం ప్రయత్నం చేస్తుంది. దానికి అనేక రూపాలను నిర్మాణం చేస్తుంది. అలాంటి నిర్మాణమే వితంతు వ్యవస్థ. కుటుంబ వ్యవస్థ డొల్లతనానికి ప్రతీక వితంతు వ్యవస్థ. స్త్రీలపై అణిచివేతకు పరాకాష్టయే వితంతు వ్యవస్థ. ఎంత చెప్పినా తరగని దుఃఖం వితంతువులది.**



ఏ విధంగా ఆలోచించినా వారు అన్ని రకాలుగా సమాజం చేత తిరస్కృతులు, బహిష్కృతులు. అలాంటి వితంతు స్త్రీల జీవితం అంశంగా తీసుకొని అనిశెట్టి రజిత ప్రధాన సంపాదకత్వంలో 2023, డిసెంబర్ నెలలో "భారతదేశంలో వితంతు వ్యవస్థ – సామాజిక, సాహిత్య వ్యాసాలు – వ్యక్తిత్వాలు కథనాలు" అనే పుస్తకం వచ్చింది. కొమర్రాజు రామలక్ష్మి, చందనాల సుమిత్ర, తమ్మెర రాధిక సంపాదక వర్గం. ఈ పుస్తకం భారతదేశంలో వితంతు వ్యవస్థ స్వరూప స్వభావాలు, ప్రభావాలు సమాజంలో, సాహిత్యంలో, వ్యక్తిగత జీవితాలలో ఏమేరకు ఎలా ఉన్నాయో నిరూపించటానికి చేసినప్రయత్నం ఈ పుస్తకం. ఈ పుస్తకానికి కొల్లాపురం విమల, శీలా సుభద్రదేవి, కొండవీటి సత్యవతి ముందు మాటలు రాశారు. సామాజిక వ్యాసాలు(18), సాహిత్య వ్యాసాలు (20), వ్యక్తిత్వ వ్యాసాలు (7), కథనాలు(13) అనే నాలుగు విభాగాల కింద ఈ పుస్తకంలో వ్యాసాలు ఉన్నాయి. సామాజిక వ్యాసాలలో సామాజిక పరిణామక్రమంలో కాలానుగుణంగా వితంతు వ్యవస్థ ఎలా ఆవిర్భవించింది, ఎలా పెరిగింది, ఎలా తన ప్రభావాన్ని చూపి సమాజాన్ని చిన్నభిన్నం చేసిందో మనకు కనిపిస్తుంది. వితంతువు శీలం కోల్పోకుండా ఉండాలి. సాత్వికాహారం తినాలి. పరపురుషుని ఆలోచనలు మానివేయాలి. వితంతువు మంగళ సూత్రం తీసేయాలి. పూలు, గాజులకు దూరంగా ఉండాలి. తెల్ల చీరలు ధరించాలి. శుభకార్యాలకు వెళ్ళకూడదు. సింధూరం, కుంకుమ పెట్టుకోకూడదు, శిరోముండనం చేసుకోవాలి, ఇలా మనుధర్మం వితంతువులను నియంత్రించిన విధానం. ఇంకా చెప్పాలంటే భర్తతో సతీ సహగమనం చేయగలిగితే ఆ స్త్రీని ఒక దేవతగా పరిగణించింది. తండ్రి సంరక్షణలో, భర్త సంరక్షణలో, కొడుకు సంరక్షణలో బతకాలి తప్ప స్త్రీ స్వతంత్రంగా బతకకూడదని మనుధర్మం చెప్పిన మాటే ఆదర్శవంతంగా కనిపిస్తున్న ఈ కాలంలో వితంతు స్త్రీల జీవితాన్ని సామాజిక సాహిత్య అనుభవ కోణాల నుండి విశ్లేషించటానికి పూనుకొనటం ఒక రకంగా ధిక్కారమే. ఆ పని ఈ పుస్తకంలోని రచయితలు చేశారు.

వేద కాలం నుండి ఇప్పటివరకు స్త్రీల స్థితిగతుల్లో వచ్చిన మార్పులను చర్చిస్తూ వితంతు వ్యవస్థ పుట్టుక, పెరుగుదల, దాని ప్రభావం, ప్రస్తుత స్థితి ఎలా ఉన్నదో ఈ వ్యాసాలు ఒక అంచనా వేశాయి. సామాజిక పరిణామ క్రమంలో ఉత్పత్తి సంబంధాలు మారుతున్న, మారిన సందర్భాలలో పితృస్వామిక వ్యవస్థ దుర్మార్గ రూపంగా వితంతు వ్యవస్థ బలపడిన తీరును ఈ వ్యాసాలు చర్చించాయి. వితంతువుల జీవితాల్లో ఉన్న హింస, ఆశలు, ఆకాంక్షాలు, ఆలోచనలు, మానసిక సంఘర్షణలు అవమానాలు మొదలైన అంశాలను విశ్లేషించాయి. బాల్య వివాహాలు నిరోధించడానికి, వితంతు పునర్వివాహాల కోసం జరిగిన ప్రయత్నాలను, బాలికల విద్య కోసం జరిగిన కృషిని వివరించాయి. వితంతు సమస్యను చర్చించటం, పరిష్కారానికి సంస్కరణ ఉద్యమాలు నిర్మించటం మగవాళ్ళు ప్రారంభించినా

సంస్కరణోద్యమ కాలపు స్త్రీలు ఆ సమస్యను యెట్లా చూసారో, స్వీకరించారో బుర్ర బుచ్చి బంగారమ్మ, కొటికలపూడి సీతమ్మ, జూలూరి సీతమ్మ, మోసలికంట రాంబాయమ్మ, సుసర్ల లక్ష్మీ నర్సమాంబ, పులవర్త కమలావతీ దేవి వంటి అనేకమంది మహిళల కవిత్వం, కథలు, వ్యాసాలు, కథనాలు ఆధారంగా నిరూపించే వ్యాసం స్త్రీలు వితంతువుల పునర్వివాహ ఉద్యమానికి ఊతమిచ్చే భావజాల అభివృద్ధిలో భాగమైన తీరును వివరిస్తుంది. మారుతున్న కాలమాన పరిస్థితులను ధర్మశాస్త్రాలు విస్మరించలేవని, అనివార్య సామాజిక పరిణామాలను ధర్మ శాస్త్రాలకు అన్వయించడం సరికాదని, ప్రాచీన సాంప్రదాయాలను, కట్టుబాట్లను గుడ్డిగా సమర్ధించడం సరికాదని స్త్రీలు ప్రకటించారు. వితంతు స్త్రీల గౌరవకరమైన జీవనానికి విద్యకు ఉన్న సంబంధాన్ని గురించి వాళ్ళు మాట్లాడారు. సావిత్రి పత్రికా సంపాదకురాలు పులగుర్త లక్ష్మీనరసమాంబ వంటి ఒకరిద్దరు స్త్రీ పునర్వివాహాలను వ్యతిరేకించి వివాదాస్పదులైనారు. అయినా మారుతున్న సమాజానికి అనుగుణంగా మారాలన్న ఉద్దేశంతో చాలామంది వితంతు పునర్వివాహాలను సమర్ధించారు. కాకినాడ స్త్రీ సమాజం వంటి అనేక సంస్థలు వితంతువుల ఉద్ధరణ కోసం ప్రయత్నం చేశాయి. అప్పటి నుండి ఇప్పటి వరకు సామాజికంగా, సాంస్కృతికంగా చట్టపరంగా వితంతు స్త్రీలు ఎదుర్కొనే వివక్ష, పీడన, వాళ్లకు దొరుకుతున్న ఓదార్పు, భద్రత ఈ వ్యాసాలలో చర్చించబడ్డాయి.

వ్యక్తిత్వాలు అనే శీర్షిక కింది విభాగంలోని ఏడు వ్యాసాలూ అనాథ బాలికల కోసం, వితంతు స్త్రీల రక్షణ కోసం, వితంతు స్త్రీల పునర్వివాహం కోసం, బాలికల పాఠశాల కోసం, స్త్రీ విద్య కోసం నిరంతరం శ్రమించిన కేశవ దోండో కర్వే, జ్యోతిరావు పూలే, సావిత్రిబాయి పూలే, పండిత రమాబాయి సరస్వతి, వీరేశలింగం పంతులు, మోహినిగిరి, మాళవిక హెగ్డే చేసిన కృషిని విపులంగా విశ్లేషిస్తాయి. సంస్కరణ ఉద్యమ కారుల గురించిన ఈ వ్యాసాలు సామాజిక వ్యాసవిభాగంలో భాగంగానే భావించవచ్చు. తెలుగులోనూ, ఇతర భాషలనుండి తెలుగులోకి వచ్చిన భిన్న ప్రక్రియల సాహిత్య రచనలు వితంతు సమస్యను ఎన్ని కోణాల నుండి ఇతివృత్తంలో భాగం చేశాయో వివరించేవి సాహిత్య వ్యాసాలు. పితృస్వామిక భావజాలం ఉన్న సమాజంలో ఒక వితంతు మహిళ చేసుకున్న పునర్వివాహం తత్ఫలితాలను పరిణామాలను చిత్రించిన సంగమం నవల, వితంతువుగా ఒంటరితనం అనుభవించి మరణించిన సూరమ్మ కథ ఆధారంగా శతాబ్ది కాలంలో ఆంధ్రదేశంలో బ్రాహ్మణ స్త్రీల జీవితాలలో వచ్చిన పరిణామాలను, సామాజిక విభజన నుంచి బయటపడడానికి వారు చేసిన పోరాటాలను, వారి జీవితాలలో మార్పు రావడానికి కారణమైన సామాజిక పరిస్థితులను ఇతివృత్తంగా చేసుకొన్న శతాబ్ది సూరీడు నవల, వాసిరెడ్డి సీతాదేవి సమత, వైతరణి, తిరస్కృతి లాంటి నవలలు విశ్లేషించిన వ్యాసాలు ఇందులో ఉన్నాయి.

హరి నారాయణ ఆప్టే వ్రాసిన నవల ప్రణ్ లక్ష్యాత్ కోన్ ఘోత్ పేరుతో మరాఠీ లో వచ్చింది. దీనిని పీవీ నరసింహారావు దీని తెలుగులోకి అనువదించారు. 'అబలా జీవితం' నవలను సనాతన మధ్యతరగతి బ్రాహ్మణ కుటుంబానికి చెందిన యువతి ఆత్మకథగా ఎలా చూడవచ్చో విశ్లేషించిన వ్యాసం ప్రత్యేకమైనది. బ్రిటిష్ వలస పాలనలో భారతదేశంలోని పశ్చిమ బెంగాల్ బీహార్ బార్డర్ కథా నేపథ్యంగా వచ్చిన వాటర్ నవల గురించిన వ్యాసం చిన్నతనంలోనే పెళ్లిళ్లు జరిగి వితంతువులుగా మారి నరకయాతన అనుభవిస్తున్న బాలికల స్థితిగతులను మన ముందుకు తెచ్చి పరిచయం చేస్తుంది. ఇందిరా గోస్వామి బృందావనంలో వితంతువుల జీవన సతిగతుల మీద జరిపిన పరిశోధన గురించి, ఆ పరిశోధన ఆధారంగా వ్రాసిన కన్నయ్య వాడలో క్రీనీడలు నవల గురించి ఈ సంకలనంలోని రెండు వ్యాసాలు తెలియచేస్తాయి.

శీలా సుభద్ర దేవి రాసిన 'గోడలు', 'గుండెల్లో గాయాలు', 'ఎవరూ అభాగ్యులు కాదు' అనే మూడు కథలు, గంటి భానుమతి రాసిన రాయలమ్మ కథ వితంతు స్త్రీల జీవన సంక్షోభాలను, బలిపీఠాల మీద బతుకులను విశ్లేషిస్తూ రాసిన వ్యాసాలున్నాయి. విధవల పట్ల మన కనీస ధర్మం కథలో రంగనాయకమ్మ వితంతుల పట్ల సాటి స్త్రీలు ఎలా ప్రవర్తిస్తారో ఎలా అవమానిస్తారో, ఎలా వెలివేస్తారో పరిశీలించిన వ్యాసం మనం ఎక్కడ ఉన్నామో, ఏం చేయాలో గుర్తు చేస్తుంది.

గోడ దెబ్బలు చెంప దెబ్బలు కథ పైన వచ్చిన వ్యాసం భర్త మరణించిన తర్వాత వితంతు స్త్రీలు పడే కష్టాలే కాదు, భర్తను కోల్పోయిన స్త్రీకి అనివార్యంగా జరిగే తంతులను ప్రశ్నించిన స్థితిని చర్చించింది. ఒగ్గు కథలో వితంతువు తన లైంగిక అనుభవాన్ని లైంగిక వ్యక్తిత్వాన్ని లైంగిక సహచరుని తనే స్వయంగా నిర్ణయించుకొని లోకానికి వెరవకుండా కొనసాగిస్తూ రావడం గమనించవచ్చు. ఉమా చక్రవర్తి, ప్రీతి గిల్ కలిసి వ్రాసిన భారతీయ సాహిత్యంలో వితంతువులు అనే వ్యాసం పరిశోధనాత్మకమైనది. గురజాడ కందుకూరి రచనలలో వితంతు సమస్య చిత్రణ ఎలా ఉందో విశ్లేషించిన వ్యాసం, చలం రచనల్లో వితంతువులను చిత్రించిన విధానాన్ని తెలిపే మరొక వ్యాసం, శ్రీపాద కథల్లో వితంతువుల జీవితాన్ని, వాళ్ళ వేదనలను దుర్భర స్థితులను చిత్రించిన ఇంకొక వ్యాసం మనలను ఆలోచింప చేస్తాయి. బృందావనంలో వితంతువులను దుర్భరమైన పరిస్థితి నుండి బయటకు తేవడంలో సఫలీకృతమైన ప్రియ రాసిన కథ వైట్ రెయిన్ బో ని విశ్లేషించిన వ్యాసం, వితంతు స్త్రీల మనోభావాలకు ప్రాధాన్యం ఇవ్వడం, సమాజానికి చేటు చేసే దురాచారాలను అడ్డుకోవడం

అవసరమని నొక్కి చెప్పిన అక్కసు కథ పరిచయ వ్యాసం ఇందులో ఉన్నాయి.

వితంతు స్త్రీల స్థితిని సహజ మానవీయ స్పందనల కోణం నుండి వస్తువుగా చేసి కొడవటిగంటి కుటుంబరావు రాసినపెంపుడు తల్లి, దత్తపుత్రుడు, మళ్లీ పెళ్లి కథల పై వచ్చిన వ్యాసం పేర్కొనదగినది. వితంతువుల జీవితంలోని లైంగికత, మాతృ కాంక్ష మొదలైన సున్నితమైన భిన్న పార్శ్వాలను చర్చకు పెట్టిన ఈ వ్యాసం వితంతు సమస్యను గతానుగతి కత్వం నుండి కాక వినూత్నంగా ఎలా చూడాలో, ఎలా అర్థం చేసుకోవాలో మన ముందు ఉంచుతుంది.

ఆధునిక కాలం వచ్చేసరికి వితంతువుల జీవితాల్లో వాళ్ల పరిస్థితుల్లో కొన్ని మార్పులు వచ్చాయి. కారణాలు ఏమైనా ఫలితంగా సమాజంలో స్త్రీల పరిస్థితిలో మార్పు రావడం వారికి ఆర్థిక రాజకీయ సామాజిక సాంస్కృతిక రంగాలలో పురోగతి ఉండడం మనం గమనించవచ్చు.ఇదివరకు వితంతువులు పెళ్లి చేసుకోవడం తప్పుగా నేరంగా భావించేవారు. కానీ ఆధునిక కాలంలో ఇష్టాఇష్టాలు, అవకాశాలు, సందర్భాలు, అవసరాలను బట్టి తమ జీవితాన్ని వితంతువులే కొత్తగా నిర్మించుకొనే ప్రయత్నం చేస్తున్నారు. అయితే ఇది పూర్తి స్థాయిలో కొనసాగుతుందా అంటే లేదని చెప్పవచ్చు. గతంకంటే కొంత పరిస్థితులు మెరుగు పడవచ్చు కాని వితంతువుల సమస్యలు పరిష్కారం కాలేదు. ప్రాంతాలు కులాలు వర్గాలు, మతాలు, జాతులను బట్టి వితంతు స్త్రీల సమస్యల్లో భేదాలు ఉన్నాయి, సాదృశ్యాలు ఉన్నాయి. వాటిని అర్థం చేసుకొని నిర్దిష్ట కార్యాచరణతో సంఘటితంగా ముందుకు పోవలసిన అవసరం ఉంది.

కొండేపూడి నిర్మల, కొండవీటి సత్యవతి, బి.రమాదేవి, కొమర్రాజు రామలక్ష్మి, బి.అంజనీదేవి, సుమిత్రాదేవి, కొలిపాక శోభ, స్వరాజ్యం వెంకటరమణమ్మ వంటి వాళ్లు తమ వ్యక్తిగత జీవిత సంబంధాలలో, సామాజిక జీవితంలో తాము చూసిన, తాము విన్న అనేక మంది వితంతువుల జీవితాలను మన కళ్ళ ముందు ఉంచారు.

అంతేకాదు లంబాడ తండాలలో గుడుంబా తాగి భర్త చనిపోతే బతకలేని స్థితిలో ఉన్న దుర్భరమైన వితంతువుల జీవితాలను కూడా ఈ పుస్తకం మన ముందు ఉంచింది. గ్రామీణ పేదరిక నిర్మూలన సంస్థ ఇందిరా క్రాంతి పథం పథకం ద్వారా జరిపిన ఒక అధ్యయనంలో మద్యపాన బాధిత కుటుంబాల వితంతువుల సమస్యపై 11 మండలాల్లో 45 గ్రామాల్లో 32 గ్రామాలు పాక్షికంగా చేసుకొని జరిగిన అధ్యయనం వలన వితంతువుల జీవితాల్లో కంటికి కనిపించని అర్థం కాని దుఃఖం ఎంత వేదనాభరితంగా ఉందో బయట పెట్టిన ఒక వ్యాసం మనలను కదిలిస్తుంది.

కాల దోషం పట్టి నియమాలను ధర్మాలను భావాలను తిరస్కరిస్తూ నిలబడవలసిన అవసరం ఇవాళ ఉంది. వితంతువులను అర్థం చేసుకోవడం వాళ్ళ ఆలోచనలకు వాళ్ళ ఆకాంక్షలకు గౌరవం ఇవ్వడం వాళ్ల జీవితాన్ని వాళ్లే ఎన్ను కునేటట్లుగా అవకాశాలు ఇవ్వడం వాళ్ళ కాళ్ళ మీద వాళ్లు నిలబడే విధంగా కావలసిన నైపుణ్యాలను అందించడం ఆధునిక సమాజపు ఆదర్శం కావాలి. ఆచరణ కావాలి.

వర్ణాశ్రమ వ్యవస్థ, మనుధర్మం, మత ధర్మం, సంస్కృతి పేర స్త్రీలను బంధించిన అమానవీయ ఆచారాలకు వ్యతిరేకంగా, స్త్రీలు గౌరవంగా జీవించే హక్కు కోసం, స్వేచ్ఛా సమాజం నిర్మించుకునేందుకు సంఘటితం కావలసి ఉన్నది. ఆ దిశగా భారతీయ వితంతు వ్యవస్థ మీద చర్చ జరగడానికి ఈ పుస్తకం దోహదం చేస్తుంది. ❑

# జిల్లాల ఆర్థిక అసమానతలు, వెనుకబాటుతనం

**(31వ పేజీ తరువాయి)**

వాటా ఉంటే 2023-24కి 34.14 శాతానికి పెరిగింది. ఆహార పంటలు దారుణంగా పడిపోతున్నాయి. దీని నుండి వచ్చే ఆదాయం క్షీణిస్తున్నది. పారిశ్రామిక రంగం ఎదుగుబొదుగు లేకుండా 25.69 శాతానికే పరిమితమైంది. ముఖ్యంగా వస్తు తయారీ రంగంలో పెరుగుదల లేదు. కేవలం 4 జిల్లాల్లో అదీ కొన్ని మండలాలకే పారిశ్రామికీకరణ పరిమితమైంది. ప్రభుత్వ ప్రకటనలకు భిన్నంగా వాస్తవ పారిశ్రామికాభివృద్ధి ఉంది. రాష్ట్ర విభజన అనంతరం కూడా వెనుకబడిన జిల్లాలు రాష్ట్ర విభజన పూర్వ స్థితిలోనే కొనసాగుతున్నాయి. వివిధ జిల్లాల స్థూల ఉత్పత్తి, తలసరి ఆదాయాల్లో ఇది స్పష్టంగా కన్పిస్తున్నది. జిల్లాల మధ్య అంతరాలు తగ్గకపోగా వ్యవసాయ రంగ ఉత్పత్తి పెరిగినా వ్యవసాయ రంగంపై ఆధారపడ్డ ప్రజల ఆదాయాలు పడిపోవడం, ఉపాధి కోల్పోవడం చోటు చేసుకుంటున్నది. భూ కేంద్రీకరణ పెరుగుతూ వ్యవసాయ రంగంలో పెట్టుబడి చొచ్చుకుపోతున్నది. సహజ వనరులు, ప్రభుత్వ ఆస్తుల కేంద్రీకరణగా కొన్ని ప్రాంతాల్లో పారిశ్రామిక పెట్టుబడి విస్తరిస్తున్నది. ఈ ఆందోళనకర పరిస్థితులను రూపుమాపే దిశగా ప్రస్తుత చంద్రబాబు కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టకపోగా స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047 పేరుతో చేపట్టబోతున్న విధానాలు జిల్లాల మధ్య, జిల్లాల్లోని మండలాల మధ్య, ప్రజల మధ్య తీవ్ర ఆర్థిక అసమానతలను పెంచుతా యనటంలో ఎలాంటి సందేహం లేదు. ❑

**(కొలిమి సౌజన్యంతో)**

# ప్రజా కవి, మార్క్సిస్టు పరిశోధక భావుకుడు ఆరుద్ర



-తెలకపల్లి రవి

ఆరుద్రతో పోల్చదగిన బహుముఖ ప్రతిభావంతులు చాలా చాలా అరుదుగా వుంటారు. కవి రచయిత, సినిమా రంగ ప్రముఖుడు, కాలమిస్టు, చరిత్ర సాహిత్య పరిశోధకుడు, నృత్య కళాశాలలో బోధకుడు, చదరంగంలో ఇంద్రజాలంలో పుస్తకాలు రాసేంత ప్రజ్ఞా శాలి, నాలుగైదు భాషలు తెలిసిన వారు, అభ్యుదయ సాహిత్యోద్యమ నాయకుడు.. ఈ జాబితాలకు అంతులేదు. అయితే వీటన్నిటికీ ఆధారభూతంగా ఆయన పెట్టుకున్న ప్రామాణిక నిర్దేశం మార్క్సిజమే. సమగ్రమైన ఆ శాస్త్రీయ దృక్పథమే ఆయన ప్రతిభకు ప్రత్యేకత సంతరించి పెట్టింది. విశాఖపట్నంలో 1925 ఆగష్టు 31న పుట్టిన ఆరుద్ర అసలు పేరు భాగవతుల సదాశివశంకరశాస్త్రి అని అందరికీ తెలుసు. అనేక కలం పేర్లను వాడుతూ చివరకు ఆరుద్రగా స్థిరపడ్డారు. ప్రపంచ సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసిన ఆయన విద్యార్హత ఎస్సెస్సెల్సీనే. అసలు చదువంతా పాఠశాల ల్లోనూ కళాశాలల్లోనూ గాక గ్రంథాలయాల్లోనే జరిగిందని ఆయన చెప్పుకున్నారు. తండ్రి నరసింగ రావు సాహిత్యాభిలాషి కావడంతో కనిపించిన పుస్తకమల్లా తెచ్చేవాడు. వాటిని కుర్ర ఆరుద్ర చదువుతుండేవాడు. మేన మామ మహాకవి శ్రీశ్రీ అప్పటికే విశాఖ రీడింగు రూములో పుస్తకాలన్నీ తాను చదివేసి ఆరుద్రతోనూ చదివించాడు. ఆ విధంగా 13 ఏళ్ల వయసులోనే ఆరుద్ర కవిత్వ రచన మొదలెట్టారు. కొడవటిగంటి కుటుంబరావు ఆయనలో సాహిత్య ప్రతిభకు పదునుపెట్టారు. చాగంటి సోమయాజులు మార్క్సిజాన్ని మేధోగతం చేసుకోవడానికి ఉత్ప్రేరకంగా పనిచేశారు. 1942లో సెట్టి ఈశ్వరరావు సిఫార్సుపై ఆరుద్ర కమ్యూనిస్టు పార్టీ సభ్యత్వం స్వీకరించి పార్టీ కార్యకలా పాల్లో పాల్గొన్నారు. తిండి కొరతను నివారించేందుకు దొంగ నిల్వలు వెలికి తీసేందుకు ఉద్యమించారు. రెండో ప్రపంచ యుద్ధంలో జర్మనీ రష్యాపై దాడి చేశాక అందుకు వ్యతిరేకంగా తన వంతు పాత్ర నిర్వహించేందుకు ఆరుద్ర వైమానిక దళంలో చేరారు. ఆనందవాణి పత్రికలో కొలువుతో సహా అనేక మజిలీల తర్వాత మద్రాసులో స్థిరపడి సృజన, పరిశోధన సాగించారు. 1955 ఏప్రిల్‌లో దర్శక దిగ్గజం హెచ్.ఎం.రెడ్డి, శ్రీశ్రీలే సాక్షులుగా అరవై రూపాయల ఖర్చుతో జర్నలిస్టు రామలక్ష్మిని రిజిస్టరు వివాహం చేసుకున్నారు. ఆమె కమ్యూనిస్టు కాకున్నా దంపతులిద్దరూ హేతువాదభావాలనే కొన సాగించారు. ఆది నుంచి అభ్యుదయ ప్రస్థానం భావ కవిత్వంతోనో సంప్రదాయ వాదంతోనో బయలుదేరిన కొందరిలా గాక ఆరుద్ర అభ్యుదయ కవిగానే ప్రస్థానం ప్రారంభించారు. శ్రీశ్రీ మార్క్సిజాన్ని 'పరస్పరం సంఘర్షించిన శక్తులలో చరిత్ర పుట్టెను' అంటూ కవితాత్మకంగా చెబితే ఆరుద్ర 'పైథాగరస్ తీరం చేరుస్తుంది' అంటూ ఎసి స్క్వయర్ బిసి స్క్వయర్ భాషలో మలచడానికి ప్రయత్నించారు. గాయాలూ గేయాలూ, సాహిత్యోపనిషత్, (ఛందస్సు లేని) ఇంటింటి పద్యాలు, కూనలమ్మ పదాలు, సినీవాలి, పైలా పచ్చీసు, అమెరికా ఇంటింటి పజ్యాలు తదితర రచనలను పరిచయం చేశారు. నాట్య శాస్త్రంలోని హస్తముద్ర లక్షణ పదాలు మరో ప్రత్యేకరచన. ఆరుద్ర అరబ్బీ మురబ్బాలు ఆయన మరణానంతరం వెలువడ్డాయి. జీవితపు చివరి దశలో మొదలుపెట్టిన మనిషీ–ఆడమనిషి కావ్యం లోని ఒక భాగం 'స్త్రీ పురాణం' మహిళా కోణాన్ని ఆవిష్కరించింది. తను రాయని సినీ వాలి అనే కావ్యం రాసినట్టు ఎవరో పొరబాటున పేర్కొంటే దాన్ని నిజం చేయడానికి ఆ కావ్యం రాశారు (సినీ వాలి అంటే అమావాస్య నాడు కనిపించీ కనిపించని చంద్రరేఖ). ఇంటింటి పజ్యాలు, కేరా శతకము వంటివి అలవోకగా చేసిన ప్రయోగాలే, కూనలమ్మ పదాలు వందల మందిని కవులను చేశాయంటారు. ఆరుద్ర రాసిన కవిత్వంలో వచన కవిత్వం పాలే ఎక్కువ. అనువాద కావ్యాలు. దృశ్య కావ్యాలను అనేకం అందించారు. కథా సాహిత్యంతోపాటు కథా రచన టెక్నిక్‌లపైనా చక్కగా రాశారు. వీర తెలంగాణ సాయుధ పోరాటంపై హరీంద్రనాథ్ చటోపాధ్యాయ గీతాలను తెలుగులోకి అను వదించగా సుందరయ్య గారి పుస్తకంలో ప్రచురించారు. 'కొండగాలి తిరిగింది' సినిమా కవిగానూ ఆరుద్ర జనరంజక గీతాలు అనేకం రాశారు. కొండగాలి తిరిగింది పేరిట వచ్చిన సినిమా పాటలు ఆయన పట్టును చెబుతాయి. రాజులు ఎక్కు అంబారీపై అందరు ఎక్కుట తప్పు కదా అంటే. రోజులు మారి రాజులు పోయిరి.. ప్రజలే ప్రభువులు ఈనాడు.. మనుషులుపైన సవారి కన్నా ఏనుగు సవారి నయం కదా అంటూ రాస్తారు. ఎదగడానికెందుకురా తొందర పాటలో నిరుద్యోగాన్ని వివరి స్తారు. గాంధీ పుట్టిన దేశమా ఇది అంటూ ప్రశ్నిస్తారు. చరిత్ర రచనలోనే గాక, వేదంలా ప్రవహించే గోదావరి, మహాబలిపురం వంటి పాటలు వింటే రాగం చరిత్ర అల్లుకు పోవడం చూస్తాం. కొట్టుకునిపోయే



కొన్ని కోటిలింగాలు వీరేశలింగమొకడు నిలిచెను చాలు అన్న ఆయన మాటలు సుభాషితాల్లా నిలిచిపోయాయి. రగిలింది విప్లవాగ్ని ఈ రోజు అంటూ అల్లూరి సీతారామరాజుకు రాసిన పాట కూడా గొప్పగా వుంటుంది. సినిమా పాటల తీరు మారి విలువలు తగ్గిపోతున్న దృష్ట్యా వాటిని రాయడం విరమించుకున్నారు. 150 చిత్రాలకు మాటలూ, 500 చిత్రాల్లో నాలుగు వేలకుపైగా పాటలు రాశారు.

మహా పరిశోధకుడు మార్క్సిస్టు దృక్పథంతో పరిశోధన, అధ్యయనం చేసిన ఆరుద్ర సమగ్ర ఆంధ్ర సాహిత్యం అందుకు తలమానికమైంది. సామాన్యుడికి సాహిత్య చరిత్ర తెలియడానికి తాను ఈ మహాభారం వేసుకున్నానని వినయంగా చెబుతూ వచ్చిన ఆయన వాస్తవంలో పండితులకు గొప్ప వనరు సమకూర్చారు. దాన్ని రాసే సమయంలో తీరిక లేకపోవడం వల్లనే గడ్డం చేసుకోవడం మానేసి పెంచేశానని సరదాగా చెబుతుండేవారు. వేమన వేదం (1974), మన వేమన, వ్యాస పీఠం, గురజాడ గురుపీఠం, సంపుటాలు ప్రజాశక్తిలో వారం వారం రాసిన వ్యాసాలతో వెలువడిన ప్రజా కళలూ – ప్రగతి వాదులూ ఆయన ప్రజ్ఞకు ప్రతిబింబాలుగా నిలిచివున్నాయి. 'రాముడికి సీత ఏమవుతుంది?', 'గుడిలో సెక్స్' అన్న గ్రంథాలు ఆరుద్ర పరిశోధనా పటిమకూ నిదర్శనాలు. కళలు, క్రీడలు, ఇంద్రజాలం వంటి అంశాలపై సాధికార గ్రంథాలు వెలువరించారు. నాట్య శాస్త్రంలో గొప్ప అవగాహన గల ఆయన చెన్నైలో ప్రతిష్ఠాత్మక సంస్థల్లో ఉపన్యాసకుడుగా వున్నారు. దాదాపు అన్ని విశ్వ విద్యాలయాలలోనూ ఆయన ప్రసంగాలు చేయగా ఆయనపై అర డజనుపైగా పరిశోధనలు జరగడం మరో విశేషం. శ్రీశ్రీ, ఆరుద్ర రెండవ ప్రపంచయుద్ధంలో ఫాసిజాన్ని ఓడించాలంటూ సైన్యంలో చేరడంతో మొదలైన ఆరుద్ర రాజకీయ అవగాహన ఆఖరు దాకా అదేబాటలో సాగింది. సైద్ధాంతిక విభేదాలు పెరిగినపుడు మామూలు కవులుగా అందుకోవడంలో తాము పొరబడి వుండొచ్చని నిస్సంకోచంగా, వినయంగా చాలాసార్లు చెప్పారాయన. 1955లో ప్రగతిశీల శిబిరంలో ప్రగతి నిరోధక స్వరాలు వినిపించినపుడు ఆయనను అటువైపు చేర్చారు గాని నిజం కాదని చాలాసార్లు సోదాహరణంగా చెప్పడానికి ప్రయత్నించాడాయన. శ్రీశ్రీ కన్నా 14 ఏళ్లు చిన్నవాడయినా అవగాహన పెంచుకుంటూ సమకాలీన బృందంతోనే నడవడం ఆయన ప్రతిభకూ పట్టుదలకూ అద్దం పడుతుంది. అతి సన్నిహితులైన వారి మధ్య తేడాలను రాజకీయం చేయవలసిన అగత్యమే లేదు. శ్రీశ్రీ, ఆరుద్రలు అభ్యుదయ లోకంలో గొప్ప ప్రభావం చూపిన ఇద్దరు ఉద్దండులుగా ఎప్పటికీ మిగిలి వుంటారు. ఈ వ్యాస రచయిత శ్రీశ్రీ 'అనంతం'పైన సమీక్ష రాశాక ఆరుద్ర అభినందనలు రాస్తూ 'ప్రముఖ సామ్యవాద కవిగా మాత్రమే ఆయనను మనం గుర్తుంచుకోవాలి' అని ఆరుద్ర తేల్చి చెప్పారు. ఈ కారణంగానే శ్రీశ్రీ జయభేరి ఆరుద్రకే అంకితమిచ్చాను. అరవైల తర్వాత ఇంకో అరుణారుణంగా 1985లో ఆరుద్ర షష్ఠి పూర్తి తెలుగు సాహిత్యలోకంలో ఒక పండుగలా జరిగింది. అనేక పట్టణాల్లో ఆయనను సత్కరించారు. ప్రచురణ సంస్థలు తలా ఒక సంపుటం వెలువరించాయి. మద్రాసు రాణీ శీతల్ హాలులో జరిగిన ఆ సభ ఇప్పటికీ గుర్తుంది. ప్రజాకళలు ప్రగతివాదులు కాపీలు తీసుకుని వెళ్లారు. ఆ తర్వాత కాలంలో ఆరుద్ర ఉద్యమానికి మరింత దగ్గరయ్యారు. కీలకమైన పలు సభలకూ సందర్భాలకూ హాజరవుతూ వచ్చారు. సుందరయ్య కన్ను మూసినపుడు రాత్రి ఫోన్ చేసి మరీ చిన్న కవిత చెప్పి నివాళు లర్పించారు. సమగ్ర ఆంధ్ర సాహిత్యం సంపుటాల మలి ముద్రణ కూడా ఆరుద్ర అప్పగించడం, అందుకు అవసరమైన ఏర్పాట్లు ప్రజాశక్తి చేయడం యాదృచ్ఛికం కాదు. బొమ్మారెడ్డి గారు, గోళ్ల రాధాకృష్ణమూర్తి గారు ఆయనతో ఎక్కువగా మాట్లాడుతుండేవారు. మేడిపల్లి రవికుమార్ ఆరుద్రకు రాసిపెట్టడంలో సహకరించేవారు. తర్వాత కాలంలో ఆయన సాహిత్య అకాడమీ కోసం ఆరుద్ర జీవితం రాశారు.

అంతర్జాతీయంగా సోవియట్ విచ్ఛిన్నం, ప్రపంచీకరణ, దేశంలో అయోధ్యవివాదం తర్వాత మతతత్వ రాజకీయాలు పెరుగుతున్న తరుణంలో ఆరుద్ర మరింత పట్టుదలగానూ అధ్యయన శీలంగానూ గడిపారు. మనీ ప్రపంచం మనీ ప్రపంచం/మనీ ప్రపంచం గెలిచిందా? మరో ప్రపంచం మరో ప్రపంచం మరో ప్రపంచం మారిందా?/ పీడిత శక్తుల స్వప్నాలన్నీ/పీడ కలలుగా మారాయా?/మరో ప్రపంచం మరో ప్రపంచం/ మాతా మహులను మరిచేరా? /మతిభ్రమించిన అతిరథులంతా / గతి తర్కాన్నే తిడతారా?/ కారల్ మార్క్స్ ఉపదేశాలకు కాలదోషమని అంటారా? /డెబ్బయ్యేళ్ల త్యాగాలన్నీ / ఇబ్బందుల పద్దుకు జమ కట్టి వర్గ శత్రువుల దుర్గంధాల వాకిట ముష్టికి వెడతారా?/ బొచ్చె పట్టుకుని బిచ్చమెత్తుకుని/ చచ్చిన చావు వద్దు సుమా అని హెచ్చరించారు. మార్క్స్, లెనినూ మనకై వేసిన మార్గంలోనే చరిద్దాము/ మరో ప్రపంచం మరో ప్రపంచం/మరలా మనమూ రచిద్దాం/ విశ్రమించక విధిగా సరిగా శ్రీశ్రీ గీతిక పఠిద్దాం అని అమెరికాలో వుండగా రాసిన పాట ప్రజాశక్తికి పంపించారు. ఆరుద్ర 1998 జూన్ 4న కన్నుమూసిన సంగతి అంత్యక్రియలు ముగిశాక తెలిసిందంటే అది కూడా ఆయన నిరాడంబరతకు ఓ నిదర్శనమే. తన అంతిమ ఘట్టం అలా నిశ్శబ్దంగా జరిగిపోవాలని ఆయన ఆకాంక్షించారట. ఆయన భార్య రామలక్ష్మి 2023 మార్చి 3న కన్నుమూశారు. చరిత్రనే తిరగదోడే సంఘ పరివార్ దాడులు, సాహిత్యంలోనూ సమష్టి ప్రయోజనంకన్నా వ్యక్తిగత ధోరణులు వాణిజ్య ప్రభావాలు పెంచుతున్న ఈ తరుణంలో ఆరుద్ర జీవిత ప్రస్థానం జిజ్ఞాసులు, చైతన్య గత ప్రాణుల అధ్యయనానికి మార్గదర్శకం. శత జయంతి సంవత్సరంలో ఆరుద్ర సాహిత్యం అధ్యయనాల వారసత్వాలను సంస్కరిద్దాం. అలవర్చుకునే ప్రయత్నం చేద్దాం. ❑

**(ప్రజాశక్తి సౌజన్యంతో)**

# ఆహ్వానం

ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్

29 డిసెంబర్ 2024 - 2 జనవరి 2025, హైదరాబాద్

## ఇరవై ఒకటవ శతాబ్దంలో ఫాసిజం :

### కొనసాగుతున్న అంశాలు, నూతన లక్షణాలు, సమకాలీన శ్రామికవర్గ వ్యూహం

ప్రపంచ పెట్టుబడిదారీ విధానం 2006-07లో మొదలైన ఇరవై ఒకటవ శతాబ్దపు మొదటి మహా మాంద్యం నుంచి ఇంకా బయటపడలేదు. పెట్టుబడిదారీ సంక్షోభాల కారణంగా ఏర్పడిన సామాజికార్థిక, రాజకీయ అభద్రత, విప్లవ శక్తుల బలహీనత వెరసి ప్రతీఘాత శక్తులు బలం పుంజుకున్నాయి. ఈ కారణంగానే వివిధ దేశాలలో ఫాసిజంతో సహా వివిధ మితవాద ఉద్యమాల పెరుగుదల మనకు కనబడుతోంది.

ప్రతీ ఫార్-రైట్ ప్రతీఘాతమూ ఫాసిజం కాజాలదు. ఫార్-రైట్ ప్రతీఘాతాలలో ఫాసిజం ఒక ప్రత్యేక రకం. ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలోని కొన్ని భాగాలలో, యథాలాపంగా ఎలాంటి ప్రతిఘాత చర్యనైనా ఫాసిజంగా అభివర్ణించే ధోరణి ప్రబలంగా ఉంది. ఫాసిజం యొక్క ప్రత్యేకతను అర్థం చేసుకోకుండా సమర్థవంతమైన శ్రామికవర్గ వ్యూహాన్ని, ఫాసిజానికి వ్యతిరేకంగా పోరాడేందుకు ఉపయోగపడే సాధారణ ఎత్తుగడలను రూపొందించడం సాధ్యం కాదు.

అందుకే, ప్రపంచవ్యాప్తంగా జరుగుతున్న మార్పులను కూడా మనం అర్థం చేసుకోవాలి. టర్కీ, బ్రెజిల్, ఫిలిప్పీన్స్, రష్యా, మధ్య ప్రాచ్యం, యుఎస్, బ్రిటన్ లేదా ఫ్రాన్స్‌లో జరుగుతున్న మార్పులను మనం అర్థం చేసుకోవాలి. ఎర్డోగాన్ పాలన యొక్క లక్షణం ఏమిటి? పుతిన్ పాలన యొక్క లక్షణం ఏమిటి? మార్కోస్ జూనియర్, డ్యుటెర్టే తదితర శక్తుల పాలన యొక్క స్వభావాన్ని మనం ఎలా అర్థం చేసుకోవాలి? ఫ్రాన్స్‌లో నేషనల్ ర్యాలీ స్వభావం ఏమిటి? గ్రీస్ దేశపు గోల్డెన్ డాన్ వంటి శక్తుల స్వభావం ఏమిటి? బ్రెజిల్‌లో బోల్సోనారో ఎలాంటి రాజకీయ ధోరణికి ప్రతినిధిగా ఉన్నాడు? యుఎస్‌లో ట్రంప్ ఎదుగుదలని మనం ఎలా అర్థం చేసుకోవాలి? ఇరాన్‌లో ఖొమెనీ నేతృత్వంలో జరిగిన విప్లవానంతరం ఏర్పడిన పాలన యొక్క స్వభావం ఏమిటి? ఇవి మార్క్సిస్టు, ప్రగతిశీల రాజకీయ కార్యకర్తలతో పాటు విద్యావేత్తలు సైతం అర్థం చేసుకోవలసిన సజీవ ప్రశ్నలు.

సరిగ్గా ఈ ప్రశ్నలపైనే వివరణాత్మక, సంతృప్తికరమైన సంభాషణలు, చర్చలు, వాదనలు జరపడం కోసం డిసెంబర్ 29, 2024 నుండి జనవరి 2, 2025 వరకు హైదరాబాద్‌లో ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్ నిర్వహిస్తున్నాము. ఈ సెమినార్‌లో పాల్గొనవలసిందిగా భారతదేశంలోనే కాక ప్రపంచ వ్యాపితంగా ఉన్న కమ్యూనిస్ట్ గ్రూపులు, సంస్థలు, మరియు పార్టీలు, మార్క్సిస్ట్ మేధావులు, ప్రగతిశీల మరియు ఫాసిస్ట్ వ్యతిరేక విద్యావేత్తలు, పరిశోధకులు మరియు విద్యార్థులను హృదయపూర్వకంగా ఆహ్వానిస్తున్నాము. ఈ ఐదు రోజులూ అరవింద్ మెమోరియల్ ట్రస్ట్ వసతి, భోజన ఏర్పాట్లు చేస్తుంది.

### సెమినార్ తేదీలు

డిసెంబర్ 29, 2024 నుండి
జనవరి 2, 2025 వరకు

### వేదిక

సుందరయ్య విజ్ఞాన కేంద్రం,
బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్

arvind.trust@gmail.com

english.arvindtrust.org

ఆనంద్ : 9971196111
జయప్రకాష్ : 9871794036
శ్రీజ: 7013936466

**నిర్వహణ కమిటీ**
**ఏడవ అంతర్జాతీయ అరవింద్ మెమోరియల్ సెమినార్**
**(హైదరాబాద్)**

**అరవింద్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మార్క్సిస్ట్ స్టడీస్**
**(నిర్వహణ: అరవింద్ మెమోరియల్ ట్రస్ట్)**

# మహాపర్వతం ఎక్కుతున్నప్పుడు నిరాశలు కూడా ఎదురవుతాయి!

-వి.ఐ.లెనిన్

**1917 రష్యా విప్లవం జయప్రదమైన తర్వాత శైశవ దశలో ఉన్న కార్మికవర్గ రాజ్యాన్ని పొత్తిళ్లలోనే మట్టుపెట్టడానికి 18 సామ్రాజ్యవాద దేశాలు ఏకమై దానితో యుద్ధానికి తలపడ్డాయి. వ్యూహాత్మక రాజీలతో యుద్ధం నుంచి బయటపడ్డ తర్వాత రష్యా ఆర్థిక వ్యవస్థలో కొన్ని మార్పులు చేయాల్సి వచ్చింది. సోషలిస్టు పంథా నుంచి ఒకడుగు వెనక్కు వేసి కొన్ని మార్కెట్ సంస్కరణలు ప్రవేశ పెట్టాల్సి వచ్చింది. ఆ సందర్భంగా విప్లవ నేత లెనిన్ రాసిన వ్యాసంలోని కొంత భాగాన్ని దిగువ ఇస్తున్నాం. లెనిన్ ఈ వ్యాసాన్ని పూర్తి చేయలేదు. 1922 ఫిబ్రవరి చివరిలో ఆయన రాసుకున్న నోట్స్ నుంచి దీన్ని సేకరించారు.**



ఒక ఉదాహరణ చెబుతాను..

ఒక మనిషి చాలా ఎత్తయిన, బాగా ఏటవాలుగా ఉన్న, ఇప్పట వరకు ఎవరూ ఎక్కని దుర్గమమైన పర్వతాన్ని ఎక్కుతున్న దృశ్యాన్ని ఊహించుకోండి. అతను ఎన్నడూ ఎరుగనన్ని కష్టాలూ, ప్రమాదాలూ అధిగమించాడు. అతనికి ముందువాళ్లు ఎవరూ ఎక్కనంత ఎత్తుకు ఎక్కగలిగాడు. అయినప్పటికీ ఇంకా ఆయన శిఖరాన్ని మాత్రం చేరుకోలేదనుకోండి. అతను ఆ దశ వరకు వచ్చిన తర్వాత ఇంక అదే త్రోవలో ముందుకు వెళ్లడం కష్టసాధ్యం, ప్రమాదకరమనే పరిస్థితి ఎదురైంది. అంతే కాదు ఇంక ఆ త్రోవలో ముందుకు వెళ్లడం అసాధ్యమైపోయింది. దాంతో అతను వెనుదిరగాల్సి వచ్చింది. కిందికి కొంత దిగి, మరో మార్గం పట్టుకుని పైకి పోవాల్సి వచ్చింది. ఈసారి ఎన్నుకున్న మార్గంలో కొంత ఎక్కువ దూరం ప్రయాణించాల్సి రావచ్చు. కాని ఆ మార్గం అతన్ని కచ్చితంగా శిఖరానికి తీసుకుపోతుంది. ఇప్పుడు మనం చెప్పుకున్న ప్రయాణీకునికి ఇతరులు చేరలేని ఎత్తుకు వెళ్లడంకన్నా కూడా ఆ ఎత్తు నుంచి కిందకు దిగడం చాలా కష్టంగా, ప్రమాదకరంగా ఉంటుంది. ఎందుకంటే అలా దిగేటప్పుడు కాలు జారిపోయే అవకాశాలు ఎక్కువ. కాలు మోపడానికి దన్ను దొరకదు. పైకి ఎక్కుతున్నప్పుడు, నేరుగా లక్ష్యాన్ని చేరుకుంటున్నప్పుడున్న హుషారు ఇప్పుడతనిలో ఉండదు. దిగాల్సి వచ్చేటప్పుడు నడుంకి తాడు కట్టుకుని జాగ్రత్తగా నేలను పాదాలు తాకుకుంటూ దిగాల్సి వస్తుంది. సరైన పట్టు సంపాదించడం కోసం గంటల తరబడి వేచి చూడాల్సి వస్తుంది. నత్తనడకన చాలా నెమ్మదిగా, లక్ష్యానికి దూరంగా జరుగుకుంటూ కిందికి దిగాల్సి వస్తుంది. అంతేకాదు బాధాకరమైన, కష్టతరమైన ఆ అవరోహణం కూడా అతన్ని ఎక్కడకు చేరుస్తుందో తెలియదు. దిగిన తర్వాత తాను మళ్లీ మరింత ధైర్యంగా, మరింత త్వరగా, మరింత నేరుగా శిఖరాన్ని చేరుకోవడానికి తనకు సురక్షితమైన మార్గం దొరుకుతుందో లేదో కూడా తెలీదు. అంతటి ఎత్తు వరకు చేరుకున్న వ్యక్తి అటువంటి సంకట స్థితిలో పడ్డాడంటే అతను నిరాశకు గురికావడం సహజం. పైగా ఇటువంటి స్థితిలో ఉన్న వ్యక్తికి.. కింద, చాలా దూరంలో టెలిస్కోపులో తను దిగడాన్ని చూస్తున్న వ్యక్తులు చేస్తున్న అపహాస్యపు వ్యాఖ్యానాలు వినిపిస్తూ ఉంటే అప్పుడు అతను మరిన్ని ఎక్కువసార్లు నిరాశా నిస్పృహలకు గురవుతుంటాడు. అతను దిగే మార్గం స్మేనా వెఖ్ వ్యాసాల్లో మేధావులు చెప్పేటటువంటి మార్గం కాదు. బ్రేకులను పట్టుకుని ఎక్కాలని వాళ్లు చెప్పారు. చక్కగా డిజైన్ చేసిన, పరీక్షించిన వాహనానికి బ్రేకులున్నట్లు ఉండాలంటారు వారు. చక్కగా వేసిన రోడ్డు మీద, ముందుగానే పరీక్షించిన సాధనాలతో ప్రయాణించాలంటారు. కాని మనవాడు దిగుతున్న సందర్భంలో ముందుగా పరీక్షించిన వాహనం ఏదీలేదు. ముందుగా సరిచూసుకున్న రోడ్డు ఏదీలేదు. నిజానికి చెప్పాలంటే ముందుగా పరీక్షించింది ఏదీ అక్కడ లేదు. అటువంటి పరిస్థితుల్లో కింది నుండి అతని చెవికి అపహాస్యపు మాటలు వినిపిస్తున్నాయి. వాళ్లు లోపలేమీ దాచుకోవడం లేదు. బహిరంగంగానే

అపహాస్యం చేస్తున్నారు. నవ్వుతున్నారు. అరుస్తున్నారు. "చూడండి, చూడండి ఒక్క క్షణంలో వాడు పడిపోతాడు. ఆ పిచ్చి సన్నాసికి అది జరగాల్సిందే!" అంటుంటారు. కొంత మందేమో నవ్వు బయటకు రాకుండా ఆపుకుని అదో రకంగా ప్రవర్తిస్తారు. అయ్యో పాపం అంటారు. వల్లమాలిన సానుభూతి చూపుతారు. వాళ్లేమంటారంటే "మేం భయపడ్డట్లే జరిగింది. ఎంత బాధాకరమైన విషయం. ఆ శిఖరాన్ని చేరుకోవడానికి మా జీవితాలన్నిటినీ వెచ్చించి గొప్ప ప్రణాళికలు తయారు చేస్తూ ఉన్నాం. మా ప్రణాళిక పూర్తయ్యే వరకూ శిఖరాధిరోహణాన్ని వాయిదా వేసుకోమని మేం అతనికి చెప్పాం. విన్నాడా ! విన్లేదు. ఈ త్రోవలో వెళ్లొద్దురా నాయనా అని చెప్పాం. అదీ విన్లేదు. చూడండి. ఇప్పుడు ఆ పిచ్చివాడు ఆ మార్గం నుండి వెనక్కు వచ్చేస్తున్నాడు. (చూడండి, చూడండి, అతను వెనక్కు తిరిగాడు. దిగిపోతున్నాడు. దిగడంలో కూడా ఒక్క అడుగు దిగడానికి ఎన్ని గంటలు పడుతోందో చూడండి! అయినప్పటికీ జాగ్రత్తరా నాయనా అంటే మన మాట చెవిన పెట్టకుండా మనల్నే విమర్శిస్తున్నాడు చూడండి!) ఇటువంటి పిచ్చివాడి చర్యలను మేము పదే పదే ఖండిస్తున్నామంటే, అతన్ని ఎవరూ అనుసరించొద్దు, అతనికి ఎవరూ సహాయం చేయవద్దు అని సలహా ఇస్తున్నామూ అంటే దీనంతటికీ కారణం ఈ మహా పర్వతాన్ని ఎక్కడం కోసం మేం రూపొందించిన మహోత్తర ప్రణాళిక పట్ల మాకున్న అంకితభావమే. ఆ మహా ప్రణాళికను భ్రష్టుపట్టించకుండా చూడ్డం కోసమే ఇదంతా చేస్తున్నాం." ఇటువంటి మాటలు చెప్పేవాళ్లంతా కూడా పర్వతాన్ని ఎక్కడం అనే "భావానికి" మాత్రమే నిజమైన మిత్రులు. సంతోషకరమైన విషయం ఏమిటంటే మనం చెప్పుకుంటున్న ప్రయాణీకుడు తనున్న స్థితిలో ఇటువంటి వాళ్ల మాటలు వినలేకపోవడం. ఒక వేళ అతను ఈ మాటలు వింటే జరిగేదేమిటి ? కళ్లు తిరుగుతాయి. కడుపులో దేవేస్తుంది. వాంతి వచ్చినంత పనవుతుంది. ఆ స్థితికి వెళ్లిన వాడు అంతటి ఎత్తులో సరిగ్గా ఆలోచించలేడు. నేలమీద స్థిరంగా అడుగు వేయలేడు. ఇప్పుడిక పోలికలతో పనిలేకుండా నేరుగా విషయానికి వద్దాం.


పోలికలు సాక్ష్యాలు కావు. ప్రతి పోలికా లోపభూయిష్టమైనదే. ఇవన్నీ తిరుగులేని సాధారణ సత్యాలు. కాని, విషయాన్ని అర్థం చేసుకోవడానికి పోలికలను గుర్తుకు తెచ్చుకోవడం వల్ల నష్టమేమీ లేదు. రష్యన్ కార్మిక వర్గం విప్లవ సాధనలో మహా ఎత్తుకు ఎదిగింది. 1789, 1793 విప్లవాలే కాదు 1871తో పోలిస్తే కూడా మహా ఎత్తుకు వెళ్లింది. అయితే విప్లవం సాధించాక మనం ఏం చెయ్యగలిగాం. ఏం చెయ్యలేకపోయాం అన్న విషయాలను సాధ్యమైనంత స్పష్టంగా, నిర్దిష్టంగా సమీక్షించుకోవాలి. ఆ పనిచేస్తేనే మనకు ఒక స్పష్టత ఉంటుంది. మనం కళ్ళు తిరగడానికో, భ్రమలకో లేక నిరాశా నిస్పృహలకో గురికాకూడదు. మనం ప్రపంచంలో ఏనాడూ ఎక్కడా జరగనంత సమగ్రంగా బూర్జువా ప్రజాతంత్ర విప్లవాన్ని పరిపూర్తి చేశాం. ఇది పెద్ద విజయం. భూమి మీద ఏ శక్తీ మన నుండి దాన్ని తీసుకుపోలేదు. అత్యంత అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాద యుద్ధం నుండి మనం అత్యంత విప్లవాత్మక మార్గంలో బయటపడ్డాం. ఇది కూడా మనకు పెద్ద విజయమే. ఈ విజయాన్ని మనల్నుండి ఈ భూమ్మీద ఏ శక్తి వేరు చేయలేదు. ఈ విజయం చాలా విలువైనది. ఎందుకంటే, పెట్టుబడిదారీ వ్యవస్థ మనుగడ కొనసాగించిందంటే అనతి కాలంలోనే దాని అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాద దౌష్ట్యాలు అధికమవుతాయి. 1912, 1914–18లో లాగా కమ్యూనిస్టు ఇంటర్నేషనల్స్ ద్రోహులు లోపల నుంచి ప్రజలను మోసం చేయలేరు గనుక అభివృద్ధి నిరోధక సామ్రాజ్యవాదం ప్రజలపై నేరుగా దాడులకు దిగుతుంది. మనం సోవియట్ తరహా రాజ్యాన్ని స్థాపించాం. ఆ విధంగా ప్రపంచ చరిత్రలో కొత్త శకాన్ని, బూర్జువా పాలన స్థానంలో కార్మిక వర్గ రాజకీయాధికారం నెరిపే శకాన్ని సృష్టించాం. దీన్ని కూడా మనల నుండి ఎవరూ వేరు చేయలేరు. అయితే సోవియట్ తరహా రాజ్యానికి, ఇంకా వివిధ దేశాలకు చెందిన కార్మికవర్గ ప్రత్యక్ష అనుభవాలతో పరిపూర్ణత ఇవ్వాల్సి ఉంది. కాని మనం ఇంకా సోషలిస్టు ఆర్థిక వ్యవస్థ యొక్క పునాదులు నిర్మించలేదు. మరణ శయ్య మీద ఉన్న పెట్టుబడిదారీ ప్రత్యర్థి శక్తులు మనల్ని ఆ నిర్మాణం సాగించకుండా అడ్డుపడుతున్నాయి. ఈ విషయాన్ని మనం అర్థం చేసుకోవాలి. నిర్మొహమాటంగా అంగీకరించాలి. ఎందుకంటే భ్రమల్లో ఉండడంకన్నా ప్రమాదకరమైంది మరోటి ఉండదు. (అది కూడా మనం అత్యున్నత ఎత్తుకు వెళ్లిన స్థితిలో భ్రమలు మరింత ప్రమాదకరం). ఈ నగ్న సత్యాన్ని అంగీకరించడంలో దారుణమైన విషయం ఏమీ లేదు. నిరాశా నిస్పృహలకు గురికావాల్సిన పనిలేదు. ఎందుకంటే అనేక అభివృద్ధి చెందిన దేశాల కార్మికుల ఉమ్మడి కృషి ద్వారా మాత్రమే సోషలిజం జయప్రదమవుతుందన్న మార్క్సిస్టు ప్రాథమిక సత్యాన్ని మనం ఎల్లప్పుడూ నొక్కి చెబుతుంటాం కనుక మనం ఇప్పటికీ ఒక వెనుకబడిన దేశంలో ఒంటరిగానే ఉన్నాం. మన దేశం ఇతర దేశాలకన్నా ఎక్కువగా యుద్ధ నాశనాన్ని చవిచూసింది. కాని, అదే సమయంలో మనం చాలా విజయాలూ సాధించాం. అన్నిటికీమించి మనం విప్లవ కార్మిక వర్గ శక్తులను నిలుపుకున్నాం. వ్యూహాత్మకంగా వ్యవహరించగల దాని శక్తిని నిలుపుకున్నాం. మనం కళ్లు తిరిగే స్థితిలో కాకుండా స్పష్టమైన ఆలోచనా విధానంతో ఉన్నాం. ఎక్కడ, ఎప్పుడు, ఎలా వెనుదిరగాలో ఖచ్చితంగా అంచనా వేయగలిగే స్థితిలో ఉన్నాం. (ఈ వెనక్కు రావడం అనేది మళ్లీ మరింత ముందుకు పోవడానికే అన్న విషయం గుర్తుంచుకోవాలి.) ఇంకా మిగిలి

పోయి ఉన్న పనిని పూర్తిచేయడానికి ఎక్కడ, ఎప్పుడు, ఎలా పనిచేయాలన్న స్పష్టత కలిగి ఉన్నాం. తప్పులు చేయకుండా, వెనకడుగులు లేకుండా, మిగిలిపోయిన పనులను, సక్రమంగా చేయని పనులనూ ఎప్పటికప్పుడు సరిచేసుకోకుండా సోషలిస్టు పునాదులను (ముఖ్యంగా ఒక చిన్న రైతాంగ దేశంలో) నిర్మించ డం అనే మహత్తర కర్తవ్యాన్ని నిర్వర్తించడం సాధ్యం కాదు. అలా సాధ్యమవుతుందని కమ్యూనిస్టులెవరైనా భావిస్తే వారు నాశనమైనట్లే లెక్క.

తీవ్రమైన కష్టాలు ఎదురైనప్పుడు భ్రమలకు గురికాని కమ్యూనిస్టులు, నిరాశా నిస్పృహలను దరిచేరనివ్వని కమ్యూనిస్టులు, మళ్లీ మొదటి నుండి ప్రారంభించే శక్తినీ, వెసులుబాటునూ పోగొట్టుకోని కమ్యూనిస్టులు ఎన్నటికీ నాశనం కారు. మన వరకు మనకు నిరాశా నిస్పృహలకు గురయ్యే అవకాశాలు తక్కువ ఉన్నాయి. ఎందుకంటే మనం యుద్ధంలో దెబ్బ తిని పోయినా, పేదరికం, వెనుకబాటుతనం, ఆకలి మన దేశంలో ఇంకా రాజ్యమేలుతున్నా సోషలిస్టు మార్గాన్ని సిద్ధం చేసే ఆర్థిక వ్యవహారాల్లో మనం పురోగతి సాధిస్తున్నాం. మనతో పాటు ఉన్న ప్రపంచంలో, బాగా అభివృద్ధి చెందిన అన్ని దేశాల్లోనూ, మనకన్నా ధనిక దేశాల్లోనూ, మనకన్నా సైనికంగా వెయ్యి రెట్లు శక్తివంతమైన దేశాల్లోనూ పెట్టుబడిదారీ ఆర్థిక వ్యవస్థలు కలిగి ఉన్నవారి పరిస్థితి దిగజారిపోతోంది. ❑

(మార్క్సిస్టు సైద్ధాంతిక మాసపత్రిక, జూలై, 2009 సంచిక నుంచి సేకరణ)

## రండి ప్రతిజ్ఞ చేద్దాం



### ప్రతిజ్ఞ

భావి భారత పౌరులమైన మేము భారత రాజ్యాంగ పీఠిక ప్రకటించిన ఆశయాలకు బద్ధులమై వుంటామని, దేశ ప్రజలందరికీ సామాజిక, ఆర్థిక, రాజకీయ న్యాయం ద్వారా సమాన అవకాశాలు పొందేలా కృషి చేస్తామని, కుల, మత, భాషాపరమైన విద్వేషాలకు లోనుకాకుండా సోదర భావం పెంచుకుని దేశ సమైక్యతకు దోహదం చేస్తామని, రాజ్యాంగ పీఠిక ప్రస్తావించిన లక్ష్యాల సాధనకు పాటుపడతామని ప్రతిజ్ఞ చేస్తున్నాము.

### రాజ్యాంగ పీఠిక

భారత ప్రజలమైన మనము మన భారతదేశాన్ని సార్వభౌమ సామ్యవాద లౌకిక ప్రజాస్వామ్య గణతంత్ర రాజ్య వ్యవస్థగా నిర్మించేందుకు పవిత్ర దీక్షతో తీర్మానించి మన దేశ పౌరులందరికీ సామాజిక ఆర్థిక రాజకీయ న్యాయాన్ని ఆలోచనా భావ ప్రకటనా మత విశ్వాస ఆరాధనా స్వేచ్ఛను హోదాల్లోనూ అవకాశాల్లోనూ సమానత్వాన్ని సాధించేందుకు వ్యక్తి గౌరవాన్ని జాతి ఐక్యత సమగ్రతను కల్పించే సౌభ్రాతృత్వాన్ని పెంపొందించాలని మన రాజ్యాంగ నిర్ణాయక సభలో 1949 నవంబరు 26వ తేదీన ఈ రాజ్యాంగాన్ని స్వీకరించి శాసనీకరించి ఆమోదించి మనకు మనము సమర్పించుకుంటున్నాము.





సభలో మాట్లాడుతున్న రాజ్యాంగ ప్రచార వేదిక కో ఆర్డినేటర్ డీవీవీయస్ వర్మ, కార్మిక, ప్రజా సంఘాల నాయకులు డాక్టర్ రమేష్‌చంద్రబాబు, పేరూరి మురళికుమార్, కోనాల భీమారావు, పీవీ ప్రతాప్ తదితరులు


# నవంబరు 26 రాజ్యాంగ దినోత్సవం

తణుకులో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జరిగిన రాజ్యాంగ దినోత్సవ వజ్రోత్సవ సభకు అధ్యక్షత వహించిన డీవీవీయస్ వర్మ ప్రసంగిస్తూ ఆదేశిక సూత్రాల ప్రకారం ప్రజల ప్రయోజనాలకు ఉపయోగపడవలసిన జాతి భౌతికసంపద ప్రైవేటు వ్యక్తుల పరం చేయడం, సంపద కొద్ది మంది దగ్గర పోగు పడకూడదన్న ఆదేశానికి భిన్నంగా సంపద పోగు పడడం, మద్య నిషేధాన్ని సూచిస్తే ప్రభుత్వాలు మద్యాన్ని ఆదాయ మార్గం చేసుకోవడం రాజ్యాంగ ఆదేశాలకు విరుద్ధం అని స్పష్టం చేశారు. సభా ప్రారంభంలో అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు కోనాల భీమారావు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి పీవీ ప్రతాప్, సామాజిక న్యాయ పోరాట సమితి వ్యవస్థాపకులు పేరూరి మురళీకుమార్ ప్రజా ఉద్యమ ఆవశ్యకతను ప్రస్తావిస్తూ ప్రసంగించారు. రాజ్యాంగ దినోత్సవ స్ఫూర్తితో "వివిధ పన్నుల ద్వారా సంపద వికేంద్రీకరణ చేసి "అందరికీ స్వతంత్ర జీవనం" అన్న నినాదంతో 2025 జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవాన్ని అన్ని ప్రజా సంఘాల ఉద్యమంగా నిర్వహించాలని సభ నిర్ణయించింది. ఏఐటీయూసీ - సీఐటీయూ అనుబంధ కార్మిక సంఘాల ప్రతినిధులతోపాటు మాజీ మున్సిపల్ ఛైర్మన్ ఆకుల వెంకటేశ్వరరావు, తణుకు స్టడీ




సర్కిల్ డాక్టర్ రమేష్ చంద్రబాబు సామాజిక న్యాయ పోరాట సమితి గొల్లపల్లి అంబేద్కర్, లాయర్స్ యూనియన్ కామన మునుస్వామి, సీపీఐ బొద్దాని నాగరాజు, సీనియర్ సిటిజన్స్ నాయకులు అడ్డాల సత్యనారాయణ, కరుణాకరచౌదరి, శ్రీశ్రీ సేవా సమితి పి.దక్షిణామూర్తి, రాజ్యాంగ పరిరక్షణ సమితి సంకు మనోరమ, ప్రజాసాహితి జి.ఉష, పౌరహక్కుల సంఘం కొరు వెంకటేశ్వర్లు, మందలపర్తి హరీష్, షెడ్యూల్ కులాల సంక్షేమ సంఘం కొండే నాగేశ్వరరావు, దళిత ఐక్యవేదిక పొట్ల సురేష్, దళిత క్రైస్తవ వేదిక అబ్రహం, సైకిల్ రిపేర్ వర్కర్స్ హబీబ్, టైలర్స్ యూనియన్ కె.సుబ్బారావు, సమతా యువజన సంఘం రాజేష్, అంబేద్కర్ యువజన సంఘం ఏసు మునిబాబు తదితరులు పాల్గొన్నారు.

# 2025 జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం ప్రజా రిపబ్లిక్ దినోత్సవంగా నిర్వహించుకుందాం




1950 జనవరి 26న భారత రాజ్యాంగం అమలులోకి వచ్చి రిపబ్లిక్‌గా అవతరించింది. ప్రభుత్వ సంస్థలు రిపబ్లిక్ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాయి. అందులో ప్రజల భాగస్వామ్యం కొరవడుతున్నది. రాజ్యాంగం ప్రజలందరిదీ. దాని అమలు, రక్షణ బాధ్యత మనందరిదీ. అందుకే పౌర సంఘాలు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో “ప్రజా రిపబ్లిక్” దినోత్సవాన్ని నిర్వహించుకుందాం. 2024 నవంబరు 26న రాజ్యాంగ దినోత్సవాన్ని తణుకు ప్రచారవేదిక సారథ్యంలో అన్ని విద్యా సంస్థల సహకారంతో విద్యార్థులకు రాజ్యాంగాన్ని పరిచయం చేసే కార్యక్రమాన్ని, పీఠిక పఠనం, ప్రతిజ్ఞ కార్యక్రమాలను ఒక ఉద్యమరూపంలో నిర్వహించాం. రాజ్యాంగ ప్రచార కార్యక్రమాన్ని అన్ని తరహా పౌర సంఘాలకు, కార్మిక సంఘాలకు, విద్యార్థి, యువజన, మహిళా సంఘాలకు దళిత, బహుజన సంఘాలకు విస్తరింపజేయాలని సంకల్పించాం. రాష్ట్రంలో వివిధ పట్టణాలలో ఆసక్తిగల మిత్రులు ఈ కార్యక్రమాన్ని చేపట్టవలసిందిగా కోరుతున్నాం. జనవరి 26 రిపబ్లిక్ దినోత్సవం వరకు ఈ కింది కార్యక్రమాలను నిర్వహించాల్సిందిగా విజ్ఞప్తి చేస్తున్నాం.

1.విద్యార్థులకు తరగతి గదులలో రాజ్యాంగాన్ని పరిచయం చేసే కార్యక్రమం కొనసాగించాలి. వారికి వ్యాసరచన, క్విజ్, ప్రసంగ పోటీలు నిర్వహించాలి. జనవరి 26న సామూహికంగా పీఠిక పఠనం - ప్రతిజ్ఞ చేయించాలి.

2. రాజ్యాంగ ప్రచారానికి పరిరక్షణకు అన్ని తరహాల పౌర సంఘాలు, ఉద్యోగ సంఘాలు, ఉపాధ్యాయ సంఘాలు, లయన్స్, రోటరీ, మానవత వంటి సేవా సంస్థలు, సీనియర్ సిటిజన్స్, పెన్షనర్స్ సంఘాలు ఈ ఉద్యమంలో భాగస్వాములు కావాలి. ఈ సంఘాలు తమ సభలు, సమావేశాలలో రాజ్యాంగంలోని కొన్ని ముఖ్య అంశాలను పరిచయం చేసే కార్యక్రమం, రాజ్యాంగం మీద ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలి. జనవరి 26న తమ సంస్థలలో సామూహిక ప్రతిజ్ఞ సభలు, సమావేశాలు నిర్వహించాలి.


3. ట్రేడ్ యూనియన్లు, వృత్తి సంఘాలు, సకల శ్రమ జీవుల సంఘాలు, దళిత, బహుజన సంఘాలు తమ సభ్యులకు రాజ్యాంగంలోని కొన్ని ముఖ్య అంశాలను, ప్రత్యేకించి జీవించే హక్కు, ఆదేశిక సూత్రాల అమలు వంటి అంశాలను వివరించే కార్యక్రమాలు నిర్వహించాలి. రాజకీయంలో కేవలం ఓటర్లుగా, లబ్ధిదారులుగా వున్న పేద ప్రజానీకంలో తాము కూడా హక్కుదారులమన్న చైతన్యాన్ని కల్పించే కార్యక్రమం చేపట్టాలి. జనవరి 26న అన్ని ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ప్రజా రిపబ్లిక్ దినోత్సవాన్ని ప్రదర్శనలు, సభలు, సమావేశాల రూపంలో నిర్వహించాలి. ప్రతిజ్ఞలు చేయించాలి. 2025 రిపబ్లిక్ దినోత్సవ వజ్రోత్సవాన్ని అర్థవంతంగా ప్రజల భాగస్వామ్యంతో, సామాన్య ప్రజల ఆకాంక్షలను ప్రకటించే విధంగా నిర్వహించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

**రాజ్యాంగ ప్రచార వేదిక - తణుకు**




ఇది ఊహించిందే..!

వడ్డించేది మనోడైతే..









ఆ విషయంలో
దేవుడినైనా నిలదీస్తాం

కార్టూన్స్ : సతీష్ ఆచార్య


**RNI Title Code : APTEL 16175 - DAARI DEEPAM (Telugu Monthly)**


Vol : 3 - Issue No : 3 December 2024




## కొత్త పుస్తకాల స్వీకారం




if undeliverd please return to:
**B.Ramesh Chandra Babu**
34-15-1, Doddipatla Vaari Thota
Veedhi, Tanuku - 534 211
West Godavari, Ap
Phone No : 93971 14495

Printed Matter - Book Post

To :

Printer, Publisher and Owner Bhupatiraju Ramesh Chandrababu, Published from 34-15-1, Doddipatla Vaari Thota Veedhi, Tanuku - 534 211, AP. Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, 520 004. Editor : DVVS Varma.